RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ | 3 జనవరి 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:180

# హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం

## రేవంత్ రెడ్డి



వార్త 3 లో

## సీఎం రేవంత్ రెడ్డి మాటలు మూసీ కంటే కంపుగా ఉన్నాయి

### బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు



హైదరాబాద్ జనవరి 2 సీఎం రేవంత్ రెడ్డి మాటలు మూసీ కంటే కంపుగా ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సభలో ఉన్న సభ్యులందరికీ సమానమైన హక్కులు ఉంటాయని ఆయన తెలిపారు. సభ్యుల హక్కులను కాపాడాల్సింది స్పీకరేనని స్పష్టం చేశారు.ఏడు రోజులు సభ నడుపుతామని బీఏసీలో చర్చించామని హరీశ్‌రావు తెలిపారు. కానీ బీఏసీ కాపీలో 7 రోజులు అని ఎక్కడా లేదని పేర్కొన్నారు. సభ ఎజెండా వివరాలు అర్ధరాత్రి 2 గంటలకు వస్తే.. సభ్యులు ఎలా ప్రిపేర్ అవుతారని ఆయన ప్రశ్నించారు.కాగా, రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మూసీ సుందరీకరణ అంశంపై చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని వ్యాఖ్యానించారు. దీనిపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. సీఎం వ్యాఖ్యలపై చర్చించేందుకు సమయం ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. కానీ అందుకు స్పీకర్ నిరాకరించడంతో బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు.

## కేసీఆర్ సభకు రాకపోతే బీఆర్ఎస్ పని ఖతం కవిత



హైదరాబాద్ కేసీఆర్ తప్పు చేయకపోతే సభకు రావాలని కవిత అభిప్రాయం వ్యక్తం చేశారు. శాసనమండలి వద్ద మీడియా ప్రతినిధులతో కవిత ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా కేసీఆర్ అసెంబ్లీకి రాక పోవడంపై కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ సభకు రాకపోతే బీఆర్ఎస్ పని ఖతమైనట్లేనన్నారు. సభకు రాకుండా పిల్ల కాకులకు సభాసమయాన్ని వదలొద్దని కేసీఆర్‌కు సూచించారు. హరీష్ రావు కు ప్యాకేజీలు, అమ్ముకోవడం తప్ప ఏం తెలియదన్నారు. కేసీఆర్ పై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా ఖండించారు.హరీష్ రావు, రేవంత్ రెడ్డి,సీఎం చాంబర్ లో అరగంట మాట్లాడుకున్నారని కవిత ఆరోపించారు. కేసీఆర్ మాత్రమే నీటి పంపకాలపై సమాధానం ఇవ్వగలడని కవిత స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఫిక్సుడ్ మ్యాచ్ జరుగుతోందన్నారు. హరీష్ కు మాట్లాడే చాన్స్ ఇవ్వడం సరి కాదని కవిత స్పష్టం చేశారు. రేవంత్ వర్సెస్ హరీష్ అన్నట్లుగా అసెంబ్లీ నడవబోతోందని ఇది చాలా ప్రమాదకరమని కవిత వ్యాఖ్యానించారు. కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో తనకు తెలియదని తాను మాట్లాడి నాలుగు నెలలు అవుతోందన్నారు.కవిత కేసీఆర్ పై డైరక్ట్ గా ఇలా మాట్లాడటం ఇదే మొదటి సారి. కేటీఆర్, హరీష్ లకు వదిలేస్తే ఆశలు వదిలేసుకోవాల్సిందేనని ఆమె చెప్పడం ఓ పాయింట్ అయితే..కేసీఆర్ తప్పు చేయక పోతే అసెంబ్లీకి రావాలని అనడం మరో పాయింట్. సాధారణంగా విపక్ష నేతలు,ఆయన అసెంబ్లీకి రావాలని డిమాండ్ చేసేవారు ఈ పాయింట్ తో విమర్శలు చేస్తారు. కానీ కవిత అలాంటి వ్యాఖ్యలు చేశారు అంటే కవిత కూడా బీఆర్ఎస్ పార్టీనే కాదు,కేసీఆర్ ను రాజకీయంగా ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారని అనుకోవచ్చు.బీఆర్ఎస్ పార్టీ సస్పెండ్ చేసిన తర్వాత కవిత తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. కానీ మండలి ఛైర్మన్ ఆమోదించలేదు. సాధారణంగా అయితే రాజీనామాను ఆమోదించాలి. కానీ ఇప్పుడు ఆమోదిస్తే ఉపఎన్నికలు వస్తాయి. లోకల్ ఎలక్షన్స్ పూర్తి అయిన తర్వాత ఆమోదించాలన్న ఆలోచనలో ఉన్నారేమో కానీ, పట్టించుకోలేదు. ఈ కారణంగా కవిత మరోసారి శాసనమండలి స్పీకర్ ను కలిసి తన రాజీనామాను ఆమోదించాలని మరోసారి కోరారు.

## రాష్ట్రంలో యూరియా సంక్షోభంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన

### యూరియా కొరతకు నిరసనగా ప్లకార్డులు పట్టుకుని శాసనసభలో నిరసన



హైదరాబాద్ జనవరి 2 రాష్ట్రంలో యూరియా సంక్షోభంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. యూరియా కొరతకు నిరసనగా ప్లకార్డులు పట్టుకుని శాసనసభలో నిరసన తెలిపారు. షాపుల్లో దొరకని యూరియా యాప్‌ల్లో దొరుకుతుందా?, కాంగ్రెస్ వచ్చింది.. యూరియా కొరత వచ్చిందని ప్లకార్డులు ప్రదర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ప్లకార్డులతో శాసన సభకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారు. ప్లకార్డులతో లోనికి వెళ్లవద్దని సూచించారు. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదం జరిగింది. నేను మాట్లాడిన తర్వాతనే మీకు సరెండర్ లీవ్‌ల డబ్బులు వచ్చాయి.. ఇప్పుడు యూరియా మీద కూడా రైతుల పన మాట్లాడితేనే యూరియా వస్తుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. యూరియా కొరతపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణలో యూరియా కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులపై సభలో వెంటనే చర్చ జరపాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాయిదా తీర్మానం పెట్టారు.

## చిక్కడపల్లి, దోమల్ గూడ లింక్ బ్రిడ్జ్ ను ప్రారంభించిన మంత్రి పొన్నం



హైదరాబాద్ జీహెచ్ఎంసీ నిధులు రూ.6 కోట్లతో హుస్సేన్ సాగర్ సర్ ప్లస్ నాలా మీదుగా నూతనంగా నిర్మించిన చిక్కడపల్లి ? దోమల గూడ లింక్ బ్రిడ్జి ను మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్,ఎమ్మెల్యే ముఠా గోపాల్ , మేయర్ గద్వాల విజయలక్ష్మి,డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఆర్ వి కర్ణన్, అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్ రవి కిరణ్, స్థానిక కార్పొరేటర్ లు తదితరులు పాల్గొన్నారు..

## కవిత ఏ పార్టీలో ఉందో స్పష్టం చేయాలి: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్ జనవరి 2 ;: మాజీ సిఎం కెసిఆర్ వదిలిన బాణం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. కవిత కన్ఫ్యూజన్ లో ఉండి ప్రజలను కన్ఫ్యూజ్ చేస్తుందని అన్నారు. కవిత వ్యాఖ్యలకు కోమటిరెడ్డి కౌంటర్ ఇచ్చారు. కవిత ఏ పార్టీలో ఉందో స్పష్టం చేయాలని, తన తండ్రి మీద సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందింన కవిత.. మాజీ మంత్రి హరీష్ రావు మీద చేసిన వ్యాఖ్యలపై ఎందుకు స్పందించలేదని కోమటిరెడ్డి ప్రశ్నించారు.

ప్రజాబలం

3 జనవరి 2026 శనివారం

# రసవత్తరంగా బెంగాల్ రాజకీయం

పశ్చిమ బెంగాల్ ప్రస్తుతం ఒక నిర్ణయాత్మక రాజకీయ పర్వంలో ఉంది. 2026 అసెంబ్లీ ఎన్నికలకు రాష్ట్రం సిద్ధమవుతోంది. అధికార తృణమూల్ కాంగ్రెస్ 2011లో లెఫ్ట్ ఫ్రంట్‌ను ఓడించినన తర్వాత తొలిసారిగా రాష్ట్ర రాజకీయ వాతావరణం కాస్త గందరగోళంగా, అస్థిరంగా ఉంది. ఒకప్పుడు మమతా బెనర్జీకి ఎదురులేదు. ఆమె వ్యక్తిత్వం, మార్పు తీసుకువస్తానన్న ఆమె వాగ్దానం చుట్టూ తిరిగిన రాజకీయ కథనం ప్రస్తుతం మరింత గందరగోళాన్ని ప్రతిబింబిస్తోంది. 15 సంవత్సరాలు అధికారంలో ఉన్న టిఎంసి సర్కార్‌కు ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగానే ఉంది. ఇక బిజెపి రాష్ట్రంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఒకప్పుడు దాదాపు కనుమరుగైన స్థితినుంచి వామపక్షాలు కోలుకుని కాస్త తమ ఉనికిని చాటుకుంటున్నాయి. ఇక కోల్‌కతా సివిల్ పోల్స్ ఫలితాలు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రోడ్ షోలు సంస్థాగత జోక్యం, రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో మారుతున్న రాజకీయ సెంటిమెంట్లు రాబోయే ఎన్నికల ఫలితాలు 2021 మాదిరిగా ఉండబోవని సూచిస్తున్నాయి. ఈసారి ఎన్నికల్లో రాజకీయచిత్రం మారవచ్చు. త్రిముఖ పోటీలే ఉండవచ్చు. ప్రతి పార్టీ మరో పార్టీతోనే కాక, సొంత పార్టీలో తిరుగుబాటుదారులతో గట్టి పోటీ ఎదుర్కొనే పరిస్థితి రావచ్చు. 15 ఏళ్ల పాలన ప్రభుత్వ వ్యతిరేకతనే కాదు పాలకులకు అలసటను కూడా తెస్తుంది. ప్రభుత్వ నియామకాల్లో అవినీతి ఆరోపణలు, స్థానిక విద్యుత్ బ్రోకర్లపై పెరుగుతున్న ఆగ్రహం, సంక్షేమ పథకాల లబ్ధి పంపిణీలో రాజకీయ జోక్యంపై ఆందోళనలు ఉండనే ఉన్నాయి. ఒకప్పుడు భావోద్వేగశక్తిగా, విప్లవాత్మకంగా భావించిన మా మాటీ -మనుష్ కథనం ఆరోపణలకు కేంద్రంగా మారింది. అధికార వికేంద్రీకరణ వల్ల కొన్ని చోట్ల నియంత్రణ మరింత కఠినంగా మారింది. అయినా, బెంగాల్‌లో ప్రభుత్వ వ్యతిరేకత అంత తీవ్ర స్థాయిలో లేదు. వ్యవస్థపై అసంతృప్తి ఉన్నా, మమతా బెనర్జీని తిరస్కరించే అంతగా మారలేదు. రాష్ట్రంలో పేద కుటుంబాలకు అండగా మమతా ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్ష్మీ భండార్, కన్యశ్రీ, స్వాస్థ్యా సతి, రూపశ్రీ వంటి సంక్షేమ పథకాలు ఆమెకు వ్యక్తిగతంగా తిరిగి అధికారం అందించే గ్యారంటీగా నిలుస్తున్నాయి. బెంగాల్‌లో ఉన్న సెంటిమెంట్ ప్రభుత్వంలో మార్పును డిమాండ్ చేసే స్థాయిలో లేదు. టిఎంసి ప్రభుత్వం స్థానిక నాయకత్వంపై వస్తున్న ఆరోపణలను చక్కదిద్ది, సజావుగా సంక్షేమం అందేటట్లు చూడగలమని ఒప్పించాలి. ప్రభుత్వం మనుగడ సాగించాలంటే ఇది తప్పదు. మమతా బెనర్జీ ప్రజలలో విశ్వాసాన్ని పునరుద్ధరించి, అధికారం తిరిగి చేజిక్కించుకునేందుకు తగిన విధంగా మార్చగలరా అన్నదే అధికార పార్టీ ఎదుర్కొంటున్న ప్రశ్న. కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో సంక్లిష్టతకు తగిన సమాధానం దొరికింది. టిఎంసి విజయం సాధించి మహా నగరంపై తన నియంత్రణ నిలుపుకుంది. పాలక పార్టీకి ప్రస్తుతానికి ముఖ్యమైన ఆధిక్యత లభించింది. కోల్‌కతా కేవలం ఓ నగరం కాదు. రాజకీయంగా బలమైన ఘనమైన అడ్డా. దానిని నిలుపుకోవడం వల్ల క్షేత్రస్థాయిలో విమర్శలు, ఎన్నికలలో ఓటర్ల మద్దతు తగ్గుతుందన్న వాదనలో అర్థం లేదనే ప్రభుత్వ ధీమాకు బలం చేకూరింది. బిజెపికి సంబంధించినంత వరకూ స్థానిక ఎన్నికలు ఆ పార్టీ సంస్థాగత లోపాలను బయటపెట్టాయి. గత పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ దీటైన బలాన్ని ప్రదర్శించినా, నగర రాజకీయాల యంత్రాంగంలో తనను మమేకమైపోయేందుకు చేస్తున్న కృషిలో అది చాలా కష్టపడింది. వార్డు స్థాయి నుంచి సంస్థాగతంగా బలోపేతం కాకపోవడం అభ్యర్థుల ఎంపికలో లోపాల వల్ల బిజెపి చెప్పినంత బలంగా తనను తాను నిరూపించుకోలేకపోయింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదేపదే పర్యటనలు, రోడ్ షోలు, ఘనమైన ప్రసంగాలు, ఈ లోపాన్ని సవరించడమే లక్ష్యంగా పెట్టుకుని సాగాయి. బెంగాల్‌ను కైవసం చేసుకోవడం తమ పరిధికి మించిన పనిగా అంగీకరించేందుకు బిజెపి ఇష్టపడడం లేదని ఆయన ఉనికి సూచిస్తోంది. ఈ రోడ్ షో వల్ల రెండు ప్రయోజనాలు. అవి పార్టీ కేడర్‌ను ఉత్తేజపరుస్తాయి. కేంద్ర నాయకత్వం తమకు రాష్ట్రంలో అండగా ఉందని మద్దతుదారులకు భరోసా కల్పిస్తాయి. అయినా, రాష్ట్రంలో నమ్మకమైన నాయకత్వం నిర్మాణంలో, అంతర్గత వర్గ వివాదాలు, అస్థిరతను చక్కదిద్దడంలో ఇటువంటి ప్రయోగాలు ఏమాత్రం పనిచేస్తాయనే ప్రశ్న మిగిలే ఉంది. బిజెపి ప్రచారం ఎక్కువగా శాంతి భద్రతలు పరిరక్షణ, రాజకీయ హింసను నిర్మూలన, సుస్థిరమైన పాలన వంటి వాగ్దానాలకే పరిమితమైంది. అయితే, దానిని విజయం అది ఏ మేరకు బెంగాల్ నిర్దుష్ట మోడల్ పాలన అందించగలదనే అంశంపైనే ఆధారపడి ఉంది. మరో పక్క, లెఫ్ట్‌ఫ్రంట్ ఆచీతూచి అడుగులు వేస్తూ తన బలాన్ని పెంచుకునే స్థితిలో ఉంది. దీనిని పునరుజ్జీవనం గా అనలేం కానీ, పూర్తిగా తోసిపుచ్చలేం. కోల్‌కతా, అనేక జిల్లాలలో లెఫ్ట్‌ఫ్రంట్ ఓట్ల షేర్ మెరుగైంది. టిఎంసి, బిజెపి రెండింటి పట్ల భ్రమలు కోల్పోయిన ఒక వర్గం పాలక పక్షానికి ప్రత్యామ్నాయంగా కాకుండా రాజకీయ శూన్యం భర్తీ చేసేదిగా వామపక్షం వైపు చూస్తోంది. చాలామంది యువకులు, యువ ఓటర్లు, ముఖ్యంగా విద్యార్థులు, తొలిసారి ఓటు హక్కు పొందిన వారు వామపక్షాల వైపు మొగ్గుచూపుతున్నారు. వామపక్షం పాలనలో నిబద్ధతతో పని చేసిన పాలనా వ్యవస్థలను జ్ఞప్తి చేసుకుంటున్నారు. వామపక్షాలు గతంపై ఆధారపడకుండా, నిరుద్యోగం, ఆర్థిక అనిశ్చితి, సామాజిక ఆందోళనలను ఎదుర్కొంటున్న ఈ తరానికి తమ పాలన ఎలా ఉంటుందో వ్యక్తపరచి, నచ్చచెప్పడం, సందర్భోచితంగా మారడం అవసరం. 2026 ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రభంజనం వచ్చే అవకాశం లేనందున, సంప్రదింపులే కీలకం కాగలవు. సంఖ్యాపరంగా, సంస్థాగత కోణంలోనే కాక, పాలనాపరంగా టిఎంసి అధికారం వల్ల సంక్రమించిన ప్రయోజనాన్ని నిలుపుకుంటుంది. మమతా బెనర్జీ వ్యక్తిగత చరిష్మా, వ్యక్తిగతంగా ప్రజలతో మమేకమయ్యే స్వభావం, నాయకత్వం, సంక్షేమ పథకాలు ఆ పార్టీకి కొండంత బలం. బిజెపికి కేంద్రంలో జాతీయ స్థాయిలో అధికారం వల్ల ప్రయోజనం. ఎన్నికలను ఓ సైద్ధాంతిక పోరుగా మార్చే సామర్థ్యం, సమృద్ధిగా ఆర్థిక పరమైన వనరులు, మార్పు తీసుకు వస్తామని చేస్తున్న వాగ్దానం, ప్రజలను ఒప్పించే సామర్థ్యం అండగా నిలవవచ్చు. వామపక్షాలు, కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల పరమైన వాదన కన్నా, నైతికపరమైన భరోసా కల్పించేందుకు సిద్ధమవుతున్నాయి. రాజకీయంగా తెరమరుగయ్యారని భావించే ఓటర్లకు, తక్షణ విజయం కోసం కాకపోయినా, ఆ రెండు పక్షాలకు వ్యతిరేకంగా ఓటు వేయాలనుకునే వారికి తగిన ప్రత్యామ్నాయంగా నిలిచే అవకాశం ఉంది. బెంగాల్ ఓటర్లు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. బెంగాల్ లో రాజకీయపరమైన ప్రశ్న ఏమిటంటే, ఎవరు ఎవరిని ఓడించగలరు అని కాదు. ఎవరు విశ్వసనీయమైన పాలన అందించగలరు అన్నదే. టిఎంసి ఓటర్లను గతంలో మాదిరిగానే ఆదరించమని అడుగుతోంది. బిజెపి తమను ప్రత్యామ్నాయంగా భావించి ఓటర్లు రిస్క్ తీసుకోవాలని కోరుతున్నాయి. ఇక వామపక్షాలు తమను కూడా మరో ప్రత్యామ్నాయంగా చూడాలని అడుగుతున్నాయి. ఈ ప్రతిపాదనలు ఏవీ విజయానికి హామీ ఇవ్వవు. సాధారణ రాజకీయాల విభిన్న దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయి. పశ్చిమ బెంగాల్ ఈ ఎన్నికల్లో రెండు వ్యక్తిత్వాలలో దేనివైపు మొగ్గుచూపాలనే రాష్ట్రంగా కాక, సొంత రాజకీయ భవిష్యత్ కోసం చర్చిస్తున్న రాష్ట్రంగా నిలుస్తున్నది. ప్రజలలో చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఈ చర్చలు ఎలా ఉన్నాయంటే, 2026 తర్వాత పరిస్థితులు ఎలా ఉంటాయి. 15 ఏళ్లగా పాతుకుపోయిన సర్కార్‌ను కూల్చివేసి, కొత్త రాజకీయ వ్యవస్థను నిర్మిస్తే, వచ్చే ఐదేళ్లు ఆ క్రమం పరిణతి చెందుతుందా, మార్పు సాధ్యమవుతుందా, కొత్త దశ పోటీకి దారితీస్తుందా అనే గురించి కూడా కావచ్చు. కౌంట్ డౌన్ మొదలైంది. 2026లో ప్రజలు ఇచ్చే తీర్పు ఏ పార్టీకి అధికారాన్ని కట్టబెడుతుందని కాక, బెంగాల్ ఏ పాలనా దృక్పథాన్ని విశ్వసించేందుకు సిద్ధంగా ఉందో వెల్లడిస్తుంది.

# ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

**సాధ్యమైనంత త్వరగా పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తాం**

**మెడికల్, సప్లమెంటరీ శాలరీ పెండింగ్ బిల్స్ మొత్తం క్లియర్ చేశాం**

**ఆర్థిక భారాన్ని వాయిదా వేసేందుకు గత ప్రభుత్వం ఉద్యోగుల పదవి విరమణ వయసు పెంచింది**



ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది, గాడి తప్పిన ఆర్థిక విధానాన్ని దారిలో పెడుతున్నాం సాధ్యమైనది త్వరగా ఉద్యోగుల పెండింగ్ బిల్స్ క్లియర్ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం ఉదయం శాసన పరిషత్తులో సభ్యులు ఏవీఎన్ రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు డిప్యూటీ సీఎం సవివరంగా సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు వివిధ అవసరాల కోసం తీసుకున్న ఈ జువీ× ల కు ప్రతినెలా మొదటి తేదీన చెల్లించకపోతే బ్యాంకులు వారి ఖాతాలు డిఫాల్ట్ జాబితాలో చేరుస్తాయి. గత ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు 18 వ తారీఖున కూడా జీతాలు ఇచ్చిన పరిస్థితి ఉంది. దాంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మా ప్రభుత్వం వచ్చాక ఆలోచన చేసి ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపాము. ఉద్యోగులు మాలో భాగస్వాములుగా భావించి మేము అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతినెలా ఒకటవ తేదీన ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఉద్యోగుల జీతాలు చెల్లిస్తున్నాం అన్నారు. ఆర్థిక భారాన్ని వాయిదా వేసేందుకు ఉద్యోగుల ప్రయోజనాలు చెల్లించకుండా రిటైర్మెంట్ వయోపరిమితిని మూడు సంవత్సరాలకు గత ప్రభుత్వం పెంచిందని డిప్యూటీ సీఎం అన్నారు. ఆనాటి ప్రభుత్వం ఉద్యోగుల రిటైర్మెంట్ వయోపరిమితి పెంచకపోయి ఉంటే వాస్తవంగా 2021 నుంచి 2023 మధ్య సంవత్సరాల్లో 26,854 మంది పదవి విరమణ పొందాలి కానీ ఓయోపరిమితి పెంపుతో కేవలం 6,354 మంది మాత్రమే రిటైర్ అయ్యారని ఆర్థిక భారాన్ని వాయిదా వేసేందుకే గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం అన్నారు. ఆనాడు వాస్తవాలు తెలియక కొంతమంది పాలాభిషేకాలు చేశారని అన్నారు. 2023 డిసెంబర్ నాటికి గత ప్రభుత్వం మాకు వివిధ రకాల బకాయిల కింద 43,154 కోట్లు బిల్స్ పెండింగ్ లో పెట్టి వెళ్లిపోయిందని తెలిపారు. ఇందులో కేవలం ఉద్యోగుల బకాయిలే 4,575 కోట్లు ఉన్నాయి ఈ విషయాన్ని ఆర్థిక శ్వేత పత్రంలో సైతం వివరించామని డిప్యూటీ సీఎం తెలిపారు. మా ప్రభుత్వం వచ్చాక పెన్షన్ బెనిఫిట్స్ 1,752 కోట్ల రూపాయలు చెల్లించాము ఉద్యోగుల పెండింగ్ బిల్లులు 6,244 కోట్లు ఉన్నాయి ప్రాధాన్యత క్రమంలో ప్రతినెల ఇబ్బంది లేకుండా చెల్లిస్తూ వెళ్తున్నామని తెలిపారు. ప్రతినెల అదనంగా ఉద్యోగుల బకాయిలను క్లియర్ చేసేందుకు 700 కోట్లకు తక్కువ కాకుండా విడుదల చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం కనీసం ఒకటవ తేదీన జీతాలు చెల్లిఖచకపోవడంతో ఉద్యోగులు సకాలంలో చెల్లింపులు చేయలేక విష వలయంలో చిక్కుకొనిపోయారని మేము రాగానే వారితో మాట్లాడి ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రతి నెల మొదటి తేదీనే వేతనాలు చెల్లించాలని విధానపరమైన నిర్ణయం తీసుకొని ఒక్కరోజు కూడా ఆలస్యం లేకుండా చెల్లిస్తున్నాం, మెడికల్ బిల్లులు పెండింగ్ లో పెట్టడం అమానవీయ అంశంగా మా ప్రభుత్వం భావించి ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న 200 కోట్ల పైన మెడికల్ బిల్లులు మొత్తాన్ని క్లియర్ చేశాం, ఇకనుంచి ఏ నెలకు ఆ నెల మెడికల్ బిల్లులు క్లియర్ చేస్తామని తెలిపారు. ఇక సప్లిమెంటరీ శాలరీ ల విషయానికొస్తే 560 కోట్లు బకాయిలు మొత్తం క్లియర్ చేశాం ఇకనుంచి సప్లమెంటరీ శాలరీ బకాయిలు ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తామని డివిడి సీఎం తెలిపారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వారికి కావాల్సిన హెల్త్ స్కీమును వారే డిజైన్ చేసుకొని రావాలని చెప్పాం, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల్లో ప్రతి నెలా టెన్షన్ గా మొదటి తేదీన జీతాలు చెల్లించడం కూడా గొప్ప విషయమే అని డిప్యూటీ సీఎం తెలిపారు. మొదటి తేదీ నా జీతాలు ఇవ్వకపోతే ఉద్యోగులు ప్రైవేటు వ్యక్తుల దగ్గర అధిక వడ్డీల కోసం వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందని తెలిపారు.

# మూసీ ప్రళనతో చితికిపోతున్న నిరుపేదల బతుకులు

**అసలు మూసీ ప్రళన ఎక్కడి నుంచి ఎక్కడి వరకు చేస్తారు**

**వికారాబాద్ నుంచి గండిపేట వరకు ప్లాన్స్ ఏంటో చెప్పాలి**

**కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ**



హైదరాబాద్ జనవరి 2 మూసీ ప్రళనతో నిరుపేదల బతుకులు చితికిపోవద్దని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. అసలు మూసీ ప్రళన ఎక్కడి నుంచి ఎక్కడి వరకు చేస్తారని ప్రశ్నించారు. వికారాబాద్ నుంచి గండిపేట వరకు ప్లాన్స్ ఏంటో చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మూసీ ప్రళనపై జరిగిన చర్చలో అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. మూసీ ప్రళన వికారాబాద్ నుంచి చేస్తారా? మధ్యలో నుంచి చేస్తారా అని ప్రశ్నించారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ క్యాచ్‌మెంట్ ఏరియా ఎంత ఉందని అడిగారు. ప్రపంచంలో కాలుష్యంలో మూసీ 8వ స్థానంలో ఉందని తెలిపారు.మూసీ - ఈసా నదులు కావు.. అవి ఇప్పుడు సీవరేజ్ ప్లాంట్లు అని అక్బరుద్దీన్ విమర్శించారు. నగరంలోని మురుగు అంతా మూసీ నదిలోకే వెళ్తోందని తెలిపారు. గండిపేట జలాశయంలో కూడా మురుగు నీరు కలుస్తుందని అన్నారు. దశాబ్దాల కింద నిర్మించిన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లో పూడిక తీసి, వాటి సామర్థ్యం పెంచాలని కోరారు. నీటి నిల్వ సామర్థ్యం పెంచితే గోదావరి జలాలను తరలించవచ్చని తెలిపారు. చార్మినార్ వద్ద మూడేళ్ల కిందట మొదలుపెట్టిన పెడ(స్టేరియన్ ప్రాజెక్టు ఏమైందని ప్రశ్నించారు.

# హైదరాబాద్ శివారు ప్రాంతాలను కమ్మేసిన దట్టమైన పొగమంచు

**ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో రోడ్డు పక్కన వాహనాల నిలిపివే**

**దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం**



హైదరాబాద్ జనవరి 2 ;హైదరాబాద్ శివారు ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేసింది. తెల్లవారుజాము నుంచి పొగమంచు కమ్మేయడంతో రోడ్లు, భవనాలు ఏమీ కనిపించకుండా ఉంది. దీంతో నగర శివారు ప్రాంతాలైన ఇబ్రహీంపట్నం నాగార్జునసాగర్ హైవే, మేడ్చల్, తూంకుంట, శామీర్‌పేట, ఆదిబట్ల, గండిపేట, మోకిల, పటాన్‌చెరు, వికారాబాద్, రాజేంద్రనగర్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గాల్లో జీరో విజిబిలిటీ ఉంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో రోడ్డు పక్కన వాహనాలను నిలిపివేసుకున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శంషాబాద్ - బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. జాతీయ రహదారిపై శంషాబాద్ నుంచి పాలమాకుల వరకు దాదాపు 10 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పొగమంచు కమ్ముకోవడంతో రహదారి పక్కకు వాహనాలను నిలిపివేశారు. పొగమంచు కారణంగా ఔటర్ రింగ్ రోడ్డుపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై పొగమంచు దట్టంగా కమ్ముకుంది. అబ్దుల్లాపూర్మెట్ వద్ద పది అడుగుల దూరంలోని వాహనాలు కూడా కనిపించనంతగా పొగమంచు కుమ్ముకుంది. దీంతో ముందు వెళ్తున్న వాహనాలు కనిపించడం లేదు. విజిబిలిటీ లేకపోవడంతో లైట్ల వెలుతురులో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి.

# రోడ్డు భద్రత వారోత్సవ భాగం లో ఆర్ టీ సి డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమం



హైదరాబాద్ జనవరి. 2 రోడ్డు భద్రత వారోత్స వం భాగం లో కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు ఏ సి పి ఆదేశాల తో బర్కతపురఆర్ టీ సి డిపో లో మేనేజర్ మంజులతో కలిసి డ్రైవర్ లకు రోడ్డు భద్రత పై ముఖ్య సూచనలు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎస్ ఐ లు శ్రీకాంత్ ఆర్ ఎస్ ఐ తో పాటు రాకేష్ లు పాల్గొని డ్రైవర్లకు సూచనలు ఇచ్చారు.ముఖ్యం గా రోడ్డు పై కనురెప్పపాటున జరిగే ప్రమాదలను దృష్టిలో పెట్టుకుని, ప్రయాణికులను, కుటుంబ సభ్యులను అందరి గురించి ఆలోచించాలని కాగా బస్సు నడిపించే టప్పుడు సెల్ ఫోన్లో మాట్లాడవద్దని అన్నారు. అనంతరం డి ఏం మాట్లాడుతూ సంస్థ మనుగడ కోసం నిరంతరం శ్రామిస్తున్న కార్మికులు మీకుటుంబాలను, ప్రయాణికులభద్రతే మనకు ముఖ్యం అని అన్నారు. ఈ సదస్సు లో అధికారులు విజయ లక్ష్మి తో పాటు పలు వూరు డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామికులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనేదే మా సంకల్పం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ఇప్పటికీ హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయి. ఆగర్భ శ్రీమంతుల ఫామ్ హౌజుల డ్రైనేజీతో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ లొంకలుపుతుంటే ఉక్కు పాదం మోపామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.
శుక్రవారం అయన అసెంబ్లీలో మాట్లాడారు. రేవంత్ మాట్లాడుతూ మూసా, ఈసా నదుల సంగమం వద్ద మహాత్మా గాంధీ అస్థికలు కలిపిన చోట బాపూ ఘాట్ నిర్మించారు. మానవ నాగరికత నదీ పరివాహక ప్రాంతంలోనే అభివృద్ధి చెందింది. కాకతీయుల నుంచి నిజాం నవాబుల వరకు సాగు, తాగు నీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి అనుగుణంగా ప్రాజెక్టులు నిర్మించారు. 1908 లో నగరాన్ని వరద ముంచెత్తితే, వరద సమస్యకు శాశ్వత పరిష్కారంగా నిజాం సర్కారు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ప్రాజెక్టులను నిర్మించింది.
మూసీ నది ప్రక్షాళనపై ఎన్ని విమర్శలు వచ్చినా వెనక్కి తగ్గకుండా ముందుకు వెళ్లాం. లండన్ థేమ్స్ రివర్, న్యూయార్క్ జపాన్, సౌత్ కొరియా, సింగపూర్ లాంటి దేశాలను పర్యటించాం . ప్రపంచస్థాయి నగరాలన్నీ నదీ పరివాహక ప్రాంతాలను కాపాడుకున్నాయి . గుజరాత్ సబర్మతీ నది ప్రక్షాళన సమయంలో 60 వేల కుటుంబాలను తరలించారు. ఉత్తర్ ప్రదేశ్ లో గంగా నది ప్రక్షాళన చేసి రివర్ ఫ్రంట్ కట్టుకున్నారు. బీజేపీ నాయకులు వాటిని అభివృద్ధి మంత్రంగా ప్రచారం చేసుకున్నారు. మేం వాటిని వ్యతిరేకించలేదు. తప్పుపట్టడం లేదు. మూసీ కాలుష్యం కారణంగా నల్లగొండ జిల్లా ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారు. కంపెనీల కలుషితాల నుంచి జంతువుల కళేబరాల వరకు మూసీలో కలుస్తున్నాయి.. మూసీ పరీవాహక ప్రాంత మహిళలు గర్భం దాల్చలేకపోతున్నారని వైద్యులు చెప్పిన పరిస్థితి వుంది. ప్రపంచ నగరాలు అభివృద్ధి చెందుతున్న విధానాలను చూశాక మూసీలో శుద్ధమైన నీరు ప్రవహించాల్సిందేనని ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించాం . కన్సల్టెన్సీలను అపాయింట్ చేసుకుని మూసీ ప్రక్షాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పామని అన్నారు.
బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ రెండు నదులు కలిసే చోట వి షేప్ లో అభివృద్ధి జరుగుతోంది. గోదావరి జలాలను తరలించి మూసీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనుకుంటున్నాం. 20 ఎటిఅ లలో 15 టీఎంసీలు తాగు నీటి అవసరాలకు, 5 టీఎంసీలు మూసీ లో నిరంతరం శుద్ధమైన నీరు పాటించేందుకు ఉపయోగించాలనుకుంటున్నాం. మూడు నదుల సంగమంగా బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ను అభివృద్ధి చేయబోతున్నాం . మార్చి 31 లోగా అంచనాలు సిద్ధం చేసి టెండర్లు వేసి అభివృద్ధి చేయాలనుకుంటున్నాం. ఏడీబీ బ్యాంకు రూ. 4 వేల కోట్లు రుణం ఇచ్చేందుకు అంగీకరించింది . గాంధీ సరోవర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కూడా అనుమతించింది. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని భావిస్తున్నాం. ఓల్డ్ సిటీని మేం ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. ఓల్డ్ సిటీ ఒరిజినల్ సిటీ.. ప్రపంచంలోనే గొప్ప నగరంగా తీర్చిదిద్దుతాం. కొంతమంది నన్ను రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటున్నారు . రియల్ ఎస్టేట్ కూడా ఒక ఇండస్ట్రీ. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా ఇలాంటి విమర్శలే చేశారు . రోజు రోజుకు పట్టణీకరణ పెరుగుతుంది . రాబోయే 20 ఏండ్లలో 75 శాతానికి పట్టణీకరణ పెరుగుతుంది. మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరం . నేను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారు . నిజాలు ప్రజలకు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారు. వివరాలు చెబుతుంటే నొప్పి ఎందుకని ప్రశ్నించారు.
మూసీ ప్రక్షాళన చేయాలని వాళ్ల బీఆరెస్ ఎమ్మెల్యేలు కూడా కోరుతున్నారు . మూసీ పరీవాహక ప్రాంత పేదలకు మెరుగైన వసతులు కల్పిస్తామంటే వాళ్లు అలాగే ఉండాలన్నట్లుగా విపక్షం ప్రవర్తిస్తున్నది. మంచిరేవుల దగ్గర మూసీ పరివాహకంలో ఉన్న పురాతన శివాలయాన్ని అభివృద్ధి చేయబోతున్నాం. మూసీ పరివాహకంలో గురుద్వార్ , మసీదు, చర్చి లను నిర్మించి మత సామరస్యాన్ని చాటబోతున్నాం. డీపీఆర్ సిద్ధమయ్యాక అందరి సలహాలు, సూచనలు తీసుకుంటాం. గాంధీ సరోవర్ నిర్మాణానికి డిఫెన్స్ ల్యాండ్ ఇవ్వడానికి కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ గారు సూచనప్రాయంగా అంగీకరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలకు నా సూచన . మీ నియోజకవర్గాల్లో ఎలాంటి అభివృద్ధి కావాలో చెప్పండి . పేదలకు మంచి ఇండ్లు కట్టించి వారికి మెరుగైన వసతులు కల్పిద్దాం . హైదరాబాద్ ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనేదే మా సంకల్పం . మేం మంచి పని చేయాలనుకుంటున్నాం? మీ సూచనలు సలహాలు ఇవ్వండని అన్నారు.

## కర్ణాటక మాజీ మంత్రి, గాలి జనార్దన్ రెడ్డిపై హత్యాయత్నం



బంగళూరు జనవరి 2 కర్ణాటక మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డిపై హత్యాయత్నం జరిగింది. గురువారం రాత్రి బళ్లారిలోని హవంబావీ ప్రాంతంలో ఆయన ఇంటి వద్దే కాల్పులు జరిగాయి. బళ్లారి నగర ఎమ్మెల్యే భరత్ రెడ్డి సన్నిహితుడు సతీశ్ రెడ్డినే ఈ కాల్పులకు పాల్పడ్డారు. అయితే ఈ కాల్పుల నుంచి గాలి జనార్దన్ రెడ్డి తప్పించుకున్నారు.మహర్షి వాల్మీకి విగ్రహ ఏర్పాటు సందర్భంగా ఫ్లెక్సీపై చెలరేగిన వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలోనే గన్‌మెన్ తుపాకి లాక్కున్న సతీశ్ రెడ్డి రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. ప్రతిఘటించిన జనార్దన్ రెడ్డి అనుచరులు కూడా ఎదురుకాల్పులు జరపడంతో కాంగ్రెస్ కార్యకర్త రాజశేఖర్ మృతిచెందగా.. సతీశ్ రెడ్డికి బుల్లెట్ గాయమైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో బళ్లారిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

## వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయం లో అఖండ భజన

### టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జయా గుణ చైతన్య రెడ్డి లు పాల్గొని ప్రత్యేక పూజలు



సంగారెడ్డి జనవరి 2 సంగారెడ్డి పట్టణం లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం లో నూతన సంవత్సరం సందర్భంగా అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. వాసవి ఆలయ కమిటీ చైర్మెన్, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్ ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమం లో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జయా గుణ చైతన్య రెడ్డి దంపతుల తో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లో. నిర్మల జగ్గారెడ్డి, గుణ చైతన్య రెడ్డి లను సత్కరించారు. కరణ్ గజేంద్ర స్వామి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన భజన కార్యక్రమం భక్తులను అలరించింది. వాసవి మాతా ఆలయానికి భూమిని ఇచ్చిన దాతలతో వివరాలతో కూడిన శిలాఫలకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. దాతలను సత్కరించారు.

## రామస్వామి క్యాంప్ గ్రామంలో ఉచిత ఫ్యామిలీ హెల్త్ కార్డ్ కార్యక్రమం విజయవంతం



నిజామాబాద్ (ఆలూరు) జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రామస్వామి క్యాంప్ గ్రామంలో వెల్నెస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత ఫ్యామిలీ హెల్త్ కార్డ్ నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. గ్రామ ప్రజల ఆరోగ్య భద్రత లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెల్నెస్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ బృందం గ్రామస్తులకు ఫ్యామిలీ హెల్త్ కార్డుల ప్రయోజనాలపై అవగాహన కల్పించి, మొత్తం 110 ఫ్యామిలీ హెల్త్ కార్డులను నమోదు చేశారు.ఈ కార్యక్రమం సుమన్, ప్రమోద్, సిద్దు మరియు ప్రభు చరణ్ పర్యవేక్షణలో సక్రమంగా జరిగింది. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, వెల్నెస్ హాస్పిటల్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ స్థాయిలో ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని గ్రామాల్లో నిర్వహిస్తామని వెల్నెస్ హాస్పిటల్స్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ పసుల పుష్ప మరియు ఉప సర్పంచ్ సైలూ తదితేరులు పాల్గొన్నారు.

## బీజేపీ అజేయమైన శక్తిగా ఎదగాలి..

### గ్రూపులు బువ్వ పెట్టవు.. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు

### నన్ను గెలిపించారు.. మీ గెలుపు కోసం నేను కూడా కష్టపడతాను

### నువ్వు లీడర్లను గౌరవిస్తేనే.. నిన్ను కార్యకర్తలు గౌరవిస్తారన్నారు

### మున్సిపల్ ఎన్నికల సన్నాహాస సభలో ఎంపి ఈటల రాజేందర్.



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జనవరి 2 ;రాజకీయ నాయకుడికి గెలవడమే అంతిమ గీటురాయి సుపరిపాలన, ప్రజలు మెచ్చే పాలన అందించడమే భారతీయ జనతా పార్టీ లక్ష్యం అని ఈటల రాజేందర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల సన్నాహాస సభలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ మన పరివార క్షేత్రాలు అనేక సమస్యల మీద కొట్లాడుతాయి. కానీ వాటిని పరిష్కరించే సత్తా అధికారంలోకి వస్తేనే ఉంటుంది. అనేక సంవత్సరాల స్వప్నం 370 ఆర్టికల్ రద్దు కేంద్రంలో ప్రభుత్వం ఉండటంవల్లనే సాధ్యమైంది. రామాలయం కోసం అనేకమంది ప్రాణ త్యాగాలు చేశారు, వేలమంది జైల్లో మగ్గారు. చివరికి అది ఫుల్ ఫిల్ అయింది అంటే కేంద్రంలో మన ప్రభుత్వం ఉండటం వల్లనే.అధికారం రాకపోతే.. మనం గెలిచిన వారి ఇంటి ముందు కాపలాకాయాల్సిందే నన్నారు. మస్కా కొట్టి పని చేయించుకునే పరిస్థితి పోవాలంటే మనం గెలవాలి. దుర్మార్గాన్ని ఆపగలిగే శక్తి అధికారానికే ఉంటుంది. నేను ఎంపీగా గెలిచానంటే అది మీ అందరి అండతోనే. నా 25 సంవత్సరాల రాజకీయ జీవితంలో.. హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్క ఎంపీపీ కానీ.. ఒక్క జడ్పిటిసి కానీ.. ఒక మున్సిపల్ చైర్మన్ కానీ... నీటి సంఘాల చైర్మన్లు సింగిల్ విండో చైర్మన్లు ఏదీ ఓడిపోలేదు. వయసు, రాజకీయ జీవితం చిన్నదే అయినా.. తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా కొట్లాడాను.. ఒక 40 ఎలక్షన్స్ కు ఇంచార్జిగా పనిచేశాను.గెలవాలంటే మొట్టమొదటిగా.. మంచి అభ్యర్థిని ఎంపిక చేయండి అని పిలుపునిచ్చారు. సామాజిక వర్గాల సమీకరణ మర్చిపోవద్దు. వాతావరణ కల్పన జరగాలి.
ఎదుటివారికి చెమటలు పట్టించాలి. గట్టి లీడర్లను పార్టీలో చేర్చుకోవాలి. భారతీయ జనతా పార్టీ 2 ఎంపీ సీట్లు గెలిస్తే అది ఒకటి గుజరాత్ నుంచి ఇంకోటి తెలంగాణ నుంచి.. ఇప్పుడు గుజరాత్ ఎక్కడ ఉంది తెలంగాణ ఎక్కడ ఉంది ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఒక పెద్ద మనిషి మమ్మల్ని హెచ్చరించారు. 27 ఏళ్ల తర్వాత కూడా గుజరాత్ లో మళ్లీ అధికారంలోకి వస్తే..45 ఏళ్ల తర్వాత కూడా తెలంగాణలో అధికారం వస్తుందో రాదో అనే సంశయంలో ఉన్నారు అని అన్నారు. పార్టీలో చేరిన లీడర్లను గౌరవించండి అక్కున చేర్చుకోండి కాకులు గద్దల లెక్క పొడవకండి. రాజకీయాల్లో విశాల హృదయంతో ఉండాలి, గొప్పగా ఆలోచించాలి. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు. బీజేపీ నేతలు కూడా అలా ఆలోచన చేయాలన్నారు. పరిపక్వత పెరగాలి కలిసి పనిచేయాలి.
స్థానికంగా గ్రూపులు మంచివి కావు. గ్రూపులు బువ్వ పెట్టవు. ఉన్న శక్తే తక్కువ ఇందులో గ్రూప్స్ అవసరమా ? తెలంగాణ ఉద్యమం కోసం కాళ్ళ మీద పడి నాయకులను కాపాడుకున్నాం. వేరే పార్టీ వారిని తెచ్చుకున్నాం, ఎన్నికల్లో గెలిపించుకున్నాం.మల్కాజిగిరి పార్లమెంట్ లో 1992 నుండి ఉంటున్న నన్ను నాన్ లోకల్ అని ప్రచారం చేస్తున్న వారిని పట్టించుకోవద్దు. 25 ఏళ్ల నుండి పార్టీని నమ్ముకునే పని చేసే నిజమైన కార్యకర్తకు పిల్లల ఫీజు కట్టే డబ్బులు కూడా ఉండవు. పార్టీ బలంగా ఉంటే గెలవడానికి పైసలు అక్కర్లేదు. కేవలం డబ్బుతోనే రాజకీయాలు నడవవన్నారు.. నేను పొత్తుల సద్దిని.మోడీ గారు ప్రధానమంత్రి అయితేనే దేశం సుభిక్షంగా ఉంటుందని దేశవ్యాప్తంగా ఒక వేవ్ వచ్చింది. ఈటల రాజేందర్ వల్ల కొంచెం ఎక్కువ ఓట్లు రావచ్చు కానీ గెలిచింది మాత్రం మోదీ గారి వల్లనే. ఆ వేవ్ ను మనకు అనుకూలంగా మార్చుకోవడం వల్లనే నాలుగు లక్షల మెజారిటీ వచ్చింది. గౌరవం పరస్పరంగా ఉండాలి. నువ్వు లీడర్లను గౌరవిస్తేనే.. నిన్ను కార్యకర్తలు గౌరవిస్తారన్నారు. బీజేపీ అజేయమైన శక్తిగా ఎదగాలి. నన్ను మీరు గెలిపించారు. మీ గెలుపులో ఉడత భక్తిగా సాయం చేస్తా.నా చేతులు దండం పెట్టడానికి అలవాటు పడ్డాయి.
నాకు ప్రజలే దేవుళ్ళు. మీకోసం ఎన్నిసార్లయినా దండం పెడతా. మంచికి ఎప్పుడూ గొప్ప స్థానం ఉంటుంది. మన కొట్లాట వల్ల జి హెచ్ ఎం సి లో మన కార్పొరేటర్స్ కి 300 కోట్ల నిధులు వచ్చాయి. బీజేపీ లెటర్ ప్యాడ్ మీద లెటర్ పెడితే కోట్ల నిధులు వచ్చాయి. మోడీ గారు ఎప్పుడూ నేను ఇచ్చిన అనరు, నేను సేవకుడిని మాత్రమే.. ప్రజలే యజమానులు అని అంటారు. ఇక్కడున్న సంకుచిత వాదులు మాత్రం నేను ఇచ్చిన అంటారు.గెలుపే లక్ష్యంగా పనిచేయడం నుండి నేను మీకు అండగా ఉంటాను.జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి సీనియర్ నాయకులు సుదర్శన్ రెడ్డి నందా రెడ్డి చంద్రారెడ్డి శోభమ్మ రామోజీ సురేష్ మోహన్ రెడ్డి సుధాకర్ లక్ష్మమ్మ శైలజ వెంకటరెడ్డి శ్రీనివాస్ పావని తదితరులు పాల్గొన్నారు

## నిస్వార్థ సేవలకు నీరాజనం.. లక్ష్మీదేవి అవార్డుల ప్రదానం




హైదరాబాద్ జనవేరి 2 నూతన ఆంగ్ల నామ సంవత్స రాన్ని పురస్కరించుకుని మాతృదేవోభవ సత్సంగ్ సంఘమిత్ర అసోసియేషన్ సయుక్త ఆధ్వర్యంలో వివిధరంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి అవార్డుల ప్రదానం వైభవంగా జరిగిందిఅబిడ్స్ లోని సూర్యలోక్ కాంప్లెక్స్ లో మాజీ మంత్రి ,మాజీ సిడబ్ల్యుసి సభ్యురాలు లక్ష్మీ దేవి గారి పేరుతో జరిగిన అవార్డు ప్రదాన కార్యక్రమంలో మాతృదేవోభవ సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేబీ శ్రీధర్ ముఖ్యఅతిథిగా ఆదిలీల ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఆదినారాయణ ,కాంగ్రెస్ అధికార ప్రతినిధి సామాజిక సేవా కార్యకర్త రమేష్ వీరబొమ్మన , ఆర్ పి ఐ నాయకులు పీపుల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధినేత బాలకృష్ణ దయానిధి , ప్రముఖ టివి జర్నలిస్ట్ అరుణ రవికుమార్ రఘు అరికపూడి విశిష్ఠ అతిధులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అరుణ రవికుమార్, జి సునీతారెడ్డి,రామసుబ్రమణ్యం, సత్యదీప్తి, డాక్టర్ వడలి శ్రీనివాస్, లత , కనకవర్దిని, నివేదిత, డాక్టర్ కామేశ్వరి,ఉమా కాత్యాయిని, కుమారి అవార్డులు స్వీకరించారు.కార్యక్రమం లో ముఖ్య అతిథిగా విచ్చేసిన లక్ష్మీదేవి గారి కుమారుడు శ్రీధర్ గారు మాట్లాడుతూ లక్ష్మీదేవి మంత్రిగా నాయకురాలుగా ఆమె చేసిన సేవలను కొనియాడారు డాక్టర్ శివలెంక ఉదయలక్ష్మి సంస్థ ఆశయాలు వివరించారు. డాక్టర్ అంజనిరెడ్డి, విశ్వాప్రగసత్యనరాయణ మూర్తి, రాజ రాజేశ్వరి మా రెళ్ళ సమన్వయ కర్తలుగా వ్యవిహరించారు

# ఏపీలో కొత్తగా నాలుగు విద్యుత్ ప్లాంట్లు

నెల్లూరు జనవరి 2, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘన వ్యర్థాల సమస్యకు చెక్ పెట్టేస్తోంది! రాష్ట్రంలో కొత్తగా నాలుగు చోట్ల చెత్త నుంచి కరెంటు ఉత్పత్తి చేసే ప్లాంట్లు రానున్నాయి. విశాఖ, గుంటూరు తర్వాత ఇప్పుడు నెల్లూరు, కాకినాడ, కడప, కర్నూలు జిల్లాల్లో ఈ ప్లాంట్లు కొలువుదీరనున్నాయి. దీనితో పర్యావరణానికి మేలుతో పాటు, విద్యుత్ అవసరాలు తీరనున్నాయి. ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయిఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘన వ్యర్థాల సమస్యను పరిష్కరించడానికి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొత్తగా చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసేలా నాలుగు ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును డిస్కంలకు సరఫరా చేయడానికి ఒప్పందం చేసుకున్నారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రి నారాయణ, ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంపై డిస్కంల అధికారులు, ప్లాంట్ల నిర్వాహకులు సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం కొత్తగా ఏర్పాటుచేస్తున్న నాలుగు ఘన వ్యర్థాల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల నుంచి వచ్చే కరెంటును డిస్కంలు కొనుగోలు చేస్తాయి. దీనివల్ల రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణతో పాటు విద్యుత్ ఉత్పత్తి కూడా పెరుగుతుంది.ప్రస్తుతం విశాఖపట్నం, గుంటూరులలో ఇప్పటికే ఇలాంటి ప్లాంట్లు పనిచేస్తున్నాయి. ఇప్పుడు నెల్లూరు, కాకినాడ, కడప, కర్నూలు జిల్లాల్లో కొత్త ప్లాంట్లు రానున్నాయి. ఈ ప్లాంట్లు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మిస్తున్నారు. ఈ కొత్త ప్లాంట్లు పూర్తయితే, రాష్ట్రంలో రోజుకు 7వేల టన్నుల ఘన వ్యర్థాలను విద్యుత్తుగా మార్చవచ్చు. ఇది పర్యావరణానికి మేలు చేయడంతో పాటు, విద్యుత్ అవసరాలను తీర్చడంలో కూడా సహాయపడుతుంది.

వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేయడం అనేది ఒక ఆధునిక పద్ధతి. దీనివల్ల చెత్తను పారవేయడం సులభం అవుతుంది. అలాగే, కరెంటు కూడా ఉత్పత్తి అవుతుంది. ఈ ప్రక్రియలో, వ్యర్థాలను కాల్చి లేదా ఇతర పద్ధతుల ద్వారా వేడి చేసి, ఆ వేడితో టర్బైన్లను తిప్పి విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. 'వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేయడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు, రాష్ట్రానికి అదనపు ఆదాయాన్ని కూడా సమకూర్చవచ్చు' అన్నారు మంత్రి నారాయణఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యేలా చూస్తాం.. డిస్కంలు, ప్లాంట్ల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలి' అన్నారు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు కానున్న నాలుగు కొత్త ప్లాంట్లకు అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం కేటాయిస్తుందని మంత్రి నారాయణ తెలిపారు. ప్రైవేట్ సంస్థలు ఒక్కో ప్లాంట్ ఏర్పాటుకు రూ.350 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును డిస్కంలకు సరఫరా చేయడానికి ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పట్టణ, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల నుంచి వచ్చే 7,500 టన్నుల వ్యర్థాలలో 7,000 టన్నులు ఈ ప్లాంట్లకు వెళ్తాయన్నారు. మిగిలిన 500 టన్నుల వ్యర్థాల నిర్వహణకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నామన్నారు.

ఈ ప్లాంట్ల నిర్మాణం వచ్చే రెండేళ్లలో పూర్తవుతుందని.. మార్కెట్ వ్యర్థాల నిర్వహణకు ఏడు ప్లాంట్లు, విశాఖ, విజయవాడ, తిరుపతిలో మూడు ఈ-వేస్ట్ ప్లాంట్లు, మరో మూడుచోట్ల చికెన్ వేస్ట్ ప్లాంట్ల ఏర్పాటుకు టెండర్లు పిలుస్తున్నామని మంత్రి నారాయణ చెప్పారు.ఈ కొత్త విద్యుత్ ప్లాంట్లు వ్యర్థాల నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేస్తాయి. దీనివల్ల పర్యావరణానికి మేలు జరుగుతుంది. ప్రైవేట్ సంస్థలు పెట్టుబడులు పెట్టడం వల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గుతుంది. ఈ ప్లాంట్లు పూర్తయితే రాష్ట్రంలో విద్యుత్ కొరత తీరడంతో పాటు, వ్యర్థాల నిర్వహణ సమస్య కూడా పరిష్కారం అవుతుంది. ఈ-వేస్ట్ ప్లాంట్లు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సురక్షితంగా పారవేయడానికి ఉపయోగపడతాయి. చికెన్ వేస్ట్ ప్లాంట్లు మాంసం వ్యర్థాలను ఉపయోగించుకుంటాయి. ఈ విధంగా, రాష్ట్రం వ్యర్థాల నిర్వహణలో ఒక ముందడుగు వేస్తోంది.

# అడ్డంగా బుక్కైన ఎమ్మెల్యే

తిరుపతి జనవరి 2, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రాజకీయాల్లో కలకలం రేపిన జనసేన కార్యకర్త శ్రీనివాసులు అలియాస్ రాయుడు హత్య కేసు కీలక మలుపు తిరిగింది. ఏడాది కాలంగా మిస్టరీగా, రాజకీయ ఆరోపణల నడుమ సాగుతున్న ఈ కేసు విచారణలో చెన్నై పోలీసులు దూకుడు పెంచారు. ఈ హత్యతో సంబంధం ఉందన్న అనుమానాలు, మృతుడి వీడియో వాంగ్మూలం ఆధారంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని విచారించేందుకు చెన్నై పోలీసులు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇదే జరిగితే జిల్లా రాజకీయాల్లో పెను సంచలనం ఖాయంగా కనిపిస్తోంది.ఈ కేసులో ప్రాథమికంగా జనసేన మాజీ ఇన్‌ఛార్జి కోట వినుత, ఆమె భర్త కోట చంద్రబాబులను నిందితులుగా భావించినప్పటికీ, మృతుడు రాయుడు చనిపోవడానికి ముందు చిత్రీకరించిన ఒక వీడియో ఇప్పుడు విచారణను మరో మలుపు తిప్పింది. సుమారు 19.42 నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియోలో రాయుడు సంచలన విషయాలను వెల్లడించారు. తనను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రలోభపెట్టారని, తన అనుచరుడు సుజిత్‌రెడ్డి ద్వారా సంప్రదింపులు జరిపారని రాయుడు ఆ వీడియోలో పేర్కొన్నట్లు సమాచారం. ముఖ్యంగా కోట దంపతులను రోడ్డు ప్రమాదంలో అంతమొందించాలని తనపై ఒత్తిడి తెచ్చినట్లు రాయుడు చెప్పడం గమనార్హం. ఈ వీడియోనే ఇప్పుడు ఎమ్మెల్యే మెడకు చుట్టుకునేలా కనిపిస్తోంది.గతంలో ఈ కేసులో అరెస్టయిన కోట వినుత, చంద్రబాబులు మొదటి నుంచి తాము నిర్దోషులమని వాదిస్తూనే ఉన్నారు. రాయుడు హత్యలో తమ ప్రమేయం లేదని, ఇదంతా రాజకీయ కుట్రలో భాగంగా తమను ఇరికించే ప్రయత్నమని వారు ఆరోపించారు. దీని వెనుక ఎమ్మెల్యే బొజ్జల హస్తం ఉందన్నది వారి ప్రధాన ఆరోపణ. ఇప్పుడు రాయుడి వీడియో బయటకు రావడం, అందులో బొజ్జల పేరు ప్రస్తావనకు రావడంతో కోట దంపతుల వాదనకు బలం చేకూరుతోంది. ఈ నేపథ్యంలోనే కోట దంపతుల వాంగ్మూలాన్ని, రాయుడి వీడియోను సాంకేతిక ఆధారంగా తీసుకుని చెన్నై పోలీసులు ఎమ్మెల్యేను విచారించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాళెం గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక కార్యకర్త శ్రీనివాసులు అలియాస్ రాయుడు గతేడాది జులై 7న అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. జులై 7న అదృశ్యమైన రాయుడి మృతదేహం మరుసటి రోజు చెన్నైలోని కూవం నదిలో తేలింది. అప్పట్లో ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. కేసు నమోదు చేసిన చెన్నై పోలీసులు దర్యాప్తు చేపట్టి కోట వినుత దంపతులతో పాటు వారి అనుచరులు గోపి, కారు డ్రైవర్ షేక్ దాసన్, శివకుమార్‌లను అరెస్టు చేశారు. అయితే, ఇది కేవలం వ్యక్తిగత కక్షల వల్ల జరిగిన హత్య కాదని, దీని వెనుక పెద్ద రాజకీయ హస్తం ఉందన్న అనుమానాలు అప్పట్లోనే వ్యక్తమయ్యాయి.ఈ కేసులో ఇటీవల జనసేనకే చెందిన పేట చంద్రశేఖర్‌ను పోలీసులు విచారించారు. ఆయన నుంచి సేకరించిన సమాచారం, రాయుడి వీడియో, కోట దంపతుల ఆరోపణలన్నింటినీ క్రోడీకరించుకున్న చెన్నై పోలీసులు.. తదుపరి చర్యగా ఎమ్మెల్యే బొజ్జలకు సమన్లు జారీ చేసే అవకాశం ఉంది. అయితే, బొజ్జల సుధీర్‌రెడ్డి మాత్రం ఈ ఆరోపణలను గతంలోనే ఖండించారు. రాయుడి హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కానీ, సాక్ష్యాధారాలు వేరేలా ఉండటంతో పోలీసుల చర్య ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికరంగా మారింది.ఒక కార్యకర్త హత్య కేసులో ఏకంగా సిట్టింగ్ ఎమ్మెల్యే విచారణకు హాజరు కావాల్సి రావడం రాజకీయంగా ఆయనకు ఇబ్బందికర పరిణామమే.

ఒకవేళ రాయుడు వీడియోలో పేర్కొన్నట్లుగా.. కోట దంపతుల హత్యకు కుట్ర జరిగిందని రుజువైతే, ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లోనే సంచలనం సృష్టిస్తుంది. ఇది కేవలం హత్య కేసుగానే కాకుండా, రాజకీయ ప్రత్యర్థులను అంతమొందించేందుకు జరిగిన కుట్రగా మారే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో చెన్నై పోలీసుల విచారణలో ఇంకెన్ని కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయో వేచి చూడాలి.

# వైసీపీకి మరో తలనొప్పి



ఏలూరు, జనవరి 2, వైఎస్ఆర్‌సీపీకి దేవుడే దిక్కయ్యాడు. అది కూడా హిందూ దేవుళ్లే దిక్కయ్యారు. ఎందుకంటే రాజకీయాలు చేయడానికి. ఎక్కడ ఏ చిన్న అంశం జరిగినా పెద్దవివాదం చేసేందుకు వచ్చేస్తున్నారు. ఆ వివాదంతో హిందువుల్ని తమ వైపు తిప్పుకోవాలని అనుకుంటున్నారేమో కానీ.. వారు దేవుడితో చేస్తున్న రాజకీయమే హైలెట్ అవుతోంది. ఓ క్రిస్టియన్ నేతృత్వంలో ఉన్న పార్టీ హిందువుల్ని.. హిందూ దేవుళ్లను చులకన చేయాలని చూస్తోందన్న ఆరోపణలకు కారణం అవుతోంది. కానీ వైసీపీ నేతలు మాత్రం ఈ విషయాన్ని గుర్తించలేక తమ గుడ్డెద్దు చేలో పడిన తరహా రాజకీయాలు తాము చేసుకుటూ పోతున్నారు.మనుషుల్లో రకరకాల మనస్థత్వాలు ఉన్న వారు ఉంటారు. కోపంతో..కసితో..కక్షతో తాము ఏం చేస్తున్నామో తెలియని స్థితిలో నేరాలు చేసేవారు ఉంటారు. అలాంటి వాడొకడు..ద్రాక్షామంలో శివలింగాన్ని ధ్వంసం చేశాడు. ఓ పూజారిపై కోపంతో .. ఆ శివలింగాన్నిఆ పూజారి రోజూ పూజలు చేస్తాడన్న కారణంతో ఆ శివలింగాన్ని ధ్వంసం చేశాడు. అతను కూడా శివభక్తుడే .కానీ ద్వేషంతో అతని కళ్లు మూసుకుపోయి ఘోరం చేశాడు. దానికి అతను శిక్ష అనుభవిస్తాడు. కానీ ఈ ఘటనతో రాజకీయం చేయాలనుకున్న వైసీపీ .. అంత కంటే పెద్ద తప్పిదం చేసింది. దేవుడికి జరగాల్సిన కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నం చేసింది. దీన్ని రాజకీయం చేయాలనుకుంది.హిందూ దేవుళ్ల విషయంలో వైసీపీ ఎలాంటి జోక్యం చేసుకున్నా అది ఆ పార్టీకి పెను సమస్యగా మారుతుంది. ఆపార్టీ బ్యాక్ గ్రౌండ్ అలాంటిది. ఆ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో టీటీడీని ఎంత భ్రష్టుపట్టించారో మరో ఇరవై ఏళ్ల వరకూ హిందువులు మర్చిపోయారు. ఉద్ధృతంగా సాగిన మత మార్పిళ్లకు జగన్ ప్రభుత్వం ఎలా సహకరించిందో కూడా మర్చిపోరు. వైసీపీ నేతల్లో చాలా మంది హిందువులు ఉంటారు. దేవుడిపై అమితమైన భక్తిని చూపిస్తూ ఉంటారు. కానీ వారే దేవుడిని దోపిడీ చేశారు. హిందూత్వాన్ని కించపరిచారు. ఇలాంటివన్నీ ప్రజల ముందు ఉన్నాయి. వైసీపీ నేతలు ఇప్పుడు తాము హిందూత్వాన్ని కాపాడుతామని.. కూటమి ప్రభుత్వంలో ఏదో జరిగిపోతుదంని వస్తే ప్రజలు నమ్మరు. ఏమైనా చేసినా అది వైసీపీ నేతలే చేసి ఉంటారని అనుమానిస్తారు. వారి ఇమేజ్ అలాంటిది.వైసీపీ నేతలు దేవుడ్ని నమ్మకోవాలి. ఏ దేవుడ్ని నమ్ముతారో ఆ దేవుడిక్ ప్రార్థనలు చేయాలి. పూజలు చేయాలి. కానీ రాజకీయం చేయకూడదు. వివాదాలు సృష్టించి రాజకీయం చేస్తే మొదటికే మోసం వస్తుంది. ఇప్పటికే వారు దేవుడికి చేసిన అన్యాయం అంతా ఇంతా కాదు. కర్మప్రకారం శిక్షలు అనుభవించాల్సిందే. ఆ శిక్షలు అనుభవిస్తున్నారు కూడా. అందుకే.. ఇప్పటికైనా తెలుసుకుని వైసీపీ నేతలు.. దేవుడిపై కుట్రలు చేయడం.. సంబంధం లేని అంశాలతో హిందూత్వాన్ని కించపరిచేలా చేయడం మానుకుంటే.. దేవుడి ఆగ్రహానికి గురి కాకుండా ఉంటారన్న సలహాలు సొంత పార్టీ నుంచే వస్తున్నాయి

# 4న భోగాపురంనుంచి ట్రయిల్ రన్

విజయనగరం, జనవరి 2, ఆంధ్రప్రదేశ్ విమానయాన చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలు కాబోతోంది. దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర వాసులు ఎదురుచూస్తున్న కల సాకారం అయ్యే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మితమవుతున్న 'జీఎంఆర్ విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం' ట్రయల్ రన్ కు సిద్ధమవుతోంది. దీన్ని భోగాపురం ప్రాంతంలో నిర్మించడంతో అందరూ దీన్ని భోగాపురం ఎయిర్ పోర్టుగా పిలుస్తున్నారు. అయితే దీనికి అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ అని నామకరణం చేయనున్నట్టు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. జనవరి 4న ఈ విమానాశ్రయం నుంచి తొలి టెస్ట్ ఫ్లైట్ ఎగరనుంది. ఇది కేవలం ఒక సాంకేతిక ప్రక్రియ మాత్రమే కాదు.. అది ఉత్తరాంధ్ర ప్రగతికి నాంది ప్రస్తావన.జనవరి 4వ తేదీన భోగాపురం రన్‌వే పై తొలి విమానం దిగనుందని నిర్మాణ సంస్థ జీఎంఆర్ ప్రకటించింది. ఈ అద్భుత ఘట్టాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దగ్గరుండి పర్యవేక్షించనున్నారు. ఈ ట్రయల్ రన్ ద్వారా రన్‌వే నాణ్యత, సిగ్నలింగ్ వ్యవస్థ, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ పనితీరును పరిశీలిస్తారు. ఇది విజయవంతమైతే, అతి త్వరలోనే పూర్తిస్థాయి వాణిజ్య విమానయాన సేవలు ప్రారంభమవుతాయి. 2026 మే నుంచి ఈ విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలనేది ప్రభుత్వ లక్ష్యంప్రస్తుతం విశాఖపట్నంలో ఉన్న విమానాశ్రయం నేవీ ఆధీనంలో ఉండటం వల్ల అనేక పరిమితులు ఉన్నాయి. కానీ, భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్ట్. సుమారు 2,203 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నిర్మిస్తున్నారు. తొలి దశలో ఏటా 60 లక్షల ప్రయాణికుల సామర్థ్యంతో ఇది అందుబాటులోకి వస్తోంది. భవిష్యత్తులో దీనిని ఏటా 40 మిలియన్ల ప్రయాణికుల సామర్థ్యానికి పెంచేలా డిజైన్ చేశారు. ఇందులో నిర్మించిన 3800 కిలోమీటర్ల రన్‌వే ప్రపంచంలోనే అతిపెద్ద విమానమైన ఎయిర్‌బస్ ం380 వంటి వాటిని కూడా దించేందుకు అనుకూలంగా ఉంటుంది. కేవలం ప్రయాణికులే కాదు, అంతర్జాతీయ ఎగుమతులు, దిగుమతుల కోసం భారీ కార్గో టెర్మినల్ కూడా ఇక్కడ సిద్ధమవుతోంది.భోగాపురం విమానాశ్రయం కేవలం ప్రయాణ సౌకర్యం మాత్రమే కాదు, అది ఆర్థిక వృద్ధికి ఇంజిన్ లాంటిది. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు ఇది ముఖద్వారంగా మారుతుంది. ఫార్మా, ఐటీ, సీ-ఫుడ్ ప్రాసెసింగ్ వంటి పరిశ్రమలకు అంతర్జాతీయ కనెక్టివిటీ పెరిగి, పెట్టుబడులు వెల్లువెత్తుతాయి. అరకు లోయ, విశాఖ బీచ్‌లు, శ్రీకాకుళంలోని పురాతన ఆలయాలకు విదేశీ పర్యాటకుల రాక గణనీయంగా పెరుగుతుంది. ఎయిర్ పోర్ట్ అనుబంధంగా ఏరో సిటీ, హోటళ్లు, లాజిస్టిక్స్ రంగాలు అభివృద్ధి చెంది వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి లభిస్తుంది. ఇన్నాళ్లూ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై విమానాశ్రయాలపై ఆధారపడిన కార్గో రవాణా, ఇకపై నేరుగా విశాఖ నుంచే జరిగే ఆస్కారం ఉంది. ముఖ్యంగా నైట్ ల్యాండింగ్ సౌకర్యాలు, 24/7 ఆపరేషన్స్ అందుబాటులో ఉండటం వల్ల అంతర్జాతీయ విమానయాన సంస్థలు భోగాపురం వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు వేగవంతం కావడంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పాత్ర కీలకం. పిన్న వయసులోనే కేంద్ర విమానయాన శాఖ బాధ్యతలు చేపట్టిన ఆయన, తన సొంత ప్రాంతమైన ఉత్తరాంధ్రలో ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఢిల్లీ నుంచి నేరుగా భోగాపురానికి విమానం రావడం ఒక చారిత్రక ఘట్టంగా మారనుందని చెబుతున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆ రోజు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు హాజరయ్యే అవకాశముంది. కొత్త ఏడాది మొదట్లోనే విమానం రూపంలో వచ్చిన శుభవార్త ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రత్యేక ఆనందాన్ని ఇచ్చిందని పలువురు అభిప్రాయపడుతున్నారుఈ అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తిస్థాయిలో ప్రారంభమైతే ఉత్తరాంధ్ర ప్రపంచంతో నేరుగా అనుసంధానమవుతుందని అంచనా. పరిశ్రమలు, వ్యాపారం, పర్యాటకం, ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. విజయనగరం జిల్లాతో పాటు సమీప ప్రాంతాల అభివృద్ధికి ఇది కీలక మలుపు అవుతుందని విశ్వాసం వ్యక్తమవుతోంది. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర భవిష్యత్తును కొత్త దిశలో నడిపించబోతోందన్న నమ్మకం ప్రజల్లో బలంగా కనిపిస్తోంది.ఢిల్లీ స్థాయిలో అనుమతులు త్వరగా మంజూరు చేయించడం, నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు సమీక్షించడం, అడ్డంకులను తొలగించడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపించారు. విమానయానం సామాన్యుడికి చేరువ కావాలనే ఆయన లక్ష్యానికి భోగాపురం ఒక బలమైన పునాదిగా నిలవనుంది.మొత్తంగా, భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం. జనవరి 4న జరగబోయే టెస్ట్ ఫ్లైట్ ఆ ప్రాంత అభివృద్ధికి సంకేతం. ఇది పూర్తయి అందుబాటులోకి వస్తే, ఉత్తరాంధ్ర రూపురేఖలే కాకుండా, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక స్థితిగతులు కూడా సానుకూలంగా మారుతాయని నిస్సందేహంగా చెప్పవచ్చు.

# కూటమిలో సమతూల్యం ఎలా

విజయవాడ, జనవరి 2, క్యాలెండర్ మారిన ప్రతిసారి కొత్త ఏడాది మీద ఆశలు, అంచనాలు సహజంగానే పెరుగుతాయి. 2025 ముగిసి 2026 ప్రారంభమవడంతో ఈ ఏడాదిలో ఏమి జరుగుతుంది, పరిస్థితులు ఎలా ఉంటాయి అనే ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది. వ్యక్తిగత జీవితాలతో పాటు రాజకీయాలు, పరిపాలన, ఇతర రంగాలపై కూడా చర్చలు ఊపందుకుంటున్నాయి.

ముఖ్యంగా ప్రజలతో నేరుగా ముడిపడి ఉన్న పాలన రంగం గురించి సామాన్యులు కూడా ఆసక్తిగా మాట్లాడుకుంటున్నారు.ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, 2025 ఏడాది కూటమి ప్రభుత్వానికి ఒక విజయవంతమైన పాలనా సంవత్సరంగా గడిచిందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటివరకు మిత్రపక్షాల మధ్య ఎలాంటి విభేదాలు బయటకు రాకుండా, అందరూ కలిసికట్టుగా ముందుకు సాగుతున్నారని అంటున్నారు. కూటమిలో ఐక్యత కొనసాగడం వల్ల పరిపాలన సజావుగా నడిచిందన్న భావన కూడా బలంగా ఉంది.అయితే 2025లో కూటమి ప్రభుత్వంపై అనేక ఊహాగానాలు వినిపించాయి. ముఖ్యంగా మెగా బ్రదర్ నాగబాబు (కు కేబినెట్‌లో అవకాశం వస్తుందన్న ప్రచారం జరిగింది. ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికై తొమ్మిది నెలలు గడిచినా మంత్రి పదవి దక్కకపోవడంతో, దీని వెనుక వ్యూహం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2026లో మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందన్న మాట కూడా అప్పుడే మొదలైంది. 2024 జూన్ 12న కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించడంతో, 2026 జూన్ నాటికి రెండేళ్ల పాలన పూర్తవుతుంది.సాధారణంగా ప్రభుత్వాలు రెండేళ్ల తర్వాత తమ పనితీరును సమీక్షించి మంత్రివర్గంలో మార్పులు చేస్తుంటాయి. చివరి ఏడాది పూర్తిగా ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోతుందని, ఆ సమయంలో చేసిన మార్పులు ఆశించిన ఫలితాలు ఇవ్వవన్న అభిప్రాయం రాజకీయాల్లో ఉంది. అందుకే రెండేళ్ల సమయం కీలకమని భావిస్తారు. అదే లాజిక్ ప్రకారం, కూటమి ప్రభుత్వం కూడా రెండేళ్ల పాలనను బేరీజు వేసుకుని 2026లో పెద్ద ఎత్తున మార్పులు చేయవచ్చని చర్చ సాగుతోంది.ప్రస్తుతం కూటమికి 164 మంది ఎమ్మెల్యేలు ఉండగా, మంత్రివర్గంలో ఒక ఖాళీ ఉంది. మార్పులు చేర్పులు చేస్తే మరో ఆరు లేదా ఏడు స్థానాలు అందుబాటులోకి రావచ్చని అంచనా. దీంతో కేబినెట్ బెర్త్‌ల కోసం తీవ్ర పోటీ ఉండడం ఖాయం. ప్రాంతీయ సమతుల్యత, రాజకీయ అవసరాలు, సామాజిక సమీకరణలు అన్నింటినీ దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటారని అంటున్నారు.అయితే ఎప్పుడు మార్పులు జరిగినా ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలు , రాయలసీమ నుంచి ఒక్కొక్కరికి పదవి గండం తప్పదన్న రాజకీయ జోస్యాలు వినిపిస్తున్నాయి.

వీరితో పాటు పనితీరు ఆశించిన స్థాయిలో లేని మరికొందరికి కూడా పదవులు కోల్పోయే అవకాశం ఉందని అంటున్నారు. అదే సమయంలో విస్తరణ జరిగితే విశాఖ జిల్లా , కొత్తగా ఏర్పడిన పోలవరం జిల్లా నుంచి ఒకరికి అవకాశం రావచ్చన్న అంచనాలు ఉన్నాయి. గోదావరి ప్రాంతంలో ఒక సీనియర్ బీసీ నేతకు, రాయలసీమలో ఒక బలమైన సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం దక్కే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని విశ్లేషకులు చెబుతున్నారు. మొత్తానికి 2026 ఏడాది ఎవరి ఆశలను నెరవేర్చుతుందో, ఎవరి రాజకీయ భవిష్యత్తుకు మలుపు తిప్పుతుందో వేచి చూడాల్సిందే.

## కనిపించని పవన్ మార్క్..

విజయవాడ, జనవరి 2, ఏపీలో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికే ఏడాదిన్నర దాటింది. జనవరి నాటికి దాదాపు 19 నెలలు పూర్తవుతాయి. ప్రజలు ఇచ్చిన ఐదేళ్ల అధికార కాలంలో మూడో వంతు కాలం గడిచిపోతుండటంతో, ప్రభుత్వ పనితీరుపై సహజంగానే చర్చలు మొదలయ్యాయి. ప్రభుత్వ పనితీరు ఒక వైపు అయితే, కూటమిలో భాగస్వాములైన జనసేన, బీజేపీ పాత్ర మరో ముఖ్య అంశంగా మారింది.కూటమిలో పెద్దన్న పాత్రను టీడీపీ సమర్థంగా నిర్వహిస్తోందన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి నాయకుడిగా ఉన్నందున, పాలనలో టీడీపీ మాటే ఎక్కువగా నడుస్తోందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. పేరు మాత్రం కూటమి ప్రభుత్వం అయినా, వాస్తవంగా నిర్ణయాలన్నీ టీడీపీ నుంచే వస్తున్నాయన్న భావన ప్రజల్లో ఉంది.పవర్ స్టార్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పాత్రపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. 2024 ఎన్నికల ముందు ఆయన రాజకీయ ప్రస్థానం చాలా ఉత్సాహాన్ని కలిగించింది. అయితే ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత ఆయన ప్రభావం ఎంత వరకు కనిపిస్తోంది అన్నది ప్రశ్నగా మారింది. డిప్యూటీ సీఎం హోదాతో పాటు కీలక శాఖలు ఆయన వద్ద ఉన్నప్పటికీ, విధానపరమైన నిర్ణయాల్లో ఆయన ముద్ర స్పష్టంగా కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రోటోకాల్ పరంగా చూస్తే పవన్‌కు ముఖ్యమంత్రి స్థాయి గౌరవం ఉంది. చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం తర్వాత ఆయన ఫోటో దర్శనమిస్తోంది. అధికార పరంగా ఎలాంటి లోటు లేకపోయినా, ఆ అధికారాన్ని వినియోగించి తన ఆలోచనలను ఎంతవరకు అమలు చేయగలుగుతున్నారన్నదే అసలు చర్చ. "సీజ్ ది షిప్" వంటి వ్యాఖ్యలు వార్తల్లో నిలిచినా, వాటి ఫలితాలు ప్రజలకు స్పష్టంగా కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.అలాగే రేషన్ బియ్యం అక్రమ రవాణా, స్థానిక సమస్యలపై పవన్ స్పందించిన సందర్భాలు ఉన్నా, ఆ తర్వాత వాటిపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏ స్థాయిలో ఉన్నాయన్నది స్పష్టత లేనిదే అని అంటున్నారు. భీమవరం ప్రాంతంలో జూదం అంశంపై విచారణ కోరిన విషయం కూడా చర్చకు వచ్చినా, దాని తుది ఫలితం ఏమిటన్నది తెలియరాలేదు.ఎన్నికల సమయంలో జనసేన ఇచ్చిన హామీల విషయానికి వస్తే, యువతకు పెట్టుబడి సహాయం, ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ రద్దు వంటి అంశాలు ఇప్పటివరకు అమలులోకి రాలేదన్న అభిప్రాయం ఉంది. అలాగే పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో పవన్ సమన్వయం ఎంతవరకు కొనసాగుతోంది అన్నదానిపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.మొత్తానికి కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ స్థానం ఉన్నతమైనదే అయినా, రాజకీయంగా గానీ, ప్రజా విధానాల పరంగా గానీ ఆయన "మార్క్" ఇంకా స్పష్టంగా కనిపించలేదన్న విమర్శలు బలంగా

# సలహాదారులు ఎన్నాళ్లు...

విజయవాడ, జనవరి 2, అధికారం మారినా పద్ధతులు మారలేదు.. ప్రభుత్వాలు మారినా సలహాల సంస్కృతి పోలేదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయ వర్గాల్లో, సచివాలయ పరిసరాల్లో వినిపిస్తున్న ప్రధాన చర్చ ఇది. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో సలహాదారుల వ్యవస్థపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన తెలుగుదేశం పార్టీ, నేడు అధికారంలోకి వచ్చాక అదే బాటలో పయనిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం ముగ్గురు ప్రముఖులను సలహాదారులుగా నియమించడంతో ఈ చర్చ మరోసారి తెరపైకి వచ్చింది.రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీధర్, ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు, చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్‌లను వివిధ విభాగాలకు సలహాదారులుగా నియమించింది. వీరిలో శ్రీధర్, మంతెన సత్యనారాయణరాజు తమ తమ రంగాల్లో లబ్ధప్రతిష్టులే అయినప్పటికీ, ప్రభుత్వ పాలనలో వీరి పాత్ర ఎంతవరకు అవసరం అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సలహాదారుల నియామకం ఒక ప్రహసనంగా మారిందన్నది బహిరంగ రహస్యం.

దాదాపు ప్రభుత్వంలోని ప్రతి శాఖకు, ఉప శాఖకు కూడా సలహాదారులను నియమించి, వారికి క్యాబినెట్ ర్యాంకులు, భారీ జీతభత్యాలు, వాహనాలు, సిబ్బందిని సమకూర్చడంపై అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అది "సలహాదారుల ప్రభుత్వం" అని, ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తున్నారని నాడు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సహా కూటమి నేతలంతా దుయ్యబట్టారు. "మేము అధికారంలోకి వస్తే ఈ సలహాదారుల వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం" అని హామీ ఇచ్చారు. కానీ, నేడు కూటమి ప్రభుత్వం కూడా విడతలవారీగా సలహాదారులను నియమించుకుంటూ వెళు_ఒడటంతో, అప్పుడు తప్పు అయినది, ఇప్పుడు ఒప్పు ఎలా అవుతుంది? అని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.ఈ సలహాదారుల నియామకాల్లో వినిపించే ప్రధానమైన, సాంకేతికమైన అభ్యంతరం.. బ్యూరోక్రసీకి సంబంధించింది. అత్యంత కఠినమైన పరీక్షల్లో నెగ్గి, దశాబ్దాల తరబడి పాలనా అనుభవం ఉన్న ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్-1 అధికారులు ప్రభుత్వ యంత్రాంగంలో అందుబాటులో ఉన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి సెక్షన్ ఆఫీసర్ వరకూ వేల సంఖ్యలో ఉద్యోగులు ఉన్నారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి, ప్రభుత్వానికి దిశానిర్దేశం చేయడానికి ఈ వ్యవస్థ సరిపోదా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అనుభవజ్ఞులైన అధికారులు ఉండగా, బాహ్య వ్యక్తులను సలహాదారులుగా తీసుకురావడం వల్ల అధికారుల మనోధైర్యం దెబ్బతింటుందనే వాదన కూడా ఉంది.

ఒకవేళ సలహాలు నిజంగా అవసరమైతే, ఆయా రంగాల నిపుణులతో తాత్కాలిక కమిటీలు వేయవచ్చు కానీ, పూర్తిస్థాయి పదవులు ఎందుకనేది మేధావుల ప్రశ్న.ఈ నియామకాల వెనుక రాజకీయ ఉపాధి కోణం ఉందన్న విమర్శలను కొట్టిపారేయలేం. ఎన్నికల్లో టిక్కెట్లు దక్కని నాయకులకు, పార్టీ కోసం కష్టపడిన సానుభూతిపరులకు, సోషల్ మీడియాలో మద్దతుగా నిలిచిన వారికి ఏదో ఒక హోదా కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ పదవులు సృష్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వం తమ పార్టీ వారిని ఎలాగైతే అకాడమీల చైర్మన్లుగా, సలహాదారులుగా నియమించిందో, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా తమ మద్దతుదారులను తృప్తి పరచడానికి ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ఇది కేవలం రాజకీయ నిరుద్యోగులకు ఉపాధి కల్పించే పథకంలా మారిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.ఇప్పటికే రాష్ట్రం తీవ్ర ఆర్థిక లోటులో ఉందని, అప్పుల కుప్పగా మారిందని ప్రభుత్వ పెద్దలే శ్వేతపత్రాలు విడుదల చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో.. సలహాదారుల జీతభత్యాలు, వారి కార్యాలయాల నిర్వహణ, వసతుల కల్పన ఖజానాపై అనవసరమైన భారాన్ని మోపుతాయి. ఒక్కో సలహాదారుడి నిర్వహణకు నెలకు లక్షల్లో ఖర్చు అవుతుంది. పొదుపు చర్యలు పాటించాల్సిన ప్రభుత్వమే ఇలా ఆర్భాటాలకు పోవడం ఎంతవరకు సమంజసం అనే చర్చ సామాన్యుల్లోనూ జరుగుతోంది.ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి నిపుణుల సలహాలు అవసరమే. కానీ అవి పాలనను మెరుగుపరిచేవిగా ఉండాలి తప్ప, రాజకీయ అవసరాలు తీర్చేవిగా ఉండకూడదు. కార్టూనిస్టులు, ప్రకృతి వైద్యులు సమాజానికి అవసరమే కానీ, వారి సేవలను ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో ఎలా వినియోగించుకుంటారో, తద్వారా సామాన్యుడికి ఏం మేలు జరుగుతుందో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. లేదంటే, గత ప్రభుత్వం చేసిన తప్పునే ఈ ప్రభుత్వం కూడా చేస్తోందన్న అపవాదును కూటమి సర్కార్ మూటగట్టుకోక తప్పదు.

# వీవీఐపీలకే దేవుడా...

తిరుమల, జనవరి 2 దేవుడి దర్శనంలో ఒక కొత్త ట్రెండ్ కనిపిస్తోంది. అర్జెంటుగా వెళ్లి దేవుడికి నమస్కారం చేయాలి. తనివి తీరా దర్శనం చేసుకోవాలి. మనం అడిగే కోర్కెలను దేవుడు మన్నించేయాలి. ఎక్కువమంది ఆలోచన ఇదే. దీనినుంచి పుట్టుకొచ్చింది వీఐపీ తనం. గ్రామంలో ఉండే చిన్న గుడి నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం వరకు ఈ వీఐపీ సంస్కృతి పెరుగుతూనే ఉంది. భారీగా డొనేషన్లు ఇచ్చేవారిని.. లేకుంటే పాలనలో బిజీగా ఉండేవారు వీఐపీలుగా మారుతున్నారు. అటువంటి వారు వస్తే వేలాదిమంది దర్శనాలు నిలిపివేసి వారికి అవకాశం కల్పిస్తున్నారు. అయితే సాధారణ ప్రజలకు విఐపి లు కావచ్చు కానీ.. దేవుడు ముందు మాత్రం వీరు తక్కువే. అయితే ప్రజలకు తాము వీఐపీలమని చూపిస్తున్న వీరు.. దేవుడు ముందు మాత్రం తగ్గి ఉంటున్నారు. ఎందుకంటే అనుగ్రహించాల్సింది ఆయనే కాబట్టి. అయితే ఈ వీఐపీ సంస్కృతి ఇప్పుడు ప్రతి చోట పెరుగుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.దేవాలయం అనేది అహంకారం విడాల్సిన చోటు. అక్కడ అందరూ సమానమే. సామాన్యుల తో కలిపి గంటల తరబడి వేచి చూస్తే అక్కడ సహనం, సమయం విలువ తెలుస్తుంది. ప్రపంచంలో ఎంతటి పెద్ద ధనవంతుడైన, పదవిలో ఉన్నవారు అయినా దేవాలయానికి వస్తే దేవుడు దగ్గర యాచకుడు మాత్రమే. ఈ విషయాన్ని గుర్తించాలి. నిన్నటే ముక్కోటి ఏకాదశి పర్వదినం జరిగింది. ప్రతి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనాలు జరిగాయి. ఉన్నది ఒకటే ద్వారం కానీ వీఐపీలు అనేకం. వేలాదిమంది సామాన్య భక్తులను ఇట్టే దాటుకొని స్వామివారిని వీఐపీ దర్శనం ద్వారా పూజలు చేసిన వారు చాలామంది ఉన్నారు. అయితే కొంతమంది క్యూలో నిలబడితే వచ్చే ఇబ్బందులు ఉన్నాయి. అటువంటి వీఐపీలు ప్రత్యేక దర్శనం ద్వారా వెళ్లిపోవచ్చు. కానీ అటువంటివారు కాకుండా గుర్తు పట్టని వీఐపీలు కూడా.. వేలాది మంది భక్తులను దాటుకుని వెళ్లి ప్రత్యేక దర్శనాలు చేసుకోవడం మాత్రం సామాన్యులకు ఇబ్బందికరమే.ఆయన దేవుడు.. మనం సేవకులం. మధ్యలో ఈ వీఐపీ సంస్కృతి ఏంటనేది ఒక వాదన. ఎందుకంటే దేవుడు ముందు అందరూ యాచకులే. అందరికంటే ముందు వెళ్లి అయ్యా నా కోరికల చిట్టా ఇది.. నా కష్టాలు ఇవి అని చెప్పుకుంటే దేవుడు తీరుస్తాడా? దేవుడికి అన్నీ తెలుసు. మన గుణగణాలు తెలుసు. అటువంటి దేవుడు తన మిగతా భక్తులను దాటుకొని వచ్చి.. కనీసం తన కోసం వేచి చూడకుండా.. సమయం ఇవ్వకుండా.. నేను వీఐపీని అంటూ ముందుకు వస్తే దేవుడు సహించగలడా? అనేది ప్రశ్న. అక్కడ దేవుడు అనేది ఒక నమ్మకం. ఆ నమ్మకాన్ని నమ్మకమైన రీతిలో అనుసరించాలే కానీ. వీఐపీ సంస్కృతి భక్తిత్వం అభివృద్ధి ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు. ఇది సాటి మనుషులకు ఇబ్బందులకు గురి చేయడమే.

## కూకట్ పల్లికి నిధులు ఇవ్వలేదు ,అభివృద్దిని ఆపేసారు

### ఎమ్మెల్యే మాధవరం

హైదరాబాద్ కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,కార్పొరేటర్లు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అయింది.

మూడు కమిషనర్ల చేసి కూకట్ పల్లి నియోజకవర్గాన్ని ముక్కలు చేశారు. స్టడీ టూర్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం పది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు. నగరంలో ప్రజలతో రోడ్లు లేక డ్రైనేజీ లేక దోమలతో బాధపడుతున్నారు. కూకట్ పల్లి నియోజకవర్గాన్ని నిధులు ఇవ్వకుండా అభివృద్ధిని ఆపేశారు. కూకట్ పల్లి నియోజకవర్గంలో రెండు వేల కోట్ల రూపాయల భూములను అమ్మింది కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు.

రెండు కోట్ల రూపాయల అభివృద్ధి పనులను బడ్జెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టుతున్నారు. కూకట్ పల్లిలో రెండు సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక శంకుస్థాపన చేయలేదు. ఎన్ని కుట్రలు పెట్టిన ఎన్ని ప్రలోభాలు పెట్టిన రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే . ఫతే నగర్ బ్రిడ్జి,బాలానగర్ అండర్ పాసుకి టెండర్లు జరిగిన పనులు చేయట్లేదు రేవంత్ సర్కార్. స్టడీ టూర్ విహారయాత్రను కూకట్ పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు వ్యతిరేకిస్తున్నారు. కాంగ్రెస్,బీజేపీ పార్టీకి సంబంధించిన నాయకులు బ్యానర్లు వేస్తే చట్టం ఉండదు. బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన నాయకులు బ్యానర్లు పెట్టితే చించేస్తారు. రేవంత్ రెడ్డి రాక్షస పాలన జీవితంలో చూడలేదు. ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేసింది కేసీఆర్ ప్రభుత్వమే . కళ్యాణ లక్ష్మి ,రెండు వేల రూపాయల పెన్షన్లు,డబుల్ బెడ్ రూముల ఇబ్బంది బిఆర్ఎస్ ప్రభుత్వమే. ఇప్పటికి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేయలేదు బిఆర్ఎస్ నాయకులను కార్యకర్తలను ఇబ్బంది పెట్టడం తప్ప. నల్ల చెరువు అభివృద్ధి పనులు చేసిన హైడ్రా నాలా వేయకుండా పనులు చేశారు. 20 సెంటీమీటర్ల వర్షంపడుతే మళ్ళీ ఇండ్లు మునిగిపోతాయి. నగరంలో చెత్తలేకుండా ప్రణాళికలు చేసింది కేటీఆర్. ప్రతి కాలానికి ఆటోలతో చెత్త తీసివేయడం ఏర్పాటు చేశాం. స్వచ హైదరాబాద్ చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు.కూకట్ పల్లి నియోజక వర్గం కార్పొరేటర్లు మాట్లాడుతూ ఒక నెల కాలంలో జీహెచ్ఎంసీ కాలపరిమితి ముగుస్తోంది. మేయర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్టడీ టూర్ విహారయాత్ర జరగనుంది. పదవీకాలం అయిపోయాక స్టడీ టూర్ దేనికి ఉపయోగమని ప్రశ్నించారు.

ప్రజాధనం వృథా చేయడమే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి శూన్యం. జీహెచ్ఎంసీ కార్పొరేటర్లకు రెండు కోట్ల రూపాయలు ఇస్తానని రేవంత్ రెడ్డి సర్కార్ చెప్పింది. ఇప్పటి వరకు రెండు రూపాయలు బడ్జెట్ ఇవ్వకుండా స్టడీ టూర్ వెళ్లటం హాస్యాస్పదం . ప్రజాధనం ఇష్టం లేదు కాబట్టి కూకట్ పల్లి బిఆర్ఎస్ కార్పొరేటర్లం వెళ్లట్లేదని అన్నారు.

## పాతాళగంగ ప్రాంతంలో చిరుత సంచారం

శ్రీశైలం శ్రీశైల పాతాళగంగ మెట్ల దారిలో సత్యనారాయణ శాస్త్రి ఇంటి ముందు భాగంలో గురువారం అర్ధ రాత్రి 2 గంటల 30 నిమిషాల ప్రాంతంలో చిరుతపులి సంచరించడం జరిగింది.ఇది సీసీ కెమెరాలో రికార్డు అవ్వడంతో ఆయన వెంటనే చిరుత పులి సంచారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈఓ. శ్రీనివాసరావు, చైర్మన్ రమేష్ నాయుడు సమాచారం తెలిసిన వెంటనే ఆ ప్రాంతంలో ఉండే స్థానికులు,భక్తులను అప్రమత్తం చేశారు. ఈ మెట్ల మార్గం ద్వారానే భక్తులు తెల్లవారు జామున పాతాళ గంగలో స్నానాలు ఆచరించడానికి నిత్యం వేలాది మంది భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు.పాతాళ గంగ, సమీపాన స్థానికులు నివాసం ఉండే ప్రాంతాల్లో మైకుల ద్వారా చిరుత పులి సంచారాన్ని తెలియజేస్తు అందరిని జాగ్రత్తగా ఉండాలని ఆలయ అధికారులు సూచనలు చేశారు.

# పోలవరం జిల్లాలో పోలవరం మిస్

ఏలూరు, జనవరి 2, మైసూరు బోండాలో మైసూరు ఉండదు" అన్న సామెతను గుర్తు చేసేలా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో ఒక కొత్త చర్చ మొదలైంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న జిల్లాల పునర్విభజన నిర్ణయంతో "పోలవరం జిల్లాలో పోలవరం ఊరే లేకపోవడం ఎలా?" అనే ప్రశ్న ప్రజల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ నిర్ణయం సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో అధికారికంగా ఆమోదం పొందడంతో రాజకీయంగా, పరిపాలనాపరంగా విస్తృత చర్చకు దారితీసింది.మంత్రివర్గ సమావేశంలో మొత్తం 24 అంశాలపై చర్చ జరగగా, జిల్లాల పునర్విభజనపై మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులను కేబినెట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ నిర్ణయం మేరకు రాష్ట్రంలో రెండు కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడంతో పాటు, ఇప్పటికే ఉన్న 26 జిల్లాల్లో 17 జిల్లాల్లో సరిహద్దులు, మండలాలు, డివిజన్లలో మార్పులు చేయనున్నారు. మిగిలిన 9 జిల్లాలు ఎలాంటి మార్పులు లేకుండా యథాతథంగా కొనసాగనున్నాయి.ఈ నిర్ణయాల్లో అన్నమయ్య జిల్లా ( కేంద్రం మార్పు ఒక అంశంగా నిలవగా, పోలవరం జిల్లాలో పోలవరం గ్రామం లేకపోవడం మరింత చర్చకు దారి తీసింది. దీనిపై రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ స్పష్టత ఇచ్చారు. గత 18 నెలలుగా రాష్ట్రంలో సుపరిపాలన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన చెప్పారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల అభివృద్ధి దృష్టిలో పెట్టుకుని రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేసినట్లు వివరించారు.పోలవరం జిల్లా పేరు ఉన్నప్పటికీ పోలవరం గ్రామం ఏలూరు జిల్లాలోనే కొనసాగడంపై విలేకరులు ప్రశ్నించగా, మంత్రి ఆసక్తికర ఉదాహరణ ఇచ్చారు. ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరు కృష్ణా జిల్లా లో ఉన్నప్పటికీ, విజయవాడకేంద్రంగా ఏర్పడిన జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అదే తరహాలో నిర్వాసిత ప్రాంతాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని జిల్లాకు పేరు పెట్టడం పరిపాలనా అవసరాల కోసమేనని వివరించారు.ప్రజల నుంచి వచ్చిన సూచనలు, ఫిర్యాదుల ఆధారంగా కొన్ని మండలాలు, డివిజన్లను మార్చామని మంత్రి తెలిపారు.

గత ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండా జిల్లాలను విభజించడం వల్లే ఇలాంటి సమస్యలు వచ్చాయని, ఆ లోపాలను ఇప్పుడు సరిదిద్దుతున్నామని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విషయంపై నాదెండ్ల మనోహర్ కూడా స్పందిస్తూ, అప్పట్లో పారదర్శకంగా విభజన జరిగి ఉంటే ఇలాంటి గందరగోళం ఉండేదే కాదన్నారు.జిల్లా కేంద్ర హోదా కోల్పోతున్న రాయచోటి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ( హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

స్థానిక ఎమ్మెల్యే, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ కు ఈ నిర్ణయాలపై ముందుగానే వివరించామని తెలిపారు. మొత్తంగా ఈ మార్పులన్నీ రాజకీయ లాభాల కోసం కాకుండా, పరిపాలన సౌలభ్యం, ప్రజలకు మెరుగైన సేవల కోసమేనని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

# 39 దేశాల నుంచి అమెరికాకు ఎవరూ వెళ్లలేరు

న్యూఢిల్లీ, జనవరి 2 (న్యూస్ పల్స్) అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. 2026 జనవరి 1వ తేదీ నుండి అమలులోకి వచ్చేలా మొత్తం 39 దేశాలపై×× ప్రయాణ నిషేధాన్ని విధిస్తూ కొత్త ఉత్తర్వులు జారీ చేశారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడటం , ఉగ్రవాద ముప్పులను అడ్డుకోవడమే లక్ష్యంగా అధ్యక్షుడు ట్రంప్ ప్రయాణ ఆంక్షల జాబితాను భారీగా పెంచారు. 2025 జూన్‌లో 19 దేశాలపై ఉన్న ఆంక్షలను ఇప్పుడు 39కి విస్తరించారు. అక్రమ వలసలను అరికట్టడం, వీసా నిబంధనల ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైట్‌హౌస్ ప్రకటించింది. జనవరి 1, 2026 ఉదయం 12:01 గంటల నుండి ఈ నిబంధనలు అమల్లోకి వచ్చాయి.ఈ ఉత్తర్వులు ప్రభుత్వం రెండు భాగాలుగా విభజించింది. 19 దేశాలపై పూర్తి నిషేధం ఉండగా, మరో 20 దేశాలపై పాక్షిక నిషేధం అమలు చేస్తున్నారు. పూర్తి నిషేధం ఉన్న దేశాల పౌరులు ఎటువంటి వీసాలపై అమెరికాలో అడుగుపెట్టలేరు. పాక్షిక నిషేధం ఉన్న దేశాల పౌరులకు ఇమ్మిగ్రెంట్ వీసాలు, పర్యాటక (బి-1/బి-2), విద్యార్థి (ఎఫ్, ఓ, ఏ) వీసాల జారీని నిలిపివేశారు.

పూర్తి నిషేధం (19 దేశాలు + పాలస్తీనా):

ఆఫ్ఘనిస్తాన్, బుర్కినా ఫాసో, బర్మా (మయన్మార్), చాద్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లావోస్, లిబియా, మాలి, నైజర్, సోమాలియా, సౌత్ సూడాన్, సూడాన్, సిరియా, యెమెన్, సియెర్రా లియోన్ , పాలస్తీనా అథారిటీ జారీ చేసిన డాక్యుమెంట్లు ఉన్నవారు.

పాక్షిక నిషేధం (20 దేశాలు):

అంగోలా, ఆంటిగ్వా ఉ బార్బుడా, బెనిన్, బురుండి, కోట్ డి ఐవరీ, క్యూబా, డొమినికా, గాబన్, గాంబియా, మలావి, మౌరిటానియా, నైజీరియా, సెనెగల్, టాంజానియా, టోగో, టోంగా, తుర్క్మెనిస్తాన్, వెనిజులా, జాంబియా, జింబాబ్వే.ఈ ఆంక్షలు కేవలం కొత్తగా వీసా పొందే వారికి మాత్రమే వర్తిస్తాయి. ఇప్పటికే చెల్లుబాటు అయ్యే వీసాలు కలిగి ఉన్నవారికి, గ్రీన్ కార్డ్ హోల్డర్లకు (ఒఖఞ), ప్రస్తుతం అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తున్న వారికి ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఉంటుంది. అలాగే దౌత్యవేత్తలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, , అత్యవసర మానవతా కారణాలతో వచ్చే వారికి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అనుమతి లభించే అవకాశం ఉంది. ఈ నిర్ణయం వల్ల ముఖ్యంగా ఆఫ్రికా ,మధ్యప్రాచ్య దేశాల నుండి వచ్చే లక్షలాది మంది ప్రయాణికులపై ప్రభావం పడనుంది. 2026లో అమెరికా వేదికగా జరగనున్న ప్రపంచ కప్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లకు క్వాలిఫై అయిన సెనెగల్,కోట్‌డివాయిర్ వంటి దేశాల అభిమానులకు కూడా ఇది ఇబ్బందిగా మారనుంది.

# కొత్తగా లాజిస్టిక్ హబ్స్..

## భారీగా పెరగనున్న భూముల ధరలు, ఉద్యోగాలు

హైదరాబాద్, జనవరి 2, ప్రస్తుతం నిర్మాణంలో ట్రిపులార్‌తో హైదరాబాద్ నగర విస్తీర్ణం మరింత పెరగనుంది. దీంతో ఔటర్ రింగ్ రోడ్డు, ట్రిపులార్ల మధ్య అభివృద్ధిని పరుగులు పెట్టించాలని అధికారులు నిర్ణయించారు. లాజిస్టిక్ హబ్స్ ఏర్పాటు చేయనున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, ప్రాంతీయ వలయ రహదారి మధ్య ప్రాంతాన్ని ప్రభుత్వం భవిష్యత్ అభివృద్ధికి కేంద్రంగా ఎంచుకుంది. ఫోర్త్ సిటీ ఈ జోన్‌లోనే రూపుదిద్దుకోనుండటంతో మౌలిక వసతులపై దృష్టి పెరిగింది. నగర విస్తరణను ప్లాన్ చేసిన పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ ప్రాంతాన్ని ప్రత్యేక గ్రోత్ కారిడార్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.విజన్ డాక్యుమెంట్ ప్రకారం ఈ కారిడార్‌లో శాటిలైట్ టౌన్‌షిప్‌ల ఏర్పాటు కీలకంగా మారింది. రవాణా రంగానికి అవసరమైన లాజిస్టిక్ హబ్‌లు కూడా ప్రధాన ప్రాజెక్టులుగా ప్రతిపాదించారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో వీటి డిజైన్, అమలు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. గతంలో పటాన్‌చెరు పరిధిలోని లక్డారం, పటాన్‌చెరు ప్రాంతాల్లో లాజిస్టిక్ పార్కుల ప్రతిపాదనలు వచ్చినా అవి కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు కొత్త విజన్‌తో మళ్లీ ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది.ఈ అభివృద్ధి ప్రాంతాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో లాజిస్టిక్ మౌలిక వసతులు ఏర్పాటుకానున్నాయి.

- కంటెయినర్ డిపోలు
- కంటెయినర్ స్టేషన్లు
- డ్రై వేర్‌హౌజింగ్ జోన్లు
- ఫ్రైట్ విలేజ్‌లు
- ఆధునిక గోదాములు
- కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు
- ఎయిర్ కార్గో కాంప్లెక్సులు
- సరుకు ప్రాసెసింగ్, ప్యాకింగ్ యూనిట్లు

ఇవి అన్నీ ఒకే ప్రాంతంలో ఉండేలా సమగ్ర ప్రణాళిక రూపొందించారు.

ప్రస్తుతం నగరంలో సరకు రవాణా వల్ల ట్రాఫిక్ భారం పెరుగుతోంది. దీనికి పరిష్కారంగా లోడింగ్, అన్‌లోడింగ్ కార్యకలాపాలను శివార్లకు తరలించాలనే ఆలోచనకు లాజిస్టిక్ హబ్‌లు బలంగా నిలుస్తున్నాయి. బాటసింగారం, మంగళపల్లి ప్రాంతాల్లో ఇప్పటికే రెండు హబ్‌లు ఉన్నాయి. మహానగరం చుట్టూ కనీసం పది లాజిస్టిక్ హబ్‌లను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో హెచ్ఎండీఏ అడుగులు వేస్తోంది. బ్లూ గ్రీన్ మొబిలిటీ కాన్సెప్ట్ ఆధారంగా ప్రజా రవాణా, సరుకు రవాణాకు ప్రత్యేక మార్గాలు సిద్ధం కానున్నాయి.ఈ ప్రాజెక్టుల ప్రభావంతో ఓఆర్ఆర్, ట్రిపులార్ల మధ్య ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. శాటిలైట్ టౌన్‌షిప్‌లు, వేర్‌హౌజ్ జోన్లు, ఇండస్ట్రియల్ యూనిట్లు రావడంతో రియల్ ఎస్టేట్ డిమాండ్ వేగంగా పెరుగుతుంది.

నివాస ప్రాజెక్టులు, కమర్షియల్ స్పేస్‌కు మంచి మార్కెట్ ఏర్పడనుంది. ఉద్యోగాల పరంగా చూస్తే లాజిస్టిక్స్, ట్రాన్స్‌పోర్ట్, వేర్‌హౌజింగ్, కోల్డ్ స్టోరేజ్, ప్యాకింగ్, ఐటీ సపోర్ట్, మేనేజ్‌మెంట్ రంగాల్లో వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు రానున్నాయి. ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు పరోక్షంగా అనేక చిన్న వ్యాపారాలు ఎదిగే అవకాశం ఉంది.

## అసెంబ్లీలో పీపీటీ వార్

హైదరాబాద్, జనవరి 2, తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రాజకీయాలు ముదురుతున్నాయి. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలను ఎండగట్టేందుకు ప్రభుత్వం అసెంబ్లీలో పీపీటీని ఒక అస్త్రంగా ఎంచుకుంది. ఇందుకు ప్రతిగా తాము చేసిన అభివృద్ధిని వివరించేందుకు తమకూ పీపీటీ ఇచ్చే అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ పట్టుబడుతోందిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి రంగంలో జరిగిన విధ్వంసం పై ప్రజలకు వివరించాలని నిర్ణయించింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, అంచనాల పెంపు వంటి అంశాలపై పక్కా ఆధారాలతో కూడిన పీపీటీని సభలో ప్రదర్శించేందుకు సిద్ధమైంది. సభ మధ్యలో భారీ స్క్రీన్లను ఏర్పాటు చేసి, ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పెట్టడమే కాంగ్రెస్ ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ పీపీటీకి దీటుగా సమాధానం చెప్పేందుకు బీఆర్ఎస్ కూడా సిద్ధమైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇటీవల స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి ఒక వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఏకపక్షంగా తన వాదనను వినిపిస్తే సరిపోదని, ప్రధాన ప్రతిపక్షంగా తమ వెర్షన్ ప్రజలకు తెలియజేయడానికి తమకూ పీపీటీ చాన్స్ ఇవ్వాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఒకవేళ తమకు అవకాశం ఇవ్వకపోతే, గతంలో ఇలాగే అవకాశం నిరాకరించినప్పుడు ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభను బహిష్కరించిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు.అసెంబ్లీ బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పీపీటీ అంశం చర్చకు వచ్చింది. శీతాకాల సమావేశాల కాలాన్ని పెంచాలని, తమకు పీపీటీ అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ కోరగా.. స్పీకర్ ఆ వినతిని పరిశీలిస్తామని తెలిపారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పాత సంప్రదాయాలను తెరపైకి తెస్తోంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పీపీటీలు ఇచ్చినప్పుడు ప్రతిపక్షాలకు ఎప్పుడూ అవకాశం ఇవ్వలేదని, ఇప్పుడు తాము కూడా అదే సంప్రదాయాన్ని పాటిస్తామని కాంగ్రెస్ మంత్రులు స్పష్టం చేస్తున్నట్లుగా తెలుస్తోంది.2016లో అప్పటి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రాజెక్టులపై పీపీటీ ఇచ్చినప్పుడు, కాంగ్రెస్ కూడా తమకు అవకాశం ఇవ్వాలని అడిగింది. కానీ అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం నిరాకరించింది. ఇప్పుడు సీన్ రివర్స్ కావడంతో, అప్పుడు మీరు మాకు ఇవ్వలేదు..

# బీఆర్ఎస్ విధానం ఫాలో అవ్వనున్న కాంగ్రెస్

హైదరాబాద్, జనవరి 2, తెలంగాణ అసెంబ్లీలో అధికార పార్టీతో పాటు తమకూ పీపీటీ అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. లేకపోతే అన్యాయమని ఆరోపణలు చేస్తోంది. అది అన్యాయమా కాదా అన్నది ప్రజలు నిర్ణయిస్తారు కానీ.. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రతిపక్షాలను ఎంత మేర పరిగణనలోకి తీసుకుంది.. వారి వాయిస్ కు ఎంత మేర అవకాశం కల్పించిందన్నది గుర్తు చేసుకుంటే .. బీఆర్ఎస్ పార్టీ తాము విపక్షానికి ఎప్పుడూ ఇవ్వని కించిత్తు గౌరవాన్ని తాము భారీగా కోరుకుంటోంది.బీఆర్ఎస్ హయాంలో అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నప్పటికీ, ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు కాంగ్రెస్ నేతలకు తగిన సమయం ఇచ్చేవారు కాదు. చిన్న చిన్న కారణాలతో సస్పెన్షన్లు చేయడం, మైకులు కట్ చేయడం వంటి ఘటనలు అప్పట్లో నిత్యకృత్యంగా ఉండేవి. సభలో చర్చల కంటే ఏకపక్ష నిర్ణయాలకే ప్రాధాన్యత ఉండేదన్న విమర్శలు ఉన్నాయి. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితుల్లో మార్పు వచ్చిందని, ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు తగిన సమయం ఇస్తూ చర్చలకు వేదికగా అసెంబ్లీని మారుస్తున్నారు.దానికి ఇప్పటి వరకూ సాగిన అసెంబ్లీ తీరే సాక్ష్యం అనుకోవచ్చు.2016లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులపై అసెంబ్లీలో సుదీర్ఘంగా పీపీటీ ఇచ్చారు. ఆ సమయంలో ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా తమ వాదనను ప్రజెంటేషన్ ద్వారా వినిపిస్తామని, తమకూ అవకాశం ఇవ్వాలని బతిమిలాడినా బీఆర్ఎస్ కనికరించలేదు. ప్రభుత్వానికి మాత్రమే ప్రజెంటేషన్ ఇచ్చే హక్కు ఉంది అని నాడు బీఆర్ఎస్ నేతలు కరాఖండిగా చెప్పారు. ప్రతిపక్షం అడిగిన ఏ ఒక్క ప్రశ్నకూ ప్రజెంటేషన్ రూపంలో సమాధానం చెప్పే వీలు కల్పించకుండా కేసీఆర్ తన వాదననే ఏకపక్షంగా వినిపించారు. కానీ ఇప్పుడు మాత్రం తమకూ పీపీటీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.చిత్రమేమిటంటే, నాడు ప్రతిపక్షానికి ఏ అవకాశాన్నైతే నిరాకరించారో, నేడు అదే అవకాశాన్ని తమకు కల్పించాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఇవ్వనున్న పీపీటీకి కౌంటర్‌గా తాము కూడా ప్రజెంటేషన్ ఇస్తామని, తమకు ఆ హక్కు ఉందని స్పీకర్‌ను కోరుతున్నారు. నాడు ప్రజాస్వామ్యాన్ని అణచివేసిన వారు, నేడు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఈ డిమాండ్ పై కాంగ్రెస్ నేతలంటున్నారు. బీఆర్ఎస్ ఒత్తిడిపై కాంగ్రెస్ ప్రభుత్వం చాలా స్పష్టంగా ఉంది. గతంలో బీఆర్ఎస్ ఏ సంప్రదాయాన్ని పాటించిందో, తాము కూడా అదే బాటలో నడుస్తామని సంకేతాలు ఇస్తోంది. అప్పట్లో బీఆర్ఎస్ ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించి ఉంటే.. ఇప్పుడీసమస్యలు వచ్చేవి కావని అనుకోవచ్చు.

# 24 గంటల మంచినీటి కోసం పక్కా ప్లాన్

హైదరాబాద్, జనవరి 2, భాగ్యనగరం శరవేగంగా విస్తరిస్తోంది. అంబరాన్నంటే భవనాలు, ప్రపంచ స్థాయి ఐటీ కంపెనీలు, కోటిన్నరకుపైగా జనాభాతో ఈ మహానగరం ఇప్పుడు గ్లోబల్ హబ్‌గా మారింది. అయితే పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా మౌలిక వసతులు, ముఖ్యంగా తాగునీరు, మురుగు నీటిపారుదల వ్యవస్థను సిద్ధం చేయడం ఒక సవాలుతో కూడుకున్న పని. ఈ సవాలును స్వీకరించిన హైదరాబాద్‌మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ స్వరేజ్ బోర్డు, సిటీని ఒక ఆదర్శవంతమైన వాటర్ సెక్యూర్ సిటీగా తీర్చిదిద్దేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది. వాటర్ బోర్డు, వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులతో నగర భవిష్యత్తును మార్చడానికి రంగం సిద్ధం చేసింది. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం రోజు విడిచి రోజు లేదా కొన్ని శివారు ప్రాంతాల్లో మూడు, నాలుగు రోజులకు ఒకసారి నీరు సరఫరా అవుతోంది. కానీ, ఈ పరిస్థితిని మార్చడమే లక్ష్యంగా వాటర్ బోర్డు ప్రణాళికలు రచిస్తోంది. 2027 చివరి నాటికి నగరంలోని ప్రతి ఇంటికీ ప్రతి రోజూ తాగునీరు అందించడం బోర్డు ప్రాథమిక లక్ష్యం. ఆ తర్వాత 2047 నాటికి తెలంగాణ కోర్ ప్రాంతానికి 24 గంటల పాటు నిరంతరాయంగా నీటిని సరఫరా చేసేలా మాస్టర్‌ప్లాన్ రూపొందుతోంది. నగర తాగునీటి అవసరాలు భవిష్యత్‌లో భారీగా పెరగనున్నాయి. 2027 నాటికి నగర తాగునీటి డిమాండ్ 835 ఎంజీడీలుగా, 2047 నాటికి అది ఏకంగా 1114 ఎంజీడీలుగా పెరుగుతుందని అంచనా. ఈ డిమాండ్‌ను తట్టుకోవడానికి గోదావరి జలాలే కీలకం. ఇప్పటికే కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా జలాలను వందల కిలోమీటర్ల దూరం నుంచి తెస్తున్న బోర్డు, ఇప్పుడు గోదావరి ఫేజ్-2, ఫేజ్-3 ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది. రూ. 7,360 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా అదనంగా 20 టీఎంసీల నీటిని తరలించడానికి పనులు శరవేగంగా జరుగుతున్నాయి.నగరం మధ్యలో ప్రవహించే మూసీ నదని పునరుద్ధరించాలని ప్రభుత్వం ఎప్పటి నుంచి ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా జంట జలాశయాలను గోదావరి నీటితో నింపడానికి వాటర్ బోర్డు ఒక భారీ ప్రాజెక్టును చేపట్టింది. మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం ద్వారా నదికి పాత వైభవాన్ని తీసుకురావడానికి అధికారులు శ్రమిస్తున్నారు.

వంద శాతం మురుగు శుద్ధి: పర్యావరణ పరిరక్షణలో మైలురాయి

మురుగు నీరు నేరుగా చెరువులు, నదుల్లో కలవకుండా అడ్డుకోవడం నగర ఆరోగ్యానికి ముఖ్యం. దీని కోసం ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 972 ఎంఎల్డీ సామర్థ్యం గల 39 కొత్త మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం ప్రారంభమైంది. అమృత్-2.0 పథకంలో భాగంగా రూ. 3849.10 కోట్ల వ్యయంతో ఈ పనులు జరుగుతున్నాయ.

2026 నాటికి ఈ పనులు పూర్తి అయితే హైదరాబాద్ మొత్తం మురుగు నీటి శుద్ధి సామర్థ్యం 2,850 ఎంఎల్డీలకు చేరుకుంటుంది. ఇది 2036 వరకు నగర అవసరాలను తీర్చగలదని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అంతేకాకుండా,మూసీ నదిలోకి మురుగు చేరకుండా ట్రంక్ లైన్లు వేసేందుకు 4700 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక కూడా సిద్ధమైంది.

వేసవి సన్నాహాలు

గత వేసవిలో భూగర్భ జలాలు 14 నుంచి 28 మీటర్ల వరకు పడిపోవడంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా ఉండటానికి వాటర్ బోర్డు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. ఇంకుడు గుంతల యజ్ఞం ద్వార వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. నగరంలో నమోదైన భారీ వర్షాలు, బోర్డు చర్యల వల్ల భూగర్భ జలాలు గత ఏడాదితో పోలిస్తే 3 నుంచి 9 మీటర్ల వరకు పైకి వచ్చాయి. దీనిని మరింత ముందుకు తీసుకెళ్తూనే, 16వేల గృహాలకు నోటీసులు జారీ చేసి ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. వచ్చే మార్చి నాటికి మరో 25వేల గృహాల్లో వీటిని పూర్తి చేయాలని బోర్డు లక్ష్యంగా పెట్టుకుంది.

నగరంలోని ప్రతి మూలకు నీరు చేర్చడానికి కొత్త ప్రాజెక్టును బోర్డు వేగవంతం చేసింది.

1. కోకాపేట్ నియోపోలిస్ లే అవుట్: 298 కోట్లతో వాటర్ సప్లై ప్రాజెక్టు
2. మహీంద్రహిల్స్: 5మిలియన్ లీటర్ల రిజర్వాయర్ నిర్మాణం
3. ఆస్మానగ్: 7.5 మిలియన్ లీటర్ల రిజర్వాయర్ నిర్మాణం
4. మంజీరా నెట్‌వర్క్: 722 కోట్లతో నెట్‌వర్క్ ఆధునీకరణ
5. ఉస్మాన్ సాగర్ కండూట్: దీనిని పునరుద్ధరించి రోజుకు 21 మిలియన్ గ్యాలన్ల నీటిని తరలించడానికి 282 కోట్లతో అదనపు పైపు లైన్ నిర్మాణం చేపడుతున్నారు.

అంతే కాకుండా ఔటర్ రింగ్ రోడ్డు వెంట 140 కిలోమీటర్ల మేర రేడియల్ రింగ్ మెయిన్, 98 కిలోమీటర్ల లింకు పైపులైన్ల కోసం 8వేల కోట్లో భారీ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హైదరాబాద్ వాటర్ బోర్డు చేపట్టిన ఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి అయితే నీటి కరవు అనేది ఉండని ప్రభుత్వం భావిస్తోంది.

# రవి శాస్త్రి ఆరు సిక్సుల రికార్డ్ కు 41 ఏళ్ళు



రవి శాస్త్రి ఆరు సిక్సుల రికార్డ్ కు 41 ఏళ్ళు నిండాయి. 18 సంవత్సరాల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగుపెట్టిన రవిశాస్త్రి... కుడి చేతితో బ్యాటింగ్ ఎడమచేతితో స్పిన్ బౌలింగ్ చేయగలడు. 1985 సంవత్సరంలో జనవరి 3వ తేదీన ఆరు బాళ్లలో ఆరు ఆరు సిక్సర్లు కొట్టిన మొట్ట మొదటి భారతీయుడిగా రికార్డు సాధించాడు రవి శాస్త్రి. ప్రపంచంలో ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా రవిశాస్త్రి రికార్డు సృష్టించాడు. 1985లో ఆస్ట్రేలియాలో జరిగిన ప్రపంచ చాంపియన్ క్రికెట్లో తన క్రీడా జీవితంలోనే అత్యంత ప్రతిభను కనబర్చి చాంపియన్ ఆఫ్ చాంపియన్స్‌గా ఎన్నికైనాడు. అదే సీజన్‌లో ఒకే ఓవర్లో వరుసగా 6 సిక్సర్లు కొట్టి ఈ ఘనతను సాధించిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో ప్రపంచంలోనే ఈ ఘనతను సాధించిన వారిలో వెస్టిండీస్ కు చెందిన గారీ సోబర్స్ తర్వాత ఇతను రెండో వాడు మాత్రమే. టెస్ట్ క్రికెట్లో ఇతను 11 సెంచరీలు సాధించాడు, రవిశాస్త్రి క్రికెట్ కు వీడ్కోలు పలికిన తర్వాత క్రికెట్ కామెంటేటర్ గా మారిపోయాడు. ఎన్నో మ్యాచ్ లకు తన స్టైల్లో క్రికెట్ కామెంట్రీ ఇచ్చి ప్రేక్షకులను అలరించారు రవి శాస్త్రి. కొన్ని రోజుల పాటు టీమిండియా కోచ్ గా కొనసాగి టీమిండియా విజయాలను ముందుండి నడిపారు.

# కవితకు ఓటు... ఎవరికి చేటు...



హైదరాబాద్, జనవరి 2, తెలంగాణ రాజకీయాల్లో 2026 సంవత్సరం సరికొత్త సమీకరణాలకు వేదిక కాబోతోంది. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో కాంగ్రెస్ లేదా బీజేపీ కంటే కూడా సొంత ఇంటి నుంచే వచ్చే ముప్పు అతి పెద్ద సవాల్‌గా మారే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెట్టడం ఖాయమయింది. తెలంగాణ ఉద్యమ కాలం నుండి తెలంగాణ జాగృతి ద్వారా సాంస్కృతిక సారథిగా కవితకు ప్రత్యేక గుర్తింపు ఉంది. బీఆర్ఎస్ పార్టీలో మహిళా గళంగా ఆమె కీలకంగా వ్యవహరించారు. కారణాలు ఏమైనా ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆమె జాగృతి పేరుతో రాజకీయం చేస్తున్నారు. కానీ ఇంకా రాజకీయ పార్టీగా ప్రకటించలేదు. కొత్త ఏడాదిలో ఆమె సొంతంగా పార్టీని ప్రకటించి, మరింతగా క్షేత్రస్థాయిలో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. అది బీఆర్ఎస్‌కు పరోక్షంగా పెనుగండంగా మారుతుంది. ఇది కేవలం రాజకీయ చీలిక మాత్రమే కాదు, కేసీఆర్ స్థాపించిన పార్టీకి నైతిక , సెంటిమెంట్ పరమైన దెబ్బగా పరిణమించే ప్రమాదం ఉందిరాజకీయాల్లో 1 లేదా 2 శాతం ఓట్ల వ్యత్యాసమే అధికార మార్పిడికి కారణమవుతుంది. గత ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే బీఆర్ఎస్ , కాంగ్రెస్ మధ్య ఓట్ల శాతం తేడా చాలా స్వల్పంగా ఉంది. కవిత కొత్త పార్టీ పెట్టి, రాష్ట్రవ్యాప్తంగా కనీసం ×4 నుండి 5 శాతం ఓట్లను చీల్చగలిగితే, అది నేరుగా బీఆర్ఎస్ గెలిచే స్థానాలపై ప్రభావం చూపుతుంది. బీఆర్ఎస్ సంప్రదాయ ఓటు బ్యాంకులో మహిళలు, సాంస్కృతిక సంఘాలు కీలక పాత్ర పోషిస్తారు. కవితా తన బలాన్ని నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తే, ఆ ఓట్లు చీలిపోయి అల్టిమేట్‌గా కాంగ్రెస్ లేదా బీజేపీకి లబ్ధి చేకూరుతుంది. కవిత కొత్త పార్టీ దిశగా అడుగులు వేస్తే, బీఆర్ఎస్‌లో అసంతృప్తిగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు ఆమె వైపు చూసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఆమెకు ఉన్న పట్టు పార్టీకి నష్టం కలిగించవచ్చు. క్యాడర్ ఎవరి వైపు ఉండాలో తెలియక అయోమయానికి గురైతే, పార్టీ క్షేత్రస్థాయిలో బలహీనపడుతుంది. కేసీఆర్ ఇమేజ్‌ను నమ్ముకున్న కార్యకర్తలు, కుటుంబంలోనే చీలిక వస్తే మానసికంగా కుంగిపోయే ప్రమాదం ఉంది.కవితను తమ దారిలోకి తెచ్చుకోకపోతే లేదా ఆమెను పార్టీలో సముచిత స్థానంతో సంతృప్తి పరచకపోతే బీఆర్ఎస్ మనుగడకు పెద్ద సమస్యగా మారుతుంది. పార్టీకి విఘాతం కలగకుండా ఉండాలంటే కుటుంబ సమన్వయం కంటే కూడా రాజకీయ సమన్వయం అత్యవసరం. ఆమెను దూరం పెట్టడం వల్ల వచ్చే నష్టం కంటే, ఆమెతో కలిసి ప్రయాణించడం వల్ల కలిగే లాభాలను పార్టీ అధిష్టానం బేరీజు వేసుకోవాల్సి ఉంటుంది. 2026లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను వాడుకుని పుంజుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్‌కు, ఈ అంతర్గత సంక్షోభం అడ్డంకిగా మారవచ్చు. కవితా ఫ్యాక్టర్ కేవలం ఓట్ల చీలికకే పరిమితం కాకుండా, పార్టీ భవిష్యత్తును నిర్ణయించే స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. కొత్త ఏడాదిలో కేసీఆర్ ఈ చిక్కుముడిని ఎలా విప్పుతారో వేచి చూడాల్సి ఉంది.

# మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రిబాయి పూలే -కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి

## -నేడు చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి



సావిత్రిబాయి పూలే భారతీయ సంఘ సంస్కర్త, భారత దేశ మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు, రచయిత్రి,మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం. ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ ఫులే భార్య. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి. ఆమె ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన సావిత్రిబాయి భర్తతో 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించింది. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజికబాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసారు. సావిత్రి బాయి మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3 న జన్మించింది. ఆమెది రైతుకుటుంబం. సావిత్రి బాయి కుటుంబానికి తెలంగాణ ప్రాంతంతో బంధుత్వం ఉంది. సావిత్రి బాయి తన 9వ యేట 12 యేండ్ల జ్యోతిరావు ఫూలెను 1840లో వివాహమాడారు. ఆ దంపతులకు స్వంత పిల్లలు లేరు. కానీ ఆ జంట యశ్వంతరావు (బ్రాహ్మణ వితంతువు కుమారుడు) ను దత్తత తీసుకున్నారు. "జ్యోతీరావు పూలె" ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలైంది. అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు సంపద వంటి సమస్త హక్కులు నిరాకరింపబడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, బ్రాహ్మణవాద సంప్రదాయాలను, ఆధిపత్యవర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా పాఠశాలలు ప్రారంభించి,12 మే 1848న దేశంలో బహుజనులకు మె?ట్టమె?దటి పాఠశాల ప్రారంభించారు. సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని ధీశాలి ఆమె. కేవలం 4 సంవత్సరాలలోనే గ్రామీణ ప్రాంతాల్లో 20 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యనందించారు. 1848 లోనే దేశంలా విద్యా ఉద్యమం ప్రారంభించిన మె?దటి మహిళ ఉపాద్యాయురాలు , దళితుల, స్త్రీల విద్యావ్యాప్తికి కృషి ప్రారంభించే నాటికి ఆమె వయస్సు 18 ఏళు ళ్ళ మాత్రమే. వారి జీవితకాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో ఆమె ఆధిపత్య కులాల వారి నుంచి అనేక దాడులను, అవమానాలను ఎదుర్కొంది.ఈ నేపథ్యంలోనే 1849లో పూలే, సావిత్రీబాయి దంపతులను గృహ బహిష్కారానికి గురిచేశారు. ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్యపరచడానికి 1852లో మహిళా సేవామండల్ అనే మహిళా సంఘన్ని కూడా స్థాపించింది. జెండర్ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఈ సంస్థ కృషిచేసింది. మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి పూలే. అసత్యాలతో, అగ్రవర్ణ దురహంకారపు నిచ్చెనమెట్ల కులవ్యవస్థగా నిర్మాణమైన సమాజంలో "సత్యాన్ని" శోధించడానికి 1873 లో తన భర్త మహాత్మా పూలేతో కలసి "సత్యశోధక్ సమాజ్ "ను ప్రారంభించి బాల్యవివాహలకు, మూడనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేఖంగా మరియు వితంతువు పునఃర్వివాహల కొరకు అసమాన బ్రాహ్మనిజ వ్యవస్థకు వ్యతిరేఖంగా బలమైన ఉధ్యమం నడిపారు. బాల్యంలోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోసి వారి కళ్లల్లో వెలుగు చూసారు. అలా పురుడు పోసుకుని తన వద్దేవదిలేసి పోయిన ఓ బిడ్డను అక్కున చేర్చుకున్నారు.యశ్వంత్ గా నామకరణం చేసి తమ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పెంచి పెద్ద చేసారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించి, క్షురకులను చైతన్యపర్చి, వితంతువులకు శిరోముండనం చేయబోమంటూ క్షురకుల చేత 1860లో సమ్మె చేయించారు సావిత్రీబాయి. తరువాత 1873 సెప్టెంబరు 24న "సత్యసోధక్ సమాజ్" అనే సామాజిక, ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించి, సత్యసోధన కోసం ఉద్యమాన్ని నడిపారు పూలే. ఈ సత్యసోధక్ సమాజ్ మహిళా విభాగం సావిత్రీబాయి నేతృత్వంలో నడిచేది. వివాహాలు వంటి శుభ కార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది. 1873 డిసెంబరు 25న భార్యను కోల్పోయిన ఒక యువకునికి తన స్నేహితురాలి కుమార్తెతో సత్యసోధక్ సమాజ్ ఆధ్వర్యన సావిత్రీబాయి వివాహం జరిపించారు.1868 నుంచి సావిత్రీబాయి అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడినప్పుడు పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువు వాతపడిన కుటుంబాలలోని అనాధ బాలలను దాదాపు 2,000 మందిని అక్కున చేర్చుకున్నారు. తమ పాటశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించినారు. సావిత్రిబాయి సంఘ సంస్కర్తగానే గాదు, రచయిత్రిగా కూడా వేగుచుక్కగా నిలిచారు. 1854లోనే ఆమె తన కవితా సంపుటి 'కావ్యఫూలే'ను ప్రచురించింది. మరో కవితా సంపుటి 'పావన కాశీ సుభోధ్ రత్నాకర్'ను 1891లో ప్రచురించింది. ఆమె ఉపన్యాసాల్లో కొన్ని 1892లో పుస్తకరూపంలో వచ్చాయి. జ్యోతీరావుపూలే 1890 నవంబరు 28న మరణించడంతో సావిత్రీబాయి అంతులేని దుఃఖ సాగరంలో మునిగిపోయారు. ఈ దుఃఖంలోనుంచే మరో ఆదర్శానికి శ్రీకారం చుట్టారు. తన భర్త పూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇది. ఫూలే మరణాంతరం సత్యసోధాక్ సమాజ్ భాద్యతనీ స్వీకరించి నడిపించింది. 1897 లో ప్లేగు వ్యాధి, పూణే నగరాన్ని వణికించింది. నగరమంతా ఎడారిగా మారింది. జనమంతా దగ్గర్లోని అడవుల్లోకి పారిపోయారు. అయినా సావిత్రీబాయి పూలే కొడుకు యశ్వంత్ తో కల్సి వ్యాధిగ్రస్తులకు సేవ చేసారు.ప్లేగు వ్యాధి సోకిన మాంగ్ లాంటి దళిత కులాలకి చెందిన దళిత చిన్నపిల్లలని తన చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడింది. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకి సోకి మార్చి 10, 1897 లో కబళించింది. ఆమె దత్తపుత్రుడు యశ్వంత్ అంత్యక్రియలు జరిపించిండు. సావిత్రి బాయి జయంతిని భారతదేశ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటున్నాము.

# జాతీయ రహదారిని కప్పేసిన మంచు



హైదరాబాద్ విజయవాడ రహదారిపై మంచు దుప్పటి కప్పి వేసింది, ఉదయం 8:30 గంటలు కావస్తున్నా పూర్తిగా మంచు దుప్పటి కప్పడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, వాహనాల యొక్క లైట్లు వేసుకొని నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## మహిళా ప్రయాణికులపై ఆర్టీసీ కండక్టర్ బూతు పురాణం

హైదరాబాద్: సామాన్య ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించాల్సిన ఆర్టీసీలో ఒక కండక్టర్ బరితెగించాడు. బస్సులో ప్రయాణిస్తున్న మహిళల పట్ల అత్యంత అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా, నోటికొచ్చినట్లు బూతులు తిడుతూ రెచ్చిపోయిన ఘటన కలకలం రేపుతోంది.హయత్ నగర్ డిపోకు చెందిన 218ఊ నంబర్ గల ఆర్టీసీ బస్సు (ఠఊ01ఒ5653) లో ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో సదరు కండక్టర్ చిన్న కారణానికే వివాదానికి దిగాడు. ఈ క్రమంలో సహనం కోల్పోయిన ఆయన, కనీస మర్యాద లేకుండా మహిళలను ఉద్దేశించి అత్యంత అసభ్య పదజాలంతో దూషించాడు. అందరూ చూస్తుండగానే మహిళలపై బూతులతో విరుచుకుపడటంతో ప్రయాణికులు షాక్‌కు గురయ్యారు.ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినప్పటి నుండి కొన్ని చోట్ల కండక్టర్లు మహిళల పట్ల చిన్నచూపు చూస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా జరిగిన ఈ ఘటనలో కండక్టర్ ప్రవర్తనపై తోటి ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యతాయుతమైన ఉద్యోగం లో ఉండి మహిళలను అలా దూషించడం పట్ల సామాజిక మాధ్యమాల్లో సైతం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇప్పటికే సోషల్ మీడియా ద్వారా ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లాయి.కండక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించేలా సిబ్బందికి కౌన్సెలింగ్ ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు. మహిళల రక్షణ కోసం ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్న ఆర్టీసీ యాజమాన్యం, ఈ ఘటనపై ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# హైదరాబాద్ శివారులో దట్టమైన పొగమంచు..
# స్తంభించిన ట్రాఫిక్



హైదరాబాద్ శివారు ప్రాంతాలను కమ్మేసిన దట్టమైన పొగమంచుముందు వెళ్లే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడ్డ డ్రైవర్లుశంషాబాద్ హైవేపై 10 కిలోమీటర్ల మేర నిలిచిపోయిన ట్రాఫిక్‌విజయవాడ జాతీయ రహదారిపై లైట్ల వెలుతురులో వాహనాల రాకపోకలుహైదరాబాద్ శివారు ప్రాంతాలను శుక్రవారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కమ్మేసింది. మంచు తీవ్రత ఎక్కువగా ఉండటంతో రోడ్లు, భవనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నగర శివార్లలోని ఇబ్రహీంపట్నం, నాగార్జునసాగర్ హైవే, మేడ్చల్, తూంకుంట, శామీర్‌పేట, గండిపేట, మోకిల, పటాన్‌చెరు, వికారాబాద్, రాజేంద్రనగర్, ఆదిబట్ల తదితర ప్రాంతాల్లో జీరో విజిబిలిటీ నమోదైంది. దీంతో ఉదయాన్నే రోడ్డెక్కిన వాహనదారులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.పొగమంచు కారణంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గంతో పాటు బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో డ్రైవర్లు తమ వాహనాలను రోడ్డు పక్కనే నిలిపివేశారు. ఫలితంగా శంషాబాద్ నుంచి పాలమాకుల వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అటు ఔటర్ రింగ్ రోడ్డు (ఠఖీఖీ)పై కూడా మంచు ప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.మరోవైపు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కూడా పరిస్థితి ఇలాగే ఉంది. అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద పది అడుగుల దూరంలో ఉన్న వాహనాలు కూడా కనిపించనంతగా పొగమంచు కురుస్తోంది. విజిబిలిటీ పూర్తిగా తగ్గిపోవడంతో వాహనదారులు హెడ్ లైట్లు, ఇండికేటర్లు వేసుకుని నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉండటంతో వాహనదారులు ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

## మద్యం మత్తులో ఘోర రోడ్డు ప్రమాదం ,ఇద్దరు యువకులు మృతి
## ఒకరికి తీవ్ర గాయాలు...

రంగారెడ్డి మహేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బుచ్చిరెడ్డి పౌల్ట్రీ ఫార్మ్ దగ్గర మద్యం మత్తులో టవేరా వాహనాన్ని నడుపుతూ అదుపుతప్పి పల్టీ కొట్టడంతో,తవుటి శ్రీకాంత్,సంగెం గిరి,అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ దుర్ఘటన లో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మహేశ్వరం పోలీసులకు సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఇలాంటి దుర్ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో రోడ్డు భద్రతపై అవగాహన లు కల్పించిన.వినకుండా మద్యం సేవించి ప్రాణాలు కోల్పోతున్నారు మహేశ్వరం పోలీసులు తెలిపారు. ఒకేసారి ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోవడంతో పోరండ్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను కూటమి ప్రభుత్వం సరిచేస్తుంది
## గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము
### సిద్ధాంతంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ప్రారంభించినఎమ్మెల్యే రాము,విజయవాడ ఎంపీ కేసీనేని చిన్ని

గుడివాడ రూరల్ 02 చేతకాని పాలనతో గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సరి చేస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గత ప్రభుత్వం తప్పులతో ముద్రించిన పాస్ పుస్తకాల స్థానంలో.... రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామన్నారు.గుడివాడ మండలం సిద్ధాంతం గ్రామంలో రీ సర్వే గ్రామసభ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమి యజమాన్యపు హక్కు మరియు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేసినేని చిన్ని రైతులకు నూతన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభలో ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ... గత పాలకులు వ్యవస్థలను ఎలా నాశనం చేశారో అందరికీ తెలుసన్నారు. ప్రజల ఆస్తులపై మహాత్మా గాంధీ మాదిరిగా జగన్ ఆయన ఫోటోలను ముద్రించుకొని, ప్రజాధనంతో పబ్లిసిటీ చేసుకున్నారని మండిపడ్డారు.

ఆస్తి మాది అనే భావన కలిగేలా యజమానుల ఫోటోలతో కూడిన పాసు పుస్తకాలను కూటమి ప్రభుత్వం పంపిణీ చేయడం మంచి కార్యక్రమం అని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను రైతులు ఎంతో ఆనందంగా తీసుకుంటున్నారని ఎమ్మెల్యే రాము అన్నారు. ఒక్క గుడివాడ నియోజకవర్గంలోనే 25వేల పాసు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, నేటి నుండి ఈ నెల 9వ వరకు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే రాము చెప్పారు.రైతాంగం ఆనందపడేలా మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ఎమ్మెల్యే రాము ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో బాలసుబ్రమణ్యం జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, లింగం ప్రసాద్, గొర్రపత్తి సుబ్బారావు, ఓఖీూ కిరణ్ కుమార్, గ్రామ నాయకులు ఇస్తా శ్రీనివాసరావు, వీరవరపు ఏసుబాబు, అడుసుమిల్లి గోపాలకృష్ణ, అడుసుమిల్లి లక్ష్మణరావు, సురేష్, కోరుమిల్లి స్వామి, మదిరి సుబ్బారావు, కటారి రాంబాబు, ఇస్సా కృష్ణమూర్తి, బాజీ, కోటిలింగం, పలువురు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# యూట్యూబర్ అన్వేష్ పై కేసు నమోదు
# దర్యాప్తు ముమ్మరం



హైదరాబాద్ నా అన్వేషణ పేజ్ యూట్యూబర్ అన్వేష్ కేస్ లో పోలీస్ దర్యాప్తు ముమ్మరం అయింది. హిందూ దేవతల పై వివాదాస్పద కేసుల్లో ఇప్పటికే పంజాగుట్ట పిఎస్ లో కేస్ నమోదు అయింది. ఈ నేపధ్యంలో పంజగుట్ట పోలీసులు ఇన్స్టాగ్రామ్ కు లేఖ రాసారు. వీడియో కంటెంట్ లింక్ ఉన్న అన్వేష్ యూజర్ ఐడి వివరాలు ఇవ్వాలని కోరారు. ఇన్స్టాగ్రామ్ నుండి రిప్లై కోసం వెయిట్ చేస్తున్నారు. విదేశాల్లో ఉంటూ ఇష్టానుసారంగా వీడియోలు పోస్ట్. చేసిన అన్వేష్ పై హిందూ సంఘాలు రగిలిపోతున్నాయి. పంజాగుట్ట లో అన్వేష్ పై కరాటే కళ్యాణి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

## అమరావతి పనులను పరిశీలించిన మంత్రి నారాయణ



అమరావతి లో మరో 1.5 కి.మీ సీడ్ యాక్సిస్ రోడ్డు అందుబాటులోకి వచ్చింది. విజయవాడ నుంచి అమరావతికి వెళ్లేందుకు కరకట్టపై దూరం తగ్గింది. కొత్తగా అందుబాటులోకి వచ్చిన సీడ్ యాక్సిస్ రోడ్డు,గుంటూరు చానెల్ పై నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. ఈ నెలాఖరుకు స్టీల్ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థకు మంత్రి నారాయణ ఆదేశాలు ఇచ్చారు. కరకట్ట పై వెళ్ళే అవసరం లేకుండా త్వరలోనే బ్రిడ్జి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

# రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

భద్రాద్రి కొత్తగూడెం బూర్గంపాడు మండలం మొండికుంట గ్రామం లో జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడిన విద్యార్థులను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక బాలిక చేతికి తీవ్ర గాయం అయినట్లు సమాచారం. ప్రమాదంలో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులలో నలుగురికి చేతులు ఫ్రాక్చర్ అయ్యాయి. ఒక విద్యార్థికి ఛాతీ ఎముకలు విరగడం జరిగింది. ఈ ప్రమాదంలో బస్సు క్లీనర్ కు తీవ్ర గాయాలయ్యాయి.

## ఉపాధి హామీ పథకం పై ఫిబ్రవరి 2 న కాంగ్రెస్ నిరసన

అంబేద్కర్ కోనసీమ అమలాపురంలో సీడబ్లుసి సభ్యుడు గిడుగు రుద్రరాజు మీడియా సమావేశం నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కు మహాత్మా గాంధీ పేరు తొలగించి ఆ చట్టం రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం నిర్ణయం పట్ల జనవరి 5 నుండి జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమం చేపడుతుందని రుద్రరాజు తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం తొలిసారిగా అమలు చేసిన అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం బండ్లపల్లిలో ఫిబ్రవరి 2 న జరగనున్న నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే హాజరుకానున్నారని రుద్రరాజు తెలిపారు. ప్రస్తుత కొత్త నల్ల చట్టం రద్దు చేసి, పాత చట్టం పురుద్ధరించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. నూతన ఉపాధి చట్టం వలన వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోతారని వలసలు పెరుగుతాయని రుద్రరాజు ఆందోళన వ్యక్తం చేశారు.

వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్ శక్తుల గుప్పిట్లో పెట్టడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని గిడుగు రుద్రరాజు ఆరోపించారు.

మీడియా సమావేశంలో జాతీయ ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్ జంగా గౌతమ్ పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లాను కమ్మేసిన మంచు పొగ
# మసక బారిపోయిన గ్రామాలు



ధర్మపురి ఉదయపు వేళ? సూర్యుడు ఉదయించాల్సిన వేళ? జగిత్యాలతో పాటు ధర్మపురి నియోజకవర్గంలోని మండలాలలో చుట్టుముట్టినది మాత్రం వెలుగు కాదు.. తెల్లని మంచు పొగ. కళ్లముందు కనిపించే దృశ్యాలు కూడా మసకబారిపోయేంతగా ఉదయాన్నే దట్టమైన పొగ కమ్ముకుంది. రహదారులు, ఇళ్ల పైకప్పులు, చెట్ల కొమ్మలు అన్నీ ఒకే రంగులో కలిసిపోయి, జగిత్యాల పట్టణంతో పాటు ధర్మపురి నియోజకవర్గంలోని గ్రామాలు నిశ్శబ్దంగా నిలిచినట్టుగా కనిపించింది.ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో కూడా సూర్యుడు కనిపించకపోవడంతో చలి గాలుల ప్రభావం తీవ్రంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మంచు పొగ ప్రభావం ఎక్కువగా ఉండటంతో వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడంతో డ్రైవింగ్ మరింత జాగ్రత్తగా చేయాల్సి వచ్చింది. చలితో పాటు తేమ ఎక్కువగా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు ఇళ్లలోనే ఉండేందుకు మొగ్గుచూపుతున్నారు. రైతులు మాత్రం ఉదయపు వేళ పొలాల వద్దకు వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు, ఈ మంచు వాతావరణం పంటలకు కొంత మేలు చేసే అవకాశముందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.మబ్బుల్లో మునిగిన దృశ్యాలు ఒకవైపు ప్రకృతి సౌందర్యాన్ని తలపించగా? మరోవైపు చలి తీవ్రతను గుర్తుచేస్తోంది. ఇంకా కొన్ని రోజులు ఇలాంటి వాతావరణమే కొనసాగుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది.మొత్తానికి మంచు ముసుగులో నిద్రలేచిన జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాలలోని గ్రామాలు శీతాకాలపు నిశ్శబ్దాన్ని అనుభవిస్తూ మరో ఉదయాన్ని స్వాగతించింది.



# కలెక్టర్ కు తప్పిన ప్రమాదం

అంబేద్కర్ కోనసీమ సంక్రాంతి సందర్భంగా ఆత్రేయపురంలో ఏర్పాటు చేసిన పడవ పోటీల ట్రైల్ రన్ లో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ కు పెను ప్రమాదం తృటిలో తప్పింది. ట్రైల్ రన్ లో భాగంగా ఆయన పడవను నడుపుతుండగా పడవ ఒకసారిగా తిరగబడింది. అక్కడ వున్న గజ ఈతగాళ్లు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ను కాపాడారు. కలెక్టర్ కు ప్రమాదం తప్పడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# బీసీల ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలు

## కుల సంఘాల నేతలలో చర్చలు మంత్రి పొన్నం





హైదరాబాద్ బీసీ కులాల ఆత్మగౌరవ భవనాలకు సంబంధించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం నాడు శాసనమండలిలో ఎమ్మెల్సీ బండ ప్రకాష్ అడిగిన ప్రశ్నకు మంత్రి పొన్నం సమాధానం ఇచ్చారు.

మంత్రి మాట్లాడుతూ 42 భవనాలకు స్థలాలు ఇచ్చారు కానీ దాని అభివృద్ధి చేయడానికి కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. మూడు భవనాలు పని ప్రారంభం అయి మధ్యలో ఉన్నాయి. కులాలకు సంబంధించిన ప్రతినిధులు ఆ స్థలాలు ప్రైవేట్ వ్యక్తుల చేతులకు పోకుండా కాపాడుకోవాలని అన్నారు.

కురుమ భవనం పూర్తయిన ఎడ్యుకేషన్ ఇన్స్టూట్ ఇతర హాస్టల్ అవసరాలకు వాడాలని వారికే విభేధాలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి చాంపియన్. బీసీ ప్రజా ప్రతినిధుల తో శాసన సభ సమావేశాల్లోపు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం.బీసీ సబ్ ప్లాన్ పై గత సంవత్సరం ప్రారంభించాలనుకున్నాము ఆ నిధులు వాడతాం.బలహీన వర్గాల విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇటీవల జరిగిన సర్వే లో అభివృద్ధి చెందిన కుటుంబాల నివేదిక పరిశీలిస్తే ఏ కుటుంబంలో అయితే ఉన్నత చదువులు ఉన్నాయో వారే అభివృద్ధి చెందారు. బలహీన వర్గాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక తో ముందుకు పోతామని అన్నారు.

# ముఖ్యమంత్రిని విమర్శించకపోతే.. ప్రతిపక్షం

## ఎక్కడన్నా ముఖ్యమంత్రికి డబ్బా కొడుతుందా?

హైదరాబాద్ ముఖ్యమంత్రిని విమర్శించకపోతే.. ప్రతిపక్షం ఎక్కడన్నా ముఖ్యమంత్రికి డబ్బా కొడుతుందా అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మండిపడ్డారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వకపోవడం ఏంది.. ముఖ్యమంత్రిని పొగడడానికి వస్తారా సభకి. ముఖ్యమంత్రి మూసీ కంపును అంతా తీసుకొచ్చి తన నోటి ద్వారా అసెంబ్లీలో వదిలాడు. ప్రాధానమైన ప్రతిపక్షంగా మేము ప్రజల తరుపున ప్రశ్నలు అడిగి.. మేము పేద ప్రజల ఇల్లు కూల కొడితే వాళ్ల వెంట ఉంటామని చెబితే, ముఖ్యమంత్రి ఇష్టం వచ్చినట్లు దాడి చేసి మాకు అవకాశం ఇవ్వకుండా వేరే ప్రతిపక్షానికి అవకాశం ఇచ్చారని అన్నారు.

మా సబితా ఇంద్రా రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి మూసీ ప్రస్తావన తీసుకురాగానే వారి మైక్ కట్ చేసేసారు . స్పీకర్ వైఖరికి నిరసనగా మేము సభను బాయ్ కాట్ చేసామని అన్నారు.

# పెన్షనర్లకు సత్వరసేవలు అందిస్తాం.

## జిల్లా ట్రెజరీ అధికారి సీ. హెచ్ .సోఫియా.



జగిత్యాల పెన్షనర్లకు ట్రెజరీ శాఖ తరపున సత్వర సేవలు అందిస్తామని జిల్లా ట్రెజరీ అధికారి సీ. హెచ్.సోఫియా అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ట్రెజరీ అధికారి ఛాంబర్లో తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ముద్రించిన పెన్షనర్ల 2026 టేబుల్ క్యాలెండర్లు,గోడ క్యాలెండర్లు జిల్లా ట్రెజరీ అధికారి సి. హెచ్.సోఫియా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ట్రెజరీ అధికారిణి మాట్లాడుతూ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తున్న సంఘం ప్రతినిధులను అభినందించారు. టి. పి. సి. ఏ. రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగులకు,పెన్షనర్లకు సకాలంలో వేతనాల,పెన్షన్ల బిల్లులు ,మెడికల్ రియంబర్స్ మెంట్,తదితర ప్రయోజనం బిల్లులు సత్వరం మంజూరులో ప్రధాన పాత్ర వహిస్తున్న జిల్లా ఏ. టి. ఓ. మదుకుమార్,ఎస్. టి. ఓ. లు గణేష్,లావణ్య,అసిస్టెంట్ రవి కుమార్ ల సేవలను కొనియాడారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాజీ లేని పోరాటం చేస్తామన్నారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 నవంబర్ 30 వరకు రిటైర్మెంట్ అయిన వారికి పెన్షన్ బకాయిలు వెంటనే చెల్లించాలని, పెండింగ్ డి. ఏలు విడుదల చేయాలని,మెరుగైన ఫిట్మెంట్ తో పీఆర్సీ మంజూరు చేయాలని ప్రభుత్వంను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏ. టి. ఓ. మధు కుమార్,ఎస్. టి. ఓ. లు గణేశ్,లావణ్య,అసిస్టెంట్ రవి కుమార్, రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్,జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సి. హన్మంత రెడ్డి,కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథము, రిటైర్డ్ జిల్లా అటవీశాఖ అధికారి పూసాల అశోక్ రావు,ఉపాధ్యక్షులు వెల్ముల ప్రకాష్ రావ్,ఎం. డి. యాకూబ్, నాయిని సంజీవ రావు,ఆర్గనైజింగ్ కార్యదర్శి బొబ్బటి కరుణ,కె. సత్యనారాయణ,కట్ట గంగాధర్,ఎం. డి. ఇక్బాల్,సయ్యద్ యూసుఫ్,జగిత్యాల యూనిట్ అధ్యక్షుడు బి. రాజేశ్వర్,కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం,మల్యాల అధ్యక్షుడు వీరారెడ్డి,వివిధ మండలల కార్యవర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజల ముఖంలో చిరునవ్వులు ముఖ్యమంత్రి

## చంద్రబాబు నాయుడు లక్ష్యం

## డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి

బద్వేలు బడుగు బలహీన వర్గాల పేద ప్రజల ముఖంలో చిరునవ్వులు పూయిం చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏకైక లక్ష్యమని ఆదిశగా అడుగులువేయించేందుకుతామంతా కృషి చేస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అన్నారు శుక్రవారం బద్వేల్ లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు చెప్పినట్లుగా అమలుపరుస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథ కాలు అందిచడమే చంద్రబాబు లక్ష్య మన్నారు. ఇప్పటికే బద్వేలు,పోరుమామిళ్ల పట్టణాల్లో అభివృద్ధి వేగం గా జరుగుతోందన్నారు. రోడ్లవిస్తరణవీధిలైట్లు,త్రాగునీటి సరఫరా, ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన కృషి అమోఘమన్నారు. ఇంకా అభివృద్ధిచేస్తామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యే కప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు,లోకేష్ నాయుడు బద్వేలు నియోజకవర్గ అభివృద్ధి కి సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. ప్రతి కుటుంబం లో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యా లతో ఏడాదిపాటుఎలాంటిఆపదలుచోటుచేసుకోకుండా ఉండాలని కోరారు. విలేకరుల సమావేశంలో తెలుగు దేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు

# దుర్గం చెరువు ఆక్రమణ చేయలేదు

## వాహనాల పార్కింగ్ పై కేసు నమోదు

## కొత్త ప్రభాకర్ రెడ్డి




హైదరాబాద్ దుర్గం చెరువు ఆక్రమణపై తన మీద వస్తున్న వార్తలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కొట్టిపడేసారు. దుర్గం చెరువు కబ్జా అనేది పూర్తిగా నిరాధారం. దుర్గం చెరువులో మేము ఏదో 5 ఎకరాల భూమి కబ్జా చేశాను అని కేసు పెట్టారు.. అందులో మాకు గజం జాగా లేదు, ప్రభుత్వంకు కూడా గజం జాగా లేదని అన్నారు. అక్కడ అందరూ వాహనాల పార్కింగ్ పెట్టుకుంటారు.. అక్కడే ఖాళీ స్థలంలో చెత్త డంప్ చేస్తారు. కావాలని కేసు పెట్టారు.. వాళ్ళ దగ్గర ఆధారాలు ఉంటే చూపించాలి . నాపై కక్షతో కేసు పెట్టారు. బాలకృష్ణ, లహరి ఎస్టేట్ హరిబాబు భూములు పక్కనే ఉన్నాయి. దుర్గం చెరువులో నాకు భూమి లేదు.. ప్రభుత్వ భూమి కబ్జా చేసినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధం. రోడ్డు మీద, చెట్ల కింద వెహికిల్ పార్కింగ్ చేసినందుకు కేసు పెట్టారు. ఏదో హైడ్రా వాళ్లకు పిర్యాదు చేశారు అంట మాకు సిబ్బంది ఫోన్ చేశారు.. నేను వెళ్లాను. కేసు పై లీగల్ ఫైట్ చేస్తాం.. పోలీస్ స్టేషన్కు వెళ్తాను పోలీసులకు సహకరిస్తాను. అక్కడ వెహికిల్ పార్కింగ్ చేయడం సహజం. బేషరతుగా కేసు విత్డ్రా చేయకపోతే... ఎఫ్టీఎల్ లో ఇండ్లు కట్టారు.. ఆ ఇండ్ల ముందు ధర్నా చేస్తానని అన్నారు.

# బ్యాడ్మింటన్ పోటీలలో కోరుట్ల రామకృష్ణ విద్యార్థి ఎంపిక




కోరుట్ల, కేఎల్ యూనివర్సిటీ, విజయవాడ నిర్వహిస్తున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ 2025-26 లో భాగంగా జనవరి 3 , 2026 నుండి గుంటూరులో నిర్వహించబడే బ్యాడ్మింటన్ (మెన్) పోటీలలో పాల్గొనడానికి కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ టీంలో ఆడడానికి కోరుట్ల రామకృష్ణ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో బి. బి. ఏ మొదటి సంవత్సరం చదువుతున్న మహమ్మద్ అబ్దుల్ ముస్తాకిం ఎంపికయ్యాడు. ఈ సంధర్భంగా ముస్తాకింను కళాశాల ,కరస్పాండెంట్ యాద రామకృష్ణ, ప్రిన్సిపల్ ప్రవీణ్ తోపాటు అధ్యాపక బృందం, తోటి విద్యార్థులు అభినందించారు.



# రేవంత్ రెడ్డి ద్వంద్వ రాజకీయ వైఖరి

## ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## బిజెపి మాజీ ఎమ్మెల్యే డా.ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ మీడియా సమావేశం



వరంగల్ జనవరి 2 తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ వైఖరి పూర్తిస్థాయిలో ద్వంద్వ వైఖరికి ప్రతీకగా మారిందని బిజెపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. ఒకవైపు కేసీఆర్ గారు శాసనసభకు రావాలని, ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలని పదేపదే కోరుతూనే? మరోవైపు అదే కేసీఆర్‌పై దోపిడీ, అవినీతి, అక్రమాలు అంటూ తీవ్రమైన ఆరోపణలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారు. అవినీతిపరుడిగా ఆరోపిస్తున్న వ్యక్తి సలహాలు ముఖ్యమంత్రికి ఎందుకు కావాలి అన్న ప్రశ్నకు రేవంత్ రెడ్డి స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ దగ్గర నుంచి రేవంత్ రెడ్డికి కావాల్సిన సలహాలు – దోచుకోవడంలోనా? దాచుకోవడంలోనా? లేక తెలంగాణ ప్రజల హక్కులను పణంగా పెట్టే పాలనా విధానాల్లోనా? అసలు ఈ సలహాలు పరిపాలన కోసం కావాలా... లేక రాజకీయ లావాదేవీలు, లోపాయికార ఒప్పందాల కోసమా అన్న అనుమానం ప్రజల్లో బలంగా నాటుకుపోయిందని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారం ఒక రాజకీయ నాటకమేనని, దాని వెనుక కాంగ్రెస్?బీఆర్ఎస్ మధ్య లోపాయికార ఒప్పందం, అవగాహన దాగి ఉందన్న విషయం ఇప్పుడు ఒక్కొక్కటిగా ప్రజలకు అర్థమవుతోందని ప్రభాకర్ అన్నారు. పరిపాలన పేరుతో రాజకీయ లావాదేవీలు, రహస్య ఒప్పందాలే ప్రధాన అజెండాగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని విమర్శించారు.

అవినీతి కేసులపై ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం – కాంగ్రెస్–బీఆర్ఎస్ కుమ్మక్కుకు నిదర్శనం

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి కేసులపై ప్రభుత్వ వైఖరి స్పష్టంగా అనుమానాలకు తావిస్తోందని ఎన్.వి.ఎస్.ఎస్. ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణను నీరుగార్చడం, ఫోన్ ట్యాపింగ్ కేసును కావాలని సాగదీయడం, ఫార్ములా ఈ–రేస్ అక్రమాలపై కాగ్, పీఏసీ నివేదికలు ఉన్నా ఒక్క చర్య కూడా తీసుకోకపోవడం.. ఇవన్నీ కాంగ్రెస్–బీఆర్ఎస్ పార్టీల మధ్య ఉన్న అంతర్గత ఒప్పందానికి స్పష్టమైన నిదర్శనాలని నిలదీశారు. భూముల అమ్మకాల విషయంలోనూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే విధానంతో వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అప్పనంగా అమ్ముకుంటున్నాయి. ఈ రెండు పార్టీల వ్యవహారం 'నాకు నువ్వు–నీకు నేను' అన్నట్టుగా పిల్లలాటలా సాగుతోందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ–రేస్ కేసుల్లో విచారణ తుది దశకు చేరుకున్నప్పటికీ ఇప్పటివరకు ఒక్క అరెస్టు కూడా జరగకపోవడం వెనుక అసలు కారణం ఏమిటో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలి. రాష్ట్ర ఖజానాను దోచుకున్న వారిని చట్టపరంగా శిక్షించలేకపోయిందో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు.గతంలో కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులను బీఆర్ఎస్‌లో చేర్చుకోవడం, శాసనసభ–శాసనమండలిలో ఇతర పక్షాలను విలీనం చేసుకోవడం వంటి రాజకీయ అడ్డదారులు ఎంచుకున్న చరిత్ర అందరికీ తెలిసిందే. ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్‌తో 'నాకు నువ్వు – నీకు నేను' అన్నట్లుగా వ్యవహరిస్తూ తెలంగాణ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని ఎన్.వి.ఎస్.ఎస్. రేవంత్ సర్కారుకు చురకలంటించారు. ప్రజాస్వామ్య విలువలు, ప్రజాసేవ అనే మాటలు పక్కన పెట్టి, అధికారం–దోపిడీనే లక్ష్యంగా చేసుకొని కాలం వెల్లదీస్తోంది.

పంచాయతీ ఎన్నికల గొప్పలు – గ్రామాభివృద్ధి మాత్రం శూన్యం

ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఇద్దరూ 'మావాళ్లే గెలిచారు' అంటూ గొప్పలు చెప్పుకోవడం చూస్తే, ఈ రెండు పార్టీల రాజకీయ నాటకాల తీరును ఎన్.వి.ఎస్.ఎస్. బట్టబయలు చేశారు కానీ వాస్తవం ఏమిటంటే–గ్రామాల అభివృద్ధికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీలేదు, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేసినదీ శూన్యమే. గతంలో బీఆర్ఎస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున అధికారం ఇచ్చినా సర్పంచుల ధర్నాలు, ఆత్మహత్యలు, నిరసనలు తప్పలేదు. ఇప్పుడు కాంగ్రెస్‌కు అదే స్థాయిలో అధికారం అప్పగించినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదన్నారు. అంటే గ్రామీణ తెలంగాణను అప్పటి బీఆర్ఎస్, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు తీవ్రంగా నిర్లక్ష్యం చేశాయనేది రుజువైందని పేర్కొన్నారు. అధికారమే పరమావధిగా రెండు పార్టీలూ ప్రజల సమస్యలను పక్కన పెట్టి రాజకీయ ఆటలతో కాలం గడుపుతున్నాయన్నది గ్రామీణ తెలంగాణ ప్రజలకు ఇప్పుడు స్పష్టంగా అర్థమవుతోందన్నారు.

కేంద్ర నిధులే పంచాయతీలకు ప్రాణాధారం – రాష్ట్రం నుంచి దమ్మిడీ లేదు

గ్రామీణాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంనుంచి కనీస నిధులే లేకపోవడం దారుణమైన వాస్తవం. ఈరోజు పంచాయతీలు నిలబడగలుగుతున్నాయంటే అది కేవలం కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా వచ్చే నిధుల వల్లేనని ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ తేల్చిచెప్పారు. కేంద్రం నుంచి నేరుగా వచ్చే నిధులే పంచాయతీలకు ప్రాణాధారంగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను పూర్తిగా విస్మరించడంతో ఒకవైపు గ్రామాల్లో మౌలిక వసతులు క్షీణిస్తుంటే, మరోవైపు భారీ ప్రాజెక్టుల పేరుతో దోపిడీ రాజకీయాలు కొనసాగుతున్నాయని ఆయన మండిపడ్డారు.

కాళేశ్వరం తర్వాత పాలమూరు – అదే కథ, అదే దోపిడీ

గతంలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో స్థల మార్పిడి, అంచనాల పెంపు, వేల కోట్ల కమిషన్ల ఆరోపణలు ఎలా వచ్చాయో? ఇప్పుడు పాలమూరు ఎత్తిపోతల పథకంలో కూడా అదే కథ, అదే దోపిడీ కనిపిస్తోందని ప్రభాకర్ మండిపడ్డారు. పార్టీ మారినా, ప్రభుత్వం మారినా విధానం మాత్రం మారలేదు. ఈ మొత్తం రాజకీయ నాటకానికి కనిపించని దారాలు లాగుతున్నది రాహుల్ గాంధీయే. కాంగ్రెస్–బీఆర్ఎస్ పార్టీలను అనుసంధానం చేస్తున్నది రాహుల్ గాంధీయే. కాంగ్రెస్–బీఆర్ఎస్ పార్టీల మధ్య ఉన్న అంతర్గత బంధం, అనుబంధం రోజురోజుకీ బహిర్గతమవుతోందని నిగ్గుతేల్చారు.

ప్రభుత్వ ఆస్తులు కరిగిపోతే? మంత్రుల ఆస్తులు పెరుగుతున్నాయి

మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్తులు క్రమంగా కరిగిపోతుంటే? అధికారంలో ఉన్న మంత్రుల వ్యక్తిగత ఆస్తులు మాత్రం రోజురోజుకీ విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వ భూములు అమ్మడం, ప్రజా ఆస్తులను తాకట్టు పెట్టడం, అదే సమయంలో వ్యక్తిగత సంపదను పెంచుకోవడం... ఇదే ఈ కాంగ్రెస్ ప్రభుత్వ అసలు విధానమని ఎన్.వి.ఎస్.ఎస్. నిప్పులు చెరిగారు.

కాంగ్రెస్ అంటేనే కమిషన్లు, కరప్షన్, కాంట్రాక్టులు

పాలన పేరుతో ప్రజలను మభ్యపెట్టి, ఆస్తుల దోపిడీనే అజెండాగా ముందుకు వెళ్లడం కాంగ్రెస్ రాజకీయాలకు కొత్తేమీ కాదని.... కాంగ్రెస్ అంటేనే కమిషన్లు, కరప్షన్, కాంట్రాక్టుల రాజకీయాలు అన్న చేదు నిజం ఈరోజు దేశవ్యాప్తంగా బహిర్గతమవుతోంది. అందుకే క్రమేణా ఒక్కో రాష్ట్రంలో ప్రజల తీర్పుతో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోతోంది. తెలంగాణ కూడా దీనికి మినహాయింపు కాదన్నది కాంగ్రెస్ పాలన మొదలైన కొద్ది కాలంలోనే స్పష్టమైందని ప్రభాకర్ తెలిపారు.తెలంగాణలో సాగుతున్న కాంగ్రెస్–బీఆర్ఎస్ కపటనాటకాన్ని, ప్రజల దృష్టిని మళ్లించే డైవర్షన్ రాజకీయాలను భారతీయ జనతా పార్టీ పూర్తిగా ప్రజాక్షేత్రంలో బట్టబయలు చేస్తుంది. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, అవినీతి పాలనను నిలదీస్తుంది. తెలంగాణ ప్రజలు గట్టిగా ఆలోచించి, ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజు దగ్గరల్లోనే ఉందని డా.ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ హెచ్చరించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు ఒక వరం

## ఉరుకుంద ఈరన్న మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెన్న బసప్ప



కౌతాళం మండలం లో అనారోగ్యంతో ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందిన బాధితులకు సంబంధించిన మెడికల్ ఖర్చులకు సంబంధించి దాదాపు 4 లక్ష 52 వేల ,769 రూపాయలు సి.యం రిలీఫ్ ఫండ్ ను కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ఆదేశాల మేరకు ఉరుకుంద ఈరన్న మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెన్న బసప్ప కౌతాళం ఎడవల్లి కిరణ్ కుమార్ :-3.37.069 రూ, పొదలకుంట పూజారి మాంతమ్మ :-80.000 రూ,చూడి కమ్మరి మౌనేష్:-35.700 చెక్కులు ను అందజేశారు.వారు మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఒక వరమని బాధితులకు ఇంటి అత్యవసర సేవలకు ఉపయోగపడుతుందని అన్నారు. ముఖ్యమంత్రి కు కృతజ్ఞతలు తెలపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ గౌడ్, రవి, కొట్రేష్ గౌడ్ మాజీ ఎంపీటీసీ కురుగొడ. రహిమాన్ ఎరిగేరి మాజీ సర్పంచ్ శేఖర్,కామవరం సర్పంచ్ రంగస్వామి, బాపూరం వెంకటరెడ్డి,చూడి ఈరన్న, సిద్దు, మంజునాథ్, రాజాబాబు, సోమన్న, భీమయ్య, కోడిగుడ్ల రామాంజి, పూగ్గి నాగప్ప,తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన వనపర్తి ఎమ్మెల్యే.



వనపర్తి. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి శుక్రవారం హైదరాబాదులో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా వారు వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.వనపర్తి నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులన్నింటికీ తాను పూర్తిస్థాయిలో సహకరిస్తారని ముఖ్యమంత్రి తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిఎనుముల రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఖోఖో విభాగానికి అధ్యక్షునిగా మెహబూబ్ బాషా నియామకం

పస్పిల్ మున్నా ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ లోని ఖోఖో విభాగానికి అధ్యక్షునిగా ఆత్మకూర్ పట్టణానికి చెందిన షేక్.మెహబూబ్ ను నియమించినట్లు ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా తెలిపారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరనీ సందర్భంగా ఆత్మకూర్ పట్టణంలోని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్.షబానా గారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మకూర్ పట్టణంలో నీ యన్టీఆర్ ఐఎఐ స్టేడియం లో ఖోఖో శిక్షణ లో విద్యార్థులను రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో పాల్గొనేలా బాలబాలికలను శిక్షణ ఇస్తున్న మెహబూబ్ ను అభినందించారు. ఖోఖో సీనియర్ నేషనల్ క్రీడలో పాల్గొని ప్రస్తుతం ఔమా విభాగంలో కోచింగ్ పొందుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ స్టేడియం శిక్షకులు ఉపేంద్ర,రాజేష్ వీరితో పాటు నాగరాజు,విజయ్,హాజీ షరీఫ్, పాన్ మహమ్మద్ పాల్గొన్నారు

## రతన్ టాటా ఫౌండేషన్ పేదలకు దుప్పట్లు పంపిణీ




బద్వేల్ పట్టణంలోని ఫాతిమా మసీదు శుక్రవారం కాంప్లెక్స్ నందు నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి గురుమూర్తి మాట్లాడుతూ అమెరికాలో వున్న అల్లుడు రవీంద్ర ప్రసాద్,కుమార్తె అరుణ,మనుమరాలు సంహిత వారి ఆర్థిక సహకారం తో చలికాలంలో నిరుపేదలు ఎక్కడున్నా గుర్తించి వారి అవసరార్థమై దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేయడం అదృష్టంగా భావిస్తున్నామని,ప్రతి ఒక్కరూ సమాజంలోని పేదలకు రతన్ టాటాను ఆదర్శంగా తీసుకొని సామాజిక సేవ చేయాలని కోరారుఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ అధ్యక్షులు ఎస్.ఎ సత్తార్ ఆడిటర్ అల్లబకాష్ మదీన స్వీట్ షాప్ నాగూర్ భాష,ప్రభాస్ కరిముల్లా తదితరులు పాల్గొని ఫౌండేషన్ వారిని అభినందించారు.

## శ్రీ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్ కు రూ.10 లక్షలు, శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీంకు రూ.10 లక్షలు విరాళం



తిరుమల, టిటిడి ఆధ్వర్యంలోని శ్రీ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్ కు రూ.10 లక్షలు, శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీంకు రూ.10 లక్షలు చొప్పున విరాళం శుక్రవారం అందింది. హైదరాబాద్ కు చెందిన రైడాన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో వంగల హర్షవర్ధన్ రూ.10,00,000 శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్ కు, గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ జాయింట్ డైరెక్టర్ నేలబొట్ల శుభ సౌజన్య రూ. 10,00,000లు శ్రీ బాలాజీ ఆరోగ్యం వరప్రసాదిని స్కీం కు డీడీలను అందజేశారు. ఈ మేరకు రూ. 20 లక్షల డిడిలను టిటిడి చైర్మన్ శ్రీ బీ.ఆర్. నాయుడుకు శుక్రవారం ఆ సంస్థల ప్రతినిధుల తరుపున తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ అందజేశారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిపై అచంచలమైన భక్తితో టీటీడీ ట్రస్టులకు భక్తులు విరాళాలు అందించడం పట్ల ఛైర్మన్ బీ ఆర్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

# సరికొత్త ఆలోచనలతో నూతన సంవత్సరంలో ప్రజలందరూ నూతన ఉత్తేజంతో ముందుకు సాగాలి..సత్యం శ్రీరంగం



**కూకట్పల్లి (ప్రజాబలం) జనవరి 02:** నూతన సంవత్సరం పురస్కరించుకొని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగంని ఖైత్లాపూర్ లోని వారి నివాసంలో కూకట్ పల్లి నియోజకవర్గం డివిజన్ ల నాయకులు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ నూతన సంవత్సరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అంత సుఖ సంతోషాలతో ఉండాలని పార్టీ పటిష్టతకు మరింత పాటు పడాలని సూచించారు. ప్రజలు నూతనోత్సాహంతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలకాలని, ఆశలు ఆశయాలూ తీర్చే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నారన్నారు. భవిష్యత్ కోసం కష్టపడుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సరికొత్త ఆలోచనలతో నూతన సంవత్సరంలో జోష్ తో ముందుకు సాగాలని ఆశీస్తున్నానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వానికి అందరం ఎల్లవేళలా అండగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విశాల్ సుధాం, సుంకన్న, విఠల్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్లు ప్రకాష్ ముదిరాజ్, అరుణ్ గౌడ్, జమీల్, కనకయ్య, రాము, మహేష్ గౌడ్, శేఖర్ గజానంద్, శివ జిల్లా, బాల, నరసింహా యాదవ్, సప్పిడి భాస్కర్, నాగేందర్, అంజి రెడ్డి, జిబిన్, బాలయ్య, శ్రీనివాస రెడ్డి, ఆది రెడ్డి, చోట మొయిజ్, పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డ్రైవింగ్ లో సీట్ బెల్ట్ తప్పని సరి

## జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్

## రోడ్డు మాసోత్సవాల సందర్భంగా వాహనాల తనిఖీ

**రాజన్నసిరిసిల్ల జిల్లా, జనవరి-2 (ప్రజాబలం ప్రతినిధి)**డ్రైవింగ్ లో సీట్ బెల్ట్ తప్పని సరిగా పెట్టుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా రవాణా శాఖ సిబ్బంది శుక్రవారం







వేములవాడ కమాన్ వద్ద కార్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ట్రాఫిక్, రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని కార్ల వాహనదారులు సీటు బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం తాగి నడపవద్దని, రాంగ్ రూట్ లో వెళ్లకూడదని, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని సూచించారు. స్పీడ్ కంట్రోల్ లో ఉండాలని, వాహనం రివర్స్ లో వెళ్లేప్పుడు తప్పనిసరిగా వాహనం కింద, వెనుక గమనించాలని పేర్కొన్నారు. సీటు బెల్టు పెట్టుకుని వాహనాన్ని నడిపిన వారికి స్వీట్లు పంపిణీ చేశారు. సీటు బెల్ట్ ధరించకుండా వాహనాలను నడిపిన వారికి దాని ప్రాముఖ్యత గురించి తెలిపారు. వాహనాలకు వాహన భద్రతా స్టిక్కర్లు అతికించారు. సీట్ బెల్ట్ పెట్టుకొని వాహనం నడుపుతామని వాహన దారులతో రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వేములవాడ ట్రాఫిక్ ఎస్ఐ రాజు, మోటారు వాహనాల తనిఖీ అధికారి వంశీధర్, మోటార్ వాహనాల సహాయక తనిఖీ అధికారి రజిని, పృథ్వీరాజ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ పట్టణంలో బిజెపి ఆధ్వర్యంలో ఎన్నికల సన్నాహక సమావేశం.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** శుక్రవారం రోజున వేములవాడ పట్టణ బిజెపి ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల సన్నాక సమావేశం పట్టణంలోని పద్మశాలి సంఘం లో వేములవాడ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథి హాజరైన రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ రాజన్న క్షేత్రంలో వేములవాడ మున్సిపల్ లో బిజెపి జెండా ఎగరవేయడం లక్ష్యంగా ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణానికి చెందిన మాజీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మరియు కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి వేములవాడ మున్సిపల్ పై బిజెపి జెండా ఎగరవేయడానికి దోహదపడాలని ఆయన తెలిపారు. వేములవాడ నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ చెన్నమనేని వికాస్ రావు మాట్లాడుతూ గతంలో కంటే బిజెపి పార్టీ ప్రస్తుతం బలంగా ఉంది అని బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్రం మహేష్, సిరికొండ శ్రీనివాస్, కృష్ణ స్వామి, సంటి మహేష్, రేగుల రాజ్ కుమార్, రాధిక వివేక్, రేగుల సంతోష్, వెంకన్న, రేణు కింది అశోక్, గడ్డమీది శ్రీను, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అందోల్- జోగిపేట మున్సిపాలిటీ నూతన ఓటర్ల జాబితా విడుదల



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 02 (ప్రజాబలం )**సంగారెడ్డి జిల్లా రాష్ట్ర ఎన్నికల ఆదేశానుసారం సంగారెడ్డి జిల్లా, ఆందోల్-జోగిపేట, మున్సిపాలిటీ, నూతన ఓటర్ల జాబితాను గురువారం మున్సిపల్ కమిషనర్, రవీందర్, విడుదల చేశారు, నూతన ఓటర్ల జాబితాలో ఏమైనా సవరణలు ఉన్నట్లయితే, ఈనెల4 వ తారీకు వరకు జాబితా చూసుకొని, తప్పుల్లు ఉన్నచో సవరణకు సవరణలకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు, మునిసిపాలిటీ పరిధిలోని,20. వార్డులలో 16460, ఓటర్లు పురుషులు ఉండగా, 7893, మహిళలు,8567, మంది ఓట్లరూలు ఉన్నారని , మునిసిపల్ కమిషనర్ రవీందర్, తెలిపారు..........

# రంగమ్మ గూడెం లో ఇందిరమ్మ చీరల పంపిణీ




యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామపంచాయతీ (రంగమ్మ గూడెం) గ్రామంలో ఉత్సాహంగా సాగింది. నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల వీరేశం కక్కిరేణి సర్పంచ్ చిల్లా మధురవేణి సురేష్ ఆదేశాల మేరకు రంగమ్మ గూడెం10వ వార్డు సభ్యులు వంగాల అవినాష్ ఖూూ చిల్లా అశోక్ ఆధ్వర్యంలో మహిళలకు చీరలను అందజేశారు. గతంలో లాగా కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు నాణ్యమైన చీరలను అందజేస్తుందని చెప్పారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా మహిళల ఆధారంగా పథకాలను




రూపొందించినట్లు చెప్పారు అందులో భాగంగానే ఉచిత బస్సు పథకాన్ని అద్భుతంగా కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

# నేడే కొండగట్టుకు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాక.

## పవన్ కళ్యాణ్ ను సాధారంగా ఆహ్వానిస్తున్నాం. తెలంగాణ రాష్ట్ర బీసీ సాధికారిత గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానానికి విచ్చేయుచున్న జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు తెలంగాణ బీసీ సాధికారిత గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ ఘన స్వాగతం తెలిపారు. పవన్ కళ్యాణ్ కొండగట్టు పర్యటన నేపథ్యంలో ఆలయ పరిసరాలలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలిస్తూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించేందుకు అధికారులతో సమన్వయం చేశారు. ఈ సందర్భంగా కొండ దేవయ్య పటేల్ వేములవాడలో ఒక పత్రిక ప్రకటన విడుదల చేస్తూ పవన్ కళ్యాణ్ కొండగట్టుకు రావడం భక్తులు, జనసేన శ్రేణుల్లో విశేష ఉత్సవాన్ని నింపుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తిరుమల తిరుపతి దేవస్థానం నుండి నిధులు మంజూరు చేపించి, తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల జిల్లా కొండగట్టు పుణ్యక్షేత్రంను అభివృద్ధి పరచడం అభినందనీయం అన్నాడు. ప్రజాసేవ, ధర్మ పరిరక్షణ, సామాజిక న్యాయం లక్ష్యంగా పవన్ కళ్యాణ్ చేపడుతున్న కార్యక్రమాలు రా(ష్టానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన ప్రశంసించారు. కొండగట్టు వంటి ఆధ్యాత్మిక క్షేత్రానికి పవన్ కళ్యాణ్ రాక రాష్ట్ర ప్రజలకు శుభసూచకం అని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, త్రాగునీరు, వైద్య సదుపాయాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జనసేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శంకర్ గౌడ్, జనసేన పార్టీ కార్యవర్గ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే మున్నూరు కాపు, బీసీ జేఏసీ తరఫున పవన్ కళ్యాణ్ కు ఘన స్వాగతం పలుకుతున్నట్లు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ ప్రకటించారు. బీసీల సాధికారిత, సమాన హక్కుల సాధనలో పవన్ కళ్యాణ్ నాయకత్వం కీలకపాత్ర పోషిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్నూరు కాపు సంఘ నాయకులు, బీసీ జేఏసీ ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

# జనవరి 3 నుంచి రాష్ట్రపతి నిలయంలో రెండో 'ఉద్యాన్ ఉత్సవ్' ప్రదర్శన



హైదరాబాద్, 2 జనవరి, 2026:ప్రజా భాగస్వామ్యం, పర్యావరణ స్పృహను ప్రోత్సహించే ప్రయత్నాల్లో భాగంగా భారత రాష్ట్రపతి శీతాకాల నివాసమైన రాష్ట్రపతి భవన్‌లో 2026 జనవరి 3 నుంచి 11 వరకు 'ఉద్యాన్ ఉత్సవ్' రెండవ ప్రదర్శన జరగనుంది.రాష్ట్రపతి నిలయాలను పౌర భాగస్వామ్యానికి, పర్యావరణ స్పృహకు కేంద్రాలుగా మార్చాలనే గౌరవ భారత రాష్ట్రపతి ఆకాంక్ష మేరకు ఈ ఉత్సవం నిర్వహిస్తున్నారు. దీనిని రాష్ట్రపతి నిలయం ఆధ్వర్యంలో వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ నిర్వహిస్తుండగా.. 'మేనేజ్' సహకారం అందిస్తోంది.'ఉద్యాన్ ఉత్సవ్ 2026'లో సుమారు 120 ప్రదర్శకులతో 50 నేపథ్య స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇవి వ్యవసాయ రంగంలో ఆవిష్కరణలు, వ్యాపార అవకాశాలు, విలువ ఆధారిత ఉత్పత్తులకు వేదికగా నిలుస్తాయి. ఇక్కడ సందర్శకులు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే గ్రీన్ నాలెడ్జ్ హబ్.. పోషక విలువలున్న చిరుధాన్యాల ఉత్పత్తులను ప్రోత్సహించే మిల్లెట్ మండి, స్టార్టప్ హబ్.. సేంద్రీయ ఉత్పత్తులు, జీఐ ట్యాగ్ ఉత్పత్తులు, గిరిజన హస్తకళల ప్రదర్శనకు ఎకో బజార్.. బయో ఇన్‌పుట్స్, నర్సరీ మొక్కల విక్రయానికి ప్లాంట్ అండ్ ప్రొడ్యూస్.. 59 రైతు ఉత్పత్తిదారుల సంఘాల నుంచి నేరుగా ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు జోన్,ఫామ్-2-ఎంటర్‌ప్రైజ్ వంటి వివిధ విభాగాలను చూడవచ్చు.ఈ ఉత్సవంలో భాగంగా ప్రతిరోజూ వైవిధ్యభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. వీటిలో భరతనాట్యం, కథక్, కూచిపూడి వంటి శాస్త్రీయ నృత్యాలు..పేరిణి శివతాండవం, ఒగ్గు డోలు, మాధురి నృత్యం వంటి ప్రాంతీయ కళారూపాలు.. సంగీత కచేరీలు, హరికథ, బుర్రకథ వంటి వారసత్వ కళలు, వివిధ రకాల సంగీత కచేరీలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ ప్రదర్శనలో సమాజ భాగస్వామ్య ముఖ్య ఆకర్షణగా నిలవనుంది. కుండల తయారీ, కూరగాయలపై చెక్కడాలు, విత్తన బంతుల తయారీ వంటి నేర్చుకుంటూ చేసే పనులు ద్వారా యువతలో పర్యావరణ పరిరక్షణపై అవగాహనను పెంపొందించేందుకు రూపొందించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులైన హైడ్రోపోనిక్స్, ఆక్వాపోనిక్స్, సహజ రంగుల వెలికితీతపై ప్రత్యక్ష ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. క్విజ్ పోటీ, "విష్ ట్రీ-మై ప్రామిస్ టు ఇండియా" వంటి ప్రత్యేక కార్యక్రమాలు కూడా ఉన్నాయి. ఈ ఉత్సవం జ్ఞానాన్ని పంచుకునే వేదికగా కూడా నిలవనుంది. ఇందులో భాగంగా నిపుణుల ఆధ్వర్యంలో సహజ, సేంద్రీయ వ్యవసాయం, వాతావరణ మార్పులకు తట్టుకునే వ్యవసాయ సాంకేతికతలు, చిరు ధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులు వంటి అంశాలపై ఐఐఎంఆర్, ఐఐఓఆర్ ఏపీఈడీఏ వంటి ప్రముఖ సంస్థలతో వర్క్‌షాప్‌లు, పరస్పర చర్చా సమావేశాలు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు చామంతి, సెలోసియా, బంతిపూలు, పాయిన్‌సెట్టియాలు ఇతర కాలానుగుణ పూలతో రూపొందించిన విభిన్న నేపథ్య పుష్ప అలంకరణలు ఏర్పాటు చేశారు. సృజనాత్మకంగా అలంకరించిన పుష్ప ప్రదర్శనలు ఉత్సాహభరితమైన పండుగ వాతావరణాన్ని కలిగిస్తాయి.ఈ ఉద్యాన్ ఉత్సవ్ అందరికీ ఉచితంగా ప్రవేశాన్ని కల్పిస్తోంది. ప్రతిరోజూ ఉదయం 10.00 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు రాష్ట్రపతి నిలయం ప్రధాన పచ్చిక బయళ్లలో జరుగుతుంది. ప్రజలకు గేట్ నంబర్ 2 ద్వారా ప్రవేశం కల్పించారు. సందర్శకులు తమ ప్రవేశాన్ని రాష్ట్రపతి భవన్ విజిట్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు లేదా విజిటర్ ఫెసిలిటేషన్ సెంటర్లో ఏర్పాటు చేసిన కియాస్క్‌ల వద్ద నమోదు చేసుకోవచ్చు. 11 రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవానికి సంబంధించిన వివరాలను రాష్ట్రపతి నిలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్, వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీ జస్బీర్ సింగ్, మేనేజ్ డైరెక్టర్ డాక్టర్ శైలేంద్ర, రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ కే రజనీ ప్రియ మీడియాకు తెలియజేశారు.తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ అనుగు నరసింహారెడ్డి, రాష్ట్రపతి నిలయం ప్రజా సంబంధాల అధికారి శ్రీ కుమార్ సమ్రేష్ కూడా ఈ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

# వేములవాడలో మున్సిపల్ ఎన్నికలకు సిద్ధమవుతున్న ఆశ వాహులు.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్న వేళ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఆశావాహులు సిద్ధమవుతున్నారు. జనవరి ఒకటవ తేదీన తెలంగాణ రాష్ట్రంలోని 117 మున్సిపాలిటీలలో ఓటర్ డ్రాఫ్ట్ విడుదల చేయడంతో మున్సిపల్ పరిధిలో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కుతున్నది. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెలలో వచ్చే అవకాశం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్న సమయంలో మున్సిపల్ కౌన్సిలర్ గా పోటీ చేయడానికి ఆశావాహులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన వెంటనే ఎన్నికల రణరంగంలోకి దూకడానికి నాయకులు సిద్ధంగా ఉన్నారు. వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గం లో వేములవాడ ఒక్కటే మున్సిపల్ ఉండడంతో ఇక్కడ పోటీ వివిధ పార్టీల మధ్య తీవ్రంగా ఉండే పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ నుండి వేములవాడ ఎమ్మెల్యేగా గెలిచిన ఆది శ్రీనివాస్ ప్రస్తుతం ప్రభుత్వ విప్ గా కొనసాగుతున్నాడు. వేములవాడ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృత నిశ్చయంతో ఉన్నాడు. అధికార పార్టీ నుండి వివిధ వార్డులలో కౌన్సిలర్లుగా పోటీ చేయడానికి ఆశావాహుల సంఖ్య భారీగా పెరగడంతో ఎవరికి టికెట్ వస్తది, ఎవరికి రాదు అనే సంశయం నెలకొంది. కౌన్సిలర్ టికెట్ల కోసం అప్పుడే వేట మొదలైంది. వేములవాడ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆచితూచి అడుగులేస్తూ, గెలిచే గుర్రాలకు టిక్కెట్ ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది.గతంలో వేములవాడ మున్సిపల్ బిఆర్ఎస్ ఆధీనంలో ఉండగా మళ్లీ వేములవాడ మున్సిపల్ పై గులాబీ జెండా ఎగురవేయాలని బిఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు, ప్రస్తుత సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సలహా సూచనల మేరకు ముందడుగు వేయాలని, అధికార పార్టీ ఎత్తులకు, పైఎత్తులు వేయాలని, గత వైభవాన్ని కాపాడుకోవాలని, మున్సిపల్ కౌన్సిలర్లుగా పోటీ చేసే అభ్యర్థుల ఆర్థిక స్థితిగతులు, ప్రజలలో గల పట్టు, తదితర అంశాలను లోతుగా పరిశీలించి గెలుపు అవకాశాలు ఉన్న వారికే టికెట్లు కేటాయించే పరిస్థితి ఉన్నట్లు విశ్వాసనీయ సమాచారం. మరొకవైపు వేములవాడ మున్సిపల్ లో బిజెపి పార్టీ గట్టి పట్టు సాధించాలని అవసరమైతే మున్సిపల్ పై బిజెపి కాషాయ జెండా ఎగురవేయాలని, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు కేంద్ర ం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గత రెండు రోజుల క్రితం వేములవాడ మరియు సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో సమాలోచనలు చేయడం జరిగింది. ఎట్టి పరిస్థితులలో వేములవాడ, సిరిసిల్ల మున్సిపల్ బిజెపి కైవసం చేసుకోవాలని ఇప్పటికే కార్యకర్తలకు, ముఖ్య నాయకులకు దిశా నిర్దేశం చేసి రంగం సిద్ధం చేసుకున్నారు.ఏది ఏమైనా ఈసారి వేములవాడ మున్సిపల్ ఎన్నికలు రసవత్తరంగా కొనసాగే అవకాశం ఉంది. రెండు జాతీయ పార్టీలు, ఒక ప్రాంతీయ పార్టీ లకు వేములవాడ మున్సిపల్ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా తయారవుతుంది అని అనడంలో అతిశయోక్తి లేదు. వేములవాడ మున్సిపల్ పై ఏ పార్టీ జెండా ఎగురుతుందో జనవరి నెలాఖరు వరకు తెలిసే పరిస్థితి నెలకొని ఉంది.

# వేములవాడ లో వరి నారుమడులను పరిశీలించిన వ్యవసాయ అధికారులు.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** శుక్రవారం రోజున వేములవాడ లోకల్ లో వరి నారుమడులను వేములవాడ వ్యవసాయ విస్తరణ అధికారి రాజు సందర్శించారు. వరి నారుమడిలో ఇనుప దాతు లోపం మరియు జింకులోపం ను గమనించి ఇనుప దాతు లోపానికి అన్న బేది 1 గ్రాము లీటరు నీటికి , జింకు లోపానికి సిలేటెడ్ జింక్ 2 గ్రాములు లీటర్ నీటిని కలిపి పిచికారి చేయాలని, తీవ్ర చలి ప్రభావం వలన వరి ఎండిపోకుండా రాత్రి వేళల్లో నారు మడి చుట్టూ వెచ్చటి నీటిని ఉంచాలి అని ఆయన సిఫారసు చేయడం జరిగింది.

# వేములవాడ భీమేశ్వరాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు.




**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన శ్రీ రాజరాజస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మేడారం సమ్మ క్కసారలమ్మ జాతర ప్రారంభం కావడంతో పాటు వేములవాడలో మహాశివరాత్రి జాతరను పురస్కరించుకొని అవసరమైన మౌలిక సదుపాయాలు ప్రారంభమయ్యాయి. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మరియు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమ అగ్రవాల్ ఆదేశాల మేరకు శుక్రవారం రోజున శ్రీ భీమేశ్వరాలయంలో వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది. వేములవాడ లో భీమన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన వైద్య సేవలు అందించేందుకు ఈ వైద్య శిబిరం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని వేములవాడ పట్టణవాసులు మరియు భక్తులు పేర్కొన్నారు.

# హెూంగార్డు కి ఆత్మీయ వీడ్కోలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జనవరి 2 (ప్రజాబలం ప్రతినిధి)**పదవి విరమణ పొందుతున్న ం గార్డ్ మధు కి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు. జిల్లా పోలీస్ శాఖలో హెూంగార్డ్ గా గత 31 సంవత్సరాలుగా విధులు నిర్వహించి పదవి విరమణ పొందుతున్న ఎన్. మధు ను ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ చంద్రయ్య పూలమాల వేసి శాలువలతో ఘనంగా సన్మానించారు.పోలీస్ ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందినారని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ..జిల్లా పోలీస్ విభాగంలో సుధీర్ఘకాంగా విధులు నిర్వహించి పదవీవిరమణ చేసిన మీ సేవలు మరువమని,పదవి విరమణ చేసిన అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని, ఎలాంటి సమస్య వచ్చిన తమని సంప్రదించ వచ్చని పోలీసు రిటైర్ మెంట్ కేవలం తన వృత్తికే, కాని తన వ్యక్తిత్వానికి కాదు అని కొనియాడారు.ఈకార్యక్రమంలో ఆర్.ఐ యాదగిరి పాల్గొన్నారు..

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ






**రాజన్న సిరిసిల్ల జిల్లా, జనవరి 2( ప్రజాబలం ప్రతినిధి)**జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత రాజన్న సిరిసిల్ల జిల్లా , కోనరావుపేట మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించినారు. ఈ తనిఖీలలో గర్భిణీ క్ష్మల రిజి(స్టేషన్, చెకప్ ల ఆన్లైన్లో నమోదు, సాధారణ ప్రసవాలపై ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రోత్సహించడంతోపాటు కేంద్ర ఆరోగ్య పథకాల ఎన్ సి డి, టీబీ వ్యాధి ఇతర ఆరోగ్య కార్యక్రమాల ఆన్లైన్లో నమోదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల డాక్టర్ వేణుమాధవ్, డాక్టర్ సురేష్ తో సమీక్షించి, లక్ష్యాలు సాధించాలని ఈ సందర్భంగా సూచించినారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ బాలచంద్రం పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రవేట్ ఆసుపత్రిలో స్కానింగ్ సెంటర్ల తనిఖీల్లో డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ నాగేంద్రబాబు, డిప్యూటీ డెమో రాజకుమార్ పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై వాహనదారులకు అవేర్నెస్ కల్పించినా జోగిపేట ఎస్ఐ, పాండు



**అందోల్ నియోజకవర్గం జనవరి 03 )(ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** జోగిపేట మున్సిపల్ పట్టణ ఎస్ఐ, పాండు, ఈరోజు సాయంత్రం 5, 6,గంటల మధ్యలో జాతీయ రహదారి 161 పైన అటుగా వెళ్తున్న వాహనాలు ఆపి, వాహనాల్లో ఉన్న వారందరిని క్రిందకు దించి, ఈ జాతీయ రహదారి మీద ఎక్కువ ప్రమాదాలు జరగడానికి కారణం, మన వాహనాలను అతివేగంగ నడపడమే కారణం అని వారి చేత ప్రమాణం చేయించారు, రోడ్డు నియమ నిబంధనలను పాటిస్తాను అని, ఇతరుల శ్రేయస్సును , తోటి రోడ్డు ప్రయాణికులను గౌరవిస్తానని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా, నా కర్తవ్యాలను, శ్రద్ధతో, అంతర్గత శుద్ధితో, నిర్వహిస్తానని,రోడ్డుపై ప్రయాణించేటప్పుడు, ట్రాఫిక్ ఉల్లంగాలను, అతిక్రమించానాని, ప్రజలందరూ మన రోడ్లపై సురక్షితంగా ప్రయాణించేందుకు, సహకరిస్తానని, ధ్రుడ సంకల్పంగా అంతర్గత శుద్ధితో ప్రమాణం చేస్తున్నాను అని జోగిపేట ఎస్ఐ పాండు, జాతీయ రహదారిపై వాహనాలను ఆపి ఈ విధంగా ప్రమాణం చేయించారు....

## న్యూ ఇయర్ మెతుకు ఆనంద్,ను సన్మానించిన నర్సాపూర్ పెద్ద తాండ బి ఆర్ ఎస్,ప్రెసిడెంట్ రాందాస్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జనవరి 2 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం నర్సాపూర్ పెద్ద తాండ బి ఆర్ ఎస్ ప్రెసిడెంట్ రాందాస్ ఘనంగా వికారాబాద్ బిఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ను సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు గ్రామాల్లో ఉన్న కార్యకర్తలకు తోడుగా ఉండి ఎప్పటికప్పుడు మనవాళ్లకు సహాయ సహకారాలు అందిస్తూ మండల స్థాయి సమావేశాల్లో పాల్గొంటూ ప్రజల్లోనే ఉంటూ ప్రజలకు సేవ చేసే కార్యక్రమాల్లో ముందుండాలని అది బాధ్యతగా ప్రెసిడెంట్లు స్వీకరించాలని ఏం భయపడవద్దు మళ్లీ మనం ప్రజల్లోకి వస్తున్నాం మళ్ళీ మనం ప్రజలకు సేవ చేసే అవకాశం త్వరలోనే ఉంది మన ఊరి ప్రజలకు బి ఆర్ ఎస్ కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని వికారాబాద్ బిఆర్ఎస్ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపి నూతన సంవత్సర సందర్భంగా రాందాస్ చేతిలో చేయి కలిపిసంతోషం వ్యక్తపరిచి నట్లు తెలిపారు

## న్యూ ఇయర్ డాక్టర్ మెతుకు ఆనంద్, తో నర్సాపూర్ పెద్ద తాండ ఉప సర్పంచ్ మోహన్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి** వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి డిసెంబర్ 2 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం నర్సాపూర్ పెద్దతండ ఉపసర్పంచ్ న్యూ ఇయర్ సందర్భంగా వికారాబాద్ బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ను కలసి న్యూ ఇయర్ విషెస్ తెలిపి గ్రామం గురించి గ్రామ అభివృద్ధి గురించి ముచ్చటించి మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని నర్సాపూర్ పెద్ద తండా ఉపసర్పంచ్ మోహన్,తెలిపారు

## యేన్కెపల్లి సీయోను కొండపై కేక్ కట్చేసినరామచంద్రరెడ్డిదంపతులు




**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 2(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**యెన్కేపల్లిలో రామ్ చెంద్రారెడ్డి (బాబురెడ్డి) అనే అన్యుడు అంటే దేవుణ్ణి ఎరుగని బిడ్డ యెన్కేపల్లి సీయోను కొండపైన ఉన్న సిలువ ముందు తలవంచి మోకరించడం అంటే ఎంతా ధన్యతనో ఆలోచించండి రామ్ చెంద్రారెడ్డి కోరకు బార్య సునీత కోరకు ఒక్క కుమారుడు ఒక్క కుమార్తె కోరకు మీరు మన దేవునికి గనత కలుగునట్లు మీయొక్క పర్సనల్ ప్రార్థనలో జ్ఞాపకం చేయాలని సీయోను కొండ ఫౌండర్ గుట్టమీద రిబ్కారాములు తెలిపారు సీయోను కొండను దేవుడు అద్భుతంగా అద్భుతంగా ఆశీర్వదించినందుకు దేవునికి మహిమ అనేకమంది పర్యటకులు పెద్దలు సీయోను కొండను దర్శించుకుని ఆనందించినట్టు చూస్తూ ఉన్నాం. మంచి వాతావరణము ప్రశాంతమైన వాతావరణం నిర్మలమైన వాతావరణము మేఘాలు సమీపించినట్టు అందమైన ఆహ్లాదకరమైన చక్కటి వాతావరణం దేవుని పట్టణం కళ్లకు కట్టినట్టుగా కొండపై కనిపిస్తా ఉంటుంది చల్లటి గాలి పచ్చని పొలాలు అందమైన ప్రకృతిని ఆస్వాదిస్తూ దేవుని మహిమ పరుస్తూ దేవుని ఘనపరుస్తూ కొండపైన ఉన్నంత సేపు మానసిక ప్రశాంతత ఉల్లాసము ఆనందము సంతోషము వేళ్ళు విరిచినట్టుగా ఉంటుంది అనేకులు సీయోను కొండను సందర్శించి రాబోయే రోజుల్లో అద్భుతమైన ఆశీర్వాదకరమైన మ పకారమైన కార్యములు దేవుడు జరిగిస్తాడని ఏ పరిస్థితుల్లో ఉన్న కష్టంలో ఉన్న బాధలో ఉన్న సమస్యలో ఉన్నఎనీ టైం సీయోను కొండకు వచ్చి ప్రశాంతమైన దేవుని సన్నిధిలో ఒక్క దినము గడుపుట వెయ్యి దినముల కంటే శ్రేష్టం అని సీయోను కొండ ఫౌండర్ గుట్టమీద రిబ్కా రాములు, పాస్టర్ డి పౌలు,సంతోషం వ్యక్తపరిచారు

### సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన వెల్ఫేర్ అసిస్టెంట్లు సీనియార్టీ జాబితాను విడుదల చేయడం పట్ల కృతజ్ఞతలు తెలియజేసిన వెల్ఫేర్ అసిస్టెంట్లు.

పత్తికొండ/తుగ్గలి:ఉ కర్నూల్ జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాధికను వెల్ఫేర్ అసిస్టెంట్లు శుక్రవారం రోజున మర్యాదపూర్వకంగా కలిశారు.పత్తికొండలోని సమీకృత సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాము నందు పదవ తరగతి విద్యార్థులలో ఉత్తీర్ణత శాతం పెంచడం కోసం విద్యార్థులతో ముచ్చటించి, విద్యార్థులకు సలహాలు సూచనల వంటి విలువైన విషయాలను డిప్యూటీ డైరెక్టర్ విద్యార్థులకు తెలియజేశారు.అనంతరం కర్నూలు జిల్లా వెల్ఫేర్ అసిస్టెంట్ అసోసియేషన్ తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ, వెల్ఫేర్ అసిస్టెంట్ కు సంబంధించిన సీనియార్టీ జాబితాను విడుదల చేయడం పట్ల వెల్ఫేర్ అసిస్టెంట్స్ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం డిడి మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో వెల్ఫేర్ అసిస్టెంట్స్ అందరూ చాలా బాగా పనిచేస్తున్నారని,గ్రామస్థాయిలో గ్రామాల అభివృద్ధిలోను మరియు ప్రజలకు పథకాలు అందజేయడంలోను వెల్ఫేర్ అసిస్టెంట్స్ కీలకపాత్ర పోషిస్తున్నారని తెలియజేశారు. అదేవిధంగా ప్రస్తుతం జరుగుతున్నటువంటి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే గురించి మరియు ఫీజు రియంబర్స్మెంట్ గురించి ఆమె వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అందరికీ వెల్ఫేర్ అసిస్టెంట్ అసోసియేషన్ తరపున శాలువా మరియు పుష్పగుచ్ఛముతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలతో TGOs క్యాలెండర్ ఆవిష్కరణ



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి** ప్రజాబలం జనవరి 2:ఈరోజు TGOs అసోసియేషన్ మేడ్చల్ మల్కాజిగిరి డిస్ట్రిక్ట్ గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ మేడ్చల్ మల్కాజ్గిరిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ TGOs అసోసియేషన్ మేడ్చల్ మల్కాజిగిరి డిస్ట్రిక్ట్ 2026 క్యాలెండర్ టేబుల్ క్యాలెండర్‌లను ప్రారంభించారు. సభ్యులు శ్రీ.జి.వినోద్ కుమార్, అధ్యక్షుడు శ్రీ.ఎ.కురుమూర్తి, కార్యదర్శి, ఉపాధ్యక్షుడు శ్రీ.డి.రవీందర్, శ్రీమతి విజయ కుమారి, శ్రీమతి సాంబశివరావు, శ్రీ. కిషన్, శ్రీమతి ఝాన్సీ, రఘునందన్ గౌడ్, జీూ శ్రీ.=వీఎ.ఆనంద్ రావు, ూూ జష్ట్ర.రమేష్,ూూ శ్రీ.ఇ.సత్యనారాయణ, శ్రీ.శంకరయ్య, శ్రీమతి డాలీ మరియు ఇతరులు పాల్గొన్నారు.

## రామస్వామి క్యాంప్ గ్రామంలో ఉచిత ఫ్యామిలీ హెల్త్ కార్డ్ కార్యక్రమం విజయవంతం



నిజామాబాద్ (ఆలూరు) జనవరి 2 ;రామస్వామి క్యాంప్ గ్రామంలో వెల్నెస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత ఫ్యామిలీ హెల్త్ కార్డ్ నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. గ్రామ ప్రజల ఆరోగ్య భద్రత లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెల్నెస్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ బృందం గ్రామస్తులకు ఫ్యామిలీ హెల్త్ కార్డుల ప్రయోజనాలపై అవగాహన కల్పించి, మొత్తం 110 ఫ్యామిలీ హెల్త్ కార్డులను నమోదు చేశారు. ఈ కార్యక్రమం సుమన్, ప్రమోద్, సిద్దు మరియు ప్రభు చరణ్ పర్యవేక్షణలో సక్రమంగా జరిగింది. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, వెల్నెస్ హాస్పిటల్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ స్థాయిలో ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని గ్రామాల్లో నిర్వహిస్తామని వెల్నెస్ హాస్పిటల్స్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ పసుల పుష్ప మరియు ఉప సర్పంచ్ సైలూ తదితేరులు పాల్గొన్నారు.

## మహబూబ్నగర్ జిల్లాలో జనవరి 2 నుండి జనవరి 31, 2026 వరకు 30 పోలీస్ యాక్ట్ అమలు

### ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసమే చర్యలు : జిల్లా ఎస్పీ డి. జానకి,



మహబూబ్నగర్ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలు కాపాడుటకు, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ దృష్ట్యా జనవరి 2, 2026 ఉదయం 6 గంటల నుండి జనవరి 31, 2026 సాయంత్రం 6 గంటల వరకు భారత పోలీస్ చట్టంలోని 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాలవ్యవధిలో జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాలు, ప్రజాస్థలాలు, రహదారులు, కూడళ్లు, మార్కెట్ ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు తదితర ప్రాంతాలలో శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను నిరోధించేందుకు ఈ చట్టాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న సమయంలో ఐదుగురికి మించి గుంపులుగా కూడరాదు. ఆయుధాలు, కర్రలు, రాళ్లు, ఇతర ప్రమాదకర వస్తువులతో తిరగరాదు. అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించరాదు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే నినాదాలు, చర్యలు నిషేధించబడతాయని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి, చట్ట నిబంధనలను గౌరవిస్తూ శాంతియుత వాతావరణాన్ని కొనసాగించాలని, ఏవైనా అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు.

### రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన దత్తాత్రేయ

సికింద్రాబాద్ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడిన వాళ్ళం అవుతామని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాం చందర్ రావు పేర్కొన్నారు. నారపురాజు సావిత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరానికి బండారు దత్తాత్రేయ, ఎన్ రామచంద్రరావు, బీజేపీ రాష్ట్ర నాయకురాలు కె. మాధవి లత ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని దానాలలో కెల్లా రక్తదానం చాలా గొప్పదని రక్తదానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒకరి ప్రాణాలు నిలబడతాయని అన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com